# గోడలకే ప్రాణముంటే...

నాటికల సంపుటి

డా॥ అమృతలత

# ఆద్యంతం అలరించే అమృత గుళికలు....

**-మల్లాది వెంకట కృష్ణమూర్తి**

తెలుగులో పుస్తకాలుగా వచ్చే వాటిలో నవలలది అగ్ర తాంబులం అయితే, తర్వాతి స్థానాలు కథలూ, కవితలదీ! నాటికలు పుస్తక రూపంలో రావడం అతి తక్కువనే చెప్పాలి. అందులోనూ స్త్రీలు రాసిన నాటికలు ఇంకా అరుదు. ఆ కొరతను ఈ పుస్తకం కొంతదాకా తీరుస్తోంది.

దాదాపు ఇవన్నీ బడి పిల్లల బ్యాక్‌గ్రౌండ్‌తో రాసినవే అవడం విశేషం! నేటి స్కూల్స్‌లో జరిగే అనేక అంశాలని వ్యంగ్యధోరణి ప్రతిబింబించేలా రాసిన ఈ నాటికల్లో సునిశిత హాస్యం తొంగిచూడడమే కాక, ఎవరూ భుజాలు తడుముకోవాల్సిన అవసరంలేని విధంగా ఇతివృత్తాలని మలిచారు రచయిత్రి.

ఇతివృత్తం రీత్యా **'గోడలకే ప్రాణముంటే'** విశిష్ట నాటిక.

'స్టిక్ నో బిల్స్', 'ఇక్కడ మూత్రం పోయరాదు' అని తాటి కాయంత అక్షరాలతో గోడమీద రాసినా - ఎవరి దోవన వాళ్ళు తమ పని కానీయక మానరు అని వ్యంగ్యంగా, కడు రమ్యంగా చిత్రీకరించారు రచయిత్రి.

**'రాగింగ్'** నాటిక నేటి సామాజిక సమస్యని చక్కగా ఆవిష్కరిస్తుంది. మనిషికి తన దాకా వస్తేకానీ బాధ తెలీదు అనే సత్యాన్ని కూడా ఈ నాటికలోని ట్విస్ట్ బోధిస్తుంది.

కాలేజీ రీఓపెనింగ్ రోజుల్లో సీనియర్ విద్యార్థులు - కొత్తగా చేరిన జూనియర్ విద్యార్థులని ర్యాగింగ్ చేస్తూ ఎన్ని అవస్థలకు గురిచేస్తారో చక్కగా చిత్రీకరించారు.

భాషాదురభిమానం ఇతివృత్తంగా రాసిన **'ఎజుకేటెడ్ ఇల్లిటరేట్'**లో ఓ మలయాళీ పాత్రతో మలయాళంలో సంభాషణలు చెప్పించడం ఇంటెలిజెంట్ ఆలోచన.

'జాతీయసమైక్యత' ఆవశ్యకతని అన్యాపదేశంగా ఉద్బోధించే

నాటిక ఇది.

ఇందులో-

'నేను భరతమాతనూ... భరతమాతనేనూ... రెండొందల వత్సరాల తెల్లదొరల చెరలో మగ్గి నేనేర్చుకున్నది ఇంగ్లీషూ నా మాతృభాష సంస్కృతం.' పాట హైలైట్.

**'స్టాఫ్‌రూం'** నాటికలో పాఠాలు బోధించే టీచర్లు సృష్టించే రాజకీయాలూ, వారి కీచులాటలూ ఏ విధంగా వుంటాయో ప్రస్ఫుటంగా చిత్రీకరించారు.

**'స్కూల్ పెట్టిచూడు'** నాటిక విద్యని వ్యాపారంగా మార్చి సమస్యని పరిష్కరించకుండా జటిలం చేసే రాజకీయ నాయకుల బండారాన్ని బయటపెడుతుంది.

విద్యావ్యాపారాన్ని అరికట్టాలని గొంతు చించుకొని ప్రసంగాలిస్తూనే ఆ విద్యని వ్యాపారం చేస్తున్నది రాజకీయ వ్యవస్థేనన్న విషయాన్ని వ్యంగ్యధోరణిలో రచయిత్రి చిత్రీకరించిన తీరు మెచ్చుకోదగ్గది. తెలంగాణా మాండలికాన్ని ఈ నాటికలో చక్కగా చొప్పించారు రచయిత్రి.

బంద్ కల్చర్‌కి బానిసైపోయిన భారతదేశపు స్థితిని కళ్ళకి కట్టినట్లు చక్కటి సెటైర్లతో సాగిన నాటిక **'బంద్‌లూ - రాబందులూ'**.

**'ఈవ్ టీజింగ్'** నాటికలో కో ఎడ్యుకేషన్ వ్యవస్థలో విద్యార్థులు, సహ విద్యార్థినులను ఆటపట్టిస్తూ ఎంత అభాసుపాలవుతారో, చివరకు ఎలాంటి ఛీత్కారాలకూ, అవమానాలకు గురవుతారో చిత్రీకరించారు రచయిత్రి. ఓ పాత్ర ఈ నాటిక చివర్లో డైరెక్ట్‌గా ప్రేక్షకులతో మాట్లాడం తమాషా ముగింపు.

ఈ నాటికలు పత్రికల్లో తొలిసారిగా వెలువడినప్పుడు పాఠకుల నించి వచ్చిన స్పందనని కూడా చివర్లో ఇచ్చారు. హాస్యం, సామాజిక స్పృహల కలగలుపుగా రాసిన ఈ నాటికలు పాఠకులని అలరిస్తాయని ఆశిస్తూ......

# కృతజ్ఞతలు

ఆయన పుస్తకం మన చేతుల్లోకి వస్తే - ఆసాంతం చదివేదాకా - ఓ పట్టాన వదిలిపెట్టలేం !

ఆయన రచనల్లో అనవసరపు వర్ణనలుండవు ! హంగులూ, ఆర్భాటాలూ అసలే ఉండవు !

ఆహ్లాదంగా, హృద్యంగా రచనలు చేసి పాఠకుల్ని అలరించే నవలారచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి గారు - 'గోడలకే ప్రాణముంటే...!' నాటికల సంపుటికి ఎంతో ఆత్మీయంగా 'ముందుమాట' రాశారు. వారికి నా ధన్యవాదాలు.

బాలిగారు గీసిన ముఖచిత్రం, వివిధ నాటికలకి సుభాని, బెన్హర్, నటరాజ్, న్యూట్రాన్, బెన్ని, త్రిగుణ్ మరియు కె. బాబు గీసిన చిత్రాలు ఈ పుస్తకానికి మరింత నిండుదనం చేకూర్చాయి. వారికి నా కృతజ్ఞతలు.

విజయ్ విద్యాసంస్థల నిర్వహణలో.... రెండు దశాబ్దాల పాటు మరుగున పడిపోయిన నా రచనా వ్యాసంగం మీద మక్కువతో - నాతో పోరి - నన్ను ఒప్పించి, ఈ 'గోడలకే ప్రాణముంటే...!' నాటికల సంపుటికి శ్రీకారం చుట్టింది - ఇది అందంగా రూపుదిద్దుకునేదాకా అహర్నిశలూ కృషిచేసింది - మాటవరుసకైనా పరుల గురించి నెగెటివ్‌గా మాట్లాడని మిత్రులు, నిష్కల్మష హృదయులు ఎ. శంకర్ గారు. వారికి నా కృతజ్ఞతలు.

పుస్తక ప్రచురణలో అన్నిటికన్నా కష్టమైందీ... పంటికింద రాయిలా బాధించేదీ... ఆయా పుస్తకాల్లో అనుకోకుండా దర్శనమిచ్చే అచ్చుతప్పులు ! ప్రూఫ్ రీడింగ్ ద్వారా నా పుస్తకాన్ని జల్లెడపట్టి - అచ్చుతప్పుల్ని ఏరిపారేసే కార్యక్రమాన్ని ఓపిగ్గా నిర్వహించింది నా ఫ్రెండ్స్ తుర్లపాటి లక్ష్మి, ఎ. శంకర్, కిరణ్‌బాల, నెల్లుట్ల రమాదేవి, కె. విజయలక్ష్మి. వారి సహాయం వెలకట్టలేనిది.

రాత్రింబవళ్ళూ కృషిచేసి - ఎంతో ఓపికగా డీ.టీ.పీ చేసి పెట్టి - దీనికో అందమైన ఆకృతినిచ్చిన కృష్ణ, మదన్ ల సహకారం మరువలేనిది!

నా నాటికలు ప్రచురించిన ఆంధ్రభూమి వీక్లీ ప్రచురణ కర్తలకు నా నమోవాకాలు!

ఈ నాటికలు ఆంధ్రభూమి వీక్లీలో సీరియల్‌గా వస్తున్నప్పుడు - స్పందించి- 'ముఖాముఖి' శీర్షికలో సమధికోత్సాహంతో పాల్గొని - తమ అమూల్య అభిప్రాయాల్ని వెలిబుచ్చిన పాఠకులకి నా ప్రత్యేక ధన్యవాదాలు.

ఇంకెందరో మహానుభావులు ! అందరికీ వందనాలు !!

01-09-2017



డా.అమృతలత

# సూచిక


1. గోడలకే ప్రాణముంటే.. (ఆంధ్రభూమి - వీక్లీ - 31-01-1991)..........1-21

2. రాగింగ్ (ఆంధ్రభూమి - వీక్లీ - 20-12-1990) ....22-39

3. ఎజుకేటెడ్ ఇల్లిటరేట్ (ఆంధ్రభూమి - వీక్లీ - 13-12-1990) ....40-52

4. స్టాఫ్‌రూమ్ (ఆంధ్రభూమి - మంత్లీ 1989) .............53-66

5. స్కూల్‌పెట్టి చూడు ! (ఆంధ్రభూమి - మంత్లీ 1989)...............67-81

6. బంద్‌లూ-రాబందులూ ...................................1988...............82-96

7. ఈవ్ టీజింగ్ .................................................1970..............97-114

★ పాఠకుల స్పందన ..............................................................115-119

# గోడలకే ప్రాణముందా?



**గేట్ అవతల:**

(రిక్షావాలా వాకిట్లో రిక్షానాపి - నూనె డబ్బాని లోపలికి పట్టుకొస్తాడు)

**సిటౌట్‌లో...**

(గౌరి సిటౌట్‌లో కూర్చుని వీక్లీ తిరగేస్తూ వుంటుంది.)

రిక్షావాలా : రంగారావు గారి ఇల్లు ఇదేనా అమ్మగారూ ?

గౌరి : అవునూ... ఏమిటీ పని ?

రిక్షావాలా : కుషాయిగూడా చెలమయ్య సేట్ నా రిక్షాలో పద్ధెనిమిది కిలోల మంచినూనె డబ్బా ఇచ్చి పంపించారమ్మా - ఎక్కడ పెట్టమంటారు?

గౌరి : అలాగా - అయితే ఇలా నాతోపాటు వచ్చి -

కాస్త వంటింట్లో పెట్టి వెళ్ళుబాబూ !

**వంటిట్లో:**

(రిక్షావాలా నూనె డబ్బా వంటింట్లోదించి - నూనె చేతుల్ని వంటింటి గోడలకి తుడిచి వెళ్ళిపోతాడు. గ్యాస్‌స్టవ్ ఆర్పి పక్కకి తిరిగిన గౌరికి ఆ మరకలు కన్పించి - చిందులు తొక్కుతుంది)

గౌరి : అయ్యో అయ్యో! అద్దంలాంటి గోడను ఎలా పాడుచేశాడో ? ఆ చేతుల్ని ఇంకెక్కడెక్కడ తుడిచాడో ఏమో ?

(రిక్షావాలా వెళ్తూ వెళ్తూ కిటికీలకు వేళ్ళాడుతోన్న కర్టెన్లకి కూడా తన నూనె చేతుల్ని తుడుచుకుంటూ వెళ్ళిపోతాడు)

**డ్రాయింగ్ రూమ్‌లో:**

యమున : గౌరి ఉందాండీ ?

బామ్మ : ఎవరూ ? ఓ నువ్వా యమునా ? రా! రా ! కూర్చో ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకీ? ఏమిటీ విశేషాలు?

యమున : ఆ ఏమీలేదు బామ్మగారూ ! మీ ఇంటిదగ్గర రమేష్ థియేటర్లో గీతాంజలి ఆడుతుందంటేనూ - మార్నింగ్‌షో చూట్టానికి వచ్చాం నేనూ - మా ఆయనా ! అన్నట్టు మీరు వీణ్ణి చూళ్లేదు కదూ! వీడే నా పుత్రరత్నం గోపీ ! వీడు ఇంటర్వెల్‌లో బొమ్మలు కొనమని ఒకటే సతాయిస్తుంటేనూ మధ్యలో వచ్చేశాం.

సినిమా హాల్ నుండి డైరెక్ట్‌గా షాపింగ్‌కి వెళ్ళలేం కదా ! కాస్త ముఖమదీ కడుక్కుని వెళ్దామనీ......

బామ్మ : ఓ, దానికేం ? కడుక్కోండి ! అదిగో బాత్‌రూం అటువేపు ! అమ్మాయ్ గౌరీ... మీ స్నేహితురాలు యమునొచ్చింది!

**వంటిట్లో:**

(గౌరి వంటింట్లో గోడలమీద నూనె మరకలు తుడిచివేయడానికి సర్ఫ్, నీళ్ళూ వగైరా సరంజామాతో కుస్తీపడ్తూ, బామ్మ మాటలు విని:)

గౌరి : ఇదిగో - ఒక్క నిముషం ! వస్తున్నానత్తయ్యా!

**డ్రాయింగ్ రూంలో:**

(గోపీ వాళ్ళ అమ్మ ముఖం కడుక్కోవడానికి బాత్‌రూంకి వెళ్ళగానే....)

గోపి : బామ్మా ! ఆ బాస్కెట్లో అవేమిటీ ? ఓ - మామిడికాయలే ! నాకు మామిడి కాయలంటే భలే ఇష్టం బామ్మా !

(గోపీ తినగల్గిందంతా తిని - దాని జీడితీసి గోడలమీద రాస్తూ....)

గౌరి : బామ్మా నీకు తెలుసా ? ఈ జీడిని ఎంచక్కా చాక్‌పీస్‌లా వాడుకోవచ్చు ! మా మేడం ఈ రోజు స్కూల్లో క్యాట్ స్పెల్లింగ్ నేర్పించారు ! అందరికన్నా ముందు నేనే రాశాను ! ఇప్పుడు రాసి చూపిస్తాను చూడూ ! సియేటీ క్యాట్ -

సియేటీ క్యాట్ - సియేటీ క్యాట్......

(గోపీ గోడలమీద క్యాట్ స్పెల్లింగ్ రాసేస్తూ వుంటాడు)

బామ్మ : ఓరీ, నీ పాండిత్యం మండా ! నీకు మా గోడే దొరికిందా ? నీకీ గోడే పలకైపోయినట్టుందే ! బాబ్బాబూ నీకో కొత్తపలక కొనిస్తాను గానీ- ఏదీ ఆ మామిడి జీడి ఇటుపడెయ్యి నాయనా!

(బామ్మ బలవంతంగా వాడిచేతినుండి లాగేసు కుంటే - వాడు నేలకి కాళ్ళు టపటపా కొట్టు కుంటూ ఆరున్నొక్కరాగం ఆలాపిస్తాడు)

**టీవీ హాల్లో:**

(యమున భర్త ముఖం కడుక్కోని టీవీకెదు రుగా గొడనానుకుని ఎడంకాలు గోడకి మడత పెట్టి దర్జాగా సిగరెట్ వెలిగించి గుప్పుగుప్పుమని పొగ వదుల్తూ విలాసంగా టీవీ చూస్తూ వుంటాడు - గౌరి బయటకు వస్తూ...)

గౌరి : న.... నమస్కా.....

(గౌరి ఆయనకి విష్ చేయబోయి - అతడు నించున్న తీరుచూసి గోడకి మురికి అంటిం చిన అతడి పాదాన్నీ - అదే గోడకి నూనె మరకలంటించిన అతడి జుట్టునీ - మార్చి మార్చి చూస్తూ నోట మాటరాక అలాగే వుండిపోతుంది! అప్పుడే ముఖం కడుక్కుని

వచ్చిన యమున....)

యమున : హాయ్ గౌరీ ! ఏమిటే అలా చిక్కిపోయావ్ ?

(యమున గౌరిని పలకరించి - ఆమె సమాధానం కోసం చూడకుండా - ఏడుస్తోన్న కొడుకు దగ్గరికి వెళ్లి.....)

యమున : ఏంట్రా ? మళ్ళీ ఏమైంది నీకూ ? ఎప్పుడూ ఏడ్చే వెధవకి !

( యమున వాణ్ణి రెండు బాది - వాడి చీమిడి తుడిచి దాన్ని గోడకి రుద్ది, అద్దం దగ్గరికి వెళ్ళి నుదుట సింగార్ కుంకుం పెట్టుకుని-కళ్ళకి చేంతాడు కాటుక పులుముకొని- చేతు లకి అంటుకుని మిగిలిపోయిందంతా - సుబ్బ రంగా గోడకి పూసేస్తూ....)

యమున : అదేమిటి గౌరీ ! నేనొచ్చి పది నిముషాలైందా? బెల్లం కొట్టిన రాయిలా అలా మాటా పలుకు లేకుండా...

గౌరి : అంతా బాగానే వుంది కానీ అదేమిటే ఆ కుంకుం, కాటుకల్ని అలా గోడకి పులిమేశావ్? గోడ ఎలా పాడయిందో చూడూ !

యమున : బడాయి కాకపోతే - రాక రాక వచ్చిన నాతో మాట్లాడాల్సిన మాటలు ఇవేనటే ! అసలు మొన్న ఆ వాణి చెప్తే నమ్మలేదుగానీ ఎంత కొత్తిల్లు కట్టుకుంటే మాత్రం ముడితేనే మీ ఇల్లు మాసిపోయినట్టు అట్లా గింజుకుంటే

ఎట్లాగే ! అయినా ఎవరికైనా ఇంత గర్వం పనికిరాదు గౌరీ! ఏమండీ, అట్లా గుడ్లప్పగించి చూస్తారేం ! పదండి పోదాం ! ఎరక్కపోయి వచ్చాం బోడి కొంపకు !

( ఆ భార్యా భర్తలు, తమ సుపుత్రరత్నంతో అలా బయటికి వెళ్తారో లేదో...)

**సిటౌట్‌లో:**

హెల్త్ ఇన్స్‌పెక్టర్: నేను హెల్త్ ఇన్స్‌పెక్టర్‌నండీ ! గవర్నమెంట్ హాస్పిటల్ నుండి వస్తున్నాను.

బామ్మ : మా ఇంట్లో అంతా బాగానే ఉన్నారు నాయనా!

హె.ఇ : మరి మీ ఇంట్లో మశూచి వ్యాధి సోకిందని ఎవరో కంప్లయింట్ ఇచ్చారే !

(ఇంటి యజమాని రంగారావు బయటి నుండి లోపలికి వస్తూ....)

రంగారావు : అవును బాబూ ! ఆ కంప్లయింట్ ఇచ్చింది నేనే!

హె.ఇ : అహా ! అలాగా ! మరి ఆ పేషెంట్ ఏడీ.... ఎక్కడా ?
(హెల్త్ ఇన్స్‌పెక్టర్ లోపలికి వెళ్ళబోతూ వుంటాడు...)

రంగారావు : ఆగండాగండి ! పేషెంట్ లోపల దొరకడు. బయటకు రండి! చూపిస్తాను !
(ఇద్దరూ గేట్ బయటికి వస్తారు)

**గేట్ అవతల వీధిలో....**

హె.ఇ : అదేమిటండీ మశూచి వ్యాధి వచ్చిన వాళ్ళని అలా వీధిలో తిరగనిస్తే ఎలా ? అది అసలే అంటువ్యాధి కదండీ ? ఇంకెవరికైనా అంటు కుంటే ఎంత ప్రమాదం !

రంగారావు : ఎంత అమాయకులండీ మీరు ! ఈపాటికే అది దేశాన్నంతా కార్చిచ్చులా అంటిస్తేనూ ?

హె.ఇ : దేశాన్నంతా అంటించిందా ?
(హెల్త్ ఇన్స్పెక్టర్ తనను తాను గిల్లుకుని.... స్వగతంగా...)

హె.ఇ : ఏమిటీ.... నేనేమైనా రిప్‌వాన్‌వింకిల్ లాగా ఇరవై ఏళ్ళు నిద్రపోయి ఇప్పుడే లేచివచ్చానా? దేశంలో నా కంటికి అందరూ అందంగానే కన్పిస్తున్నారే ! ఈ ఇంటి యజమాని రంగారావు కూడా అందంగా- ఆరోగ్యంగా ఉన్నాడే... అసలు నాకుగానీ ఈ వ్యాధి సోక లేదు కదా! ముందు నేనెలా ఉన్నానో చూసు కోవాలి... ఓసారి ఈయన్ని అద్దం ఇవ్వమని అడిగితే....

(రంగారావు హెల్త్ ఇన్స్పెక్టర్ భుజం తట్టి:)

రంగారావు : ఏమండీ ! ఏమిటి ఆలోచిస్తున్నారు ? ఇదిగో మీ పేషెంట్!

హె.ఇ : ఏడీ ఎక్కడా ?

రంగారావు : ఇదిగో - ఈ గోడే !

హె.ఇ : ఏమిటండీ ! నన్ను ఆటలు పట్టిస్తున్నారా ?

రంగారావు : ఆటలు పట్టించడమేమిటండీ ! మశూచి వ్యాధి వచ్చిన వాళ్ళని చూపిస్తే వెయ్యి రూపాయల బహుమానం అన్నారుగా. ఇదో నేనీ కాంపౌండ్‌వాల్ని ఎంతో అందంగా కట్టుకున్నాను. కానీ అటు చూడండీ - ఎన్నికల నినాదాల్తో రకరకాల రాతల్తో - అది అమ్మోరు సోకిందాన్లా - ఎంత అందవికారంగా తయారైపోయిందో?

గౌరి : అవునండీ, మీరిచ్చే ఆ వెయ్యి రూపాయలేవో మా గోడలక్కూడా యిస్తే ఆ డబ్బుల్తో మా గోడలకి మళ్ళీ సున్నం వేయించుకుంటాం!

(ఈలోగా గోడమీద రాతలు చూసుకుంటూ ఒక స్కూటరిస్తూ, మరో సైక్లిస్టూ ఎదు రెదురుగా వచ్చి - ఒకర్నొకరు 'ఢీ' కొట్టుకుని వాళ్ళ గేట్‌ముందే కిందపడ్తారు.)

స్కూటరిస్టు : ఏమయ్యా - సరిగ్గా చూసుకుని సైకిల్ నడుప లేవూ ?

సైక్లిస్ట్ : అదేమాట నేనూ అడగొచ్చుకదా సార్ ?

స్కూటరిస్టు : చాలు చాల్లేవయ్యా ! ఎక్కడ ఏ సినిమా ఆడుతుందో చూద్దామని కాస్త గోడలవంక కన్ను తిప్పాను... అంతే ?

సైక్లిస్ట్ : నేనూ అంతే సార్ ! ఈ పోస్టర్లు అతికించడానికి ఎక్కడ ఏ గోడ ఖాళీ ఉందో చూద్దామని ఈ

వేపు కళ్ళు తిప్పాను ! ఇంతే!....

(సైక్లిస్ట్ సైకిల్ లేపి - పోస్టర్లు దులుపుకుని)

సైక్లిస్ట్ : పోన్లెండి ! నా పోస్టర్లు చిరగలేదు ! అదే పదివేలు!

రంగారావు : అయ్యా ! పోస్టర్లవారూ ! రండి రండి ! మీరొక్కరే తక్కువయ్యారని...ఒకటే బాధపడిపోతున్నాను!

(పోస్టర్లు అతికించే సైక్లిస్ట్ సిగ్గుపడ్తూ ఉంటాడు)

రంగారావు : ఫర్వాలేదు ! మా కాంపౌండ్‌వాల్ పుష్పక విమానం ! ఎన్ని పోస్టర్లయినా, ఏ రాతలైనా మోస్తుంది! అలా సిగ్గుపడ్తావేం, ఊ అతికించు.

స్కూటరిస్ట్ : చూడబ్బాయ్ ! నువ్వేమీ అనుకోకపోతే నాదో రిక్వెస్ట్ ! నువ్వు నాలుగు అడుగులువేస్తే మా ఇల్లొస్తుంది ! నాతోపాటు వస్తావా ? మా కాంపౌండ్ వాల్ చూపిస్తాను ! నీకిష్టమున్నన్ని పోస్టర్లు అతికించుకోవచ్చు !

సైక్లిస్ట్ : మీరెంత మంచివాళ్ళు సార్ ! ఎన్నో ఇళ్ళు చూశానుగానీ - మీలాంటి ఇంటాయన్ని ఎక్కడా చూళ్ళేదు ! ఏ పోస్టర్లయినా నేను దొంగతనంగా అతికించేసుకోవాలిగానీ - ఇలా పిలిచి పర్మిషన్ ఇచ్చిన వాళ్ళని ఇన్నాళ్ళకి మీ ఒక్కర్ని చూశాను.

(ఇద్దరూ కలిసి వెళ్ళిపోతూ ఉంటారు)

హె.ఇ : ఇదేమిటండీ - మీరు గోడలమీద రాతలు

వొద్దు పొమ్మంటే ఈయన.......

రంగారావు : అదో చిదంబర రహస్యం లెండి ! ఈయన పోస్టర్లు ఇలా అతికిస్తాడో లేదో - మర్నాడు కాలేజీ కుర్రవాళ్ళు నిద్రలేస్తూనే వాటి నిండా పేడ కొడ్తారు.

గౌరి : పాపం మీకు తెలీదు ! వాళ్ళావిడ ఆ పేడకోసం గద్దలా కాచుక్కూర్చుంటుంది! కాలేజీ కుర్రవాళ్ళు పేడకొట్టి అలా వెళ్తారో లేదో - ఎంచక్కా వాళ్ళావిడ అట్లకాడతో దాన్ని గీకి - అలా - కూడేసిన పేడతో పిడకలు చేస్తారు. రోజూ వాళ్ళు - వాళ్ళ నీళ్ళ బాయిలర్ని దేనితో అంటిస్తారనుకుంటున్నారు ? ఈ పిడకల్తోనే!

హె.ఇ : (హఠాత్తుగా ఎదురింటి గోడ వంక చూసి) అదేమిటి పాపం ! మీ ఎదురింటి వాళ్ళ కాంపౌండ్ వాల్ అలా కరిగిపోతోంది ?

రంగారావు : ఏం చెయ్యమంటారు ! పాపం దానికి ప్రతి రోజూ - షవర్‌బాతేనాయే!

హె.ఇ : ఏమిటీ - షవర్‌బాతే !? అదీ గోడకి ! ఎంత అదృష్టం ! పుట్టి ముప్పయి ఏళ్ళయింది! ఎప్పుడూ వినడమేగాని - ఏనాడూ చూసి ఎరుగనులెండి ! గోడనైనా కాకపోతిని షవరుబాత్ చేయగా... (కూని రాగం తీసి) ఇంతకీ - ఆ షవర్ బాతేమిటో - ఆ కథేమిటో మీరు వివరించలేదు.

రంగారావు : ష్! క్షణం ఆగండి ! మీకే అర్థమవుతుంది !

అదిగో సినిమా వొదిలినట్టున్నారు! ఇక చూడండి, గోడల షవర్‌బాత్‌ల పరంపర !

(సినిమా నుండి బయటికి వచ్చిన వాళ్ళు వంతులవారీగా - ఆ గోడకి అభిముఖంగా తమ పని కానిచ్చేస్తూ వుంటారు. ఆడవాళ్ళు ముఖాన్ని ఇబ్బందిగా పెట్టుకుని మరోవైపు చూస్తూ వెళ్తూ ఉంటారు. హెల్త్ ఇన్స్‌పెక్టర్ ముక్కు మూసుకుని:)

హె.ఇ : నాకు తెలీక అడుగుతాను ! ఆ సినిమా హాల్లో టాయ్‌లెట్స్ వుంటాయిగా ! వీళ్ళంతా వాటి నెందుకు ఉపయోగించుకోరు ?

రంగారావు : అదీ అడిగాను ! దానికి వాళ్ళేం చెప్పారో తెలుసా? సినిమా హాళ్ళ వాళ్ళు వాటిని శుభ్రంగా ఉంచరనీ....

హె.ఇ : అక్కడికీ - ఇక్కడ... ఈ గోడల్దగ్గర శుభ్రం ఏడ్చి చచ్చినట్టు ?

రంగారావు : మీరు కాస్త ఇటు జరగండి ! ఇంకాసేపైతే ఆ వరద ప్రవాహం మీదాకావొస్తుంది! మీ 'షూ' పాడయిపోతాయి!

(హెల్త్ ఇన్స్‌పెక్టర్ తప్పుకుంటాడు. సినిమా హాల్‌నుండి బయటికి వచ్చిన వాళ్ళలో మరి కొంతమంది తమలపాకులు నముల్తూ అదే గోడపై ఖాండ్రించి ఊసేసి వెళ్ళిపోతూ వుంటారు! అదే సమయంలో కూరగాయల తోపుడు బండి మనిషి - తన బండిలోని

మురిగిపోయిన టమాటల్ని - అదే గోడకి విసిరికొడ్తాడు.)

రంగారావు : అన్నట్టు ఈ కూరగాయల్ని చూస్తే గుర్తొచ్చింది. మీరెప్పుడైనా మోండా మార్కెట్ చూశారా ? ఆ మార్కెట్ గేట్‌కి ఎడం పక్కనున్న గోడ- అనుక్షణం షవర్ బాతుల్తో నాన్తూ వుంటే - కుడి పక్కనున్న గోడ దగ్గర కుప్పలు తెప్పలుగా పడివుండే కూరగాయల్ని! ఆ షవర్‌బాత్ ప్రవాహం ఈ కూరగాయల్లోకీ - ఈ కూర గాయల సంచులు ఆ ప్రవాహంలోకీ! అబ్బబ్బ! ఆ దృశ్యం చూడాలేగానీ వర్ణించలేను! అది చూసిన వాళ్ళు మళ్ళీ జన్మలో అక్కడి కూరగాయల్ని తినరు !
(ఇంతలో మరో ముగ్గురు మనుషులు అక్కడికి వస్తారు)

సూపర్‌వైజర్ : రంగారావుగారంటే ఎవరండీ ?

రంగారావు : ఏమిటీ - నేనే ! మళ్ళీ మీరెవరు ? కాలేజీ కుర్రవాళ్ళా ? రాజకీయ పార్టీల కార్యకర్తలా?

సూపర్‌వైజర్ : అదేదీ కాదు సార్ ! మున్సిపాల్టీనుండి వచ్చాం!

రంగారావు : నేను పన్నులన్నీ సక్రమంగానే కట్టానే ! మరి ఎందుకు వచ్చినట్టు!? రండి, లోపలికి వచ్చి కూర్చోండి !

సూపర్‌వైజర్ : మేం కూర్చోటానికి రాలేదు సార్ ! మీరు కట్టిన కాంపౌండ్‌వాల్ అరడుగు ముందుకు జరిగింది! అది రోడ్డు ఎన్‌క్రోచ్‌మెంట్ కాబట్టి కూల

గొట్టమని మాకు ఆర్డర్ ఇచ్చారు ! రంగయ్యా - ఏదీ ఆ పలుగు ఇలా అందుకో!

హె.ఇ : మరి కట్టేటప్పుడు ఏంజేశారు ? కట్టాక తీరిగ్గా కూలగొట్టడానికి వచ్చారు ! కట్టేటప్పుడు పర్మిషన్ ఇవ్వకుండా వుండాల్సింది కదా!

సూపర్‌వైజర్ : బ్లూ ప్రింట్‌లో ఒకలా చూపించారు! ఇప్పుడు మరోలా కట్టారు సార్!

రంగారావు : బ్లూ ప్రింట్‌లో చూపించినట్టే కట్టాను సార్ ! కానీ గోడే ముందుకు జరిగింది !

సూపర్‌వైజర్ : గోడే ముందుకు జరిగిందా ? ఏమయ్యా మేమెలా కన్పడ్తున్నాం నీ కంటికి ?

రంగయ్య : గోడకేమైనా కాళ్ళున్నాయా ముందుకు జరగడానికి ?

రంగారావు : గృహప్రవేశం రోజున సున్నం వేయించాం ! మర్నాడే 'ఆర్థీయస్యూ' వాళ్ళు నినాదాలు రాశారు!

గౌరి : వారం తిరిగే సరికల్లా మా పెద్దమ్మాయి పెళ్ళి నిశ్చయమైంది. మళ్ళీ సున్నం వేయాల్సివచ్చి - మళ్ళీ వేయించాం ! ఈ సారి 'జీబీవీపీ' వాళ్ళు రాసిపోయారు.

రంగారావు : ఇంకో రెండు వారాలు గడిచాయి ! మా అబ్బాయికి కొడుకు పుట్టాడు. బారసాల కదా అని మళ్ళీ సున్నం కొట్టించాను. ఈ సారి 'డూడికల్స్' వాళ్ళు రాసిపోయారు !

బామ్మ : అవున్నాయనా - ఇంతలో మా ముసలాయన హరీ అన్నాడు. పెద్ద కర్మకి సున్నం కొట్టించాం! అవేవో అసెంబ్లీ ఎన్నికలట ! కాంగ్రెస్-ఐ, తెలుగుదేశం, బీజేపీ వాళ్ళు పోటాపోటీలు పడి ఇష్టం వచ్చినట్టు రాతలు రాశారు !

గౌరి : అంతలో మా ఆడబిడ్డను చూడటానికి పెళ్ళివాళ్ళు వస్తున్నామని కబురుచేశారు. గోడలన్నీ అసహ్యంగా ఉన్నాయనీ - నేను వద్దంటోన్న విన్పించుకోకుండా మా ఆయన.....

రంగారావు : మళ్ళీ సున్నం వేయించాను ! ఈసారి కాలేజీ పిల్లల ఎన్నికలట! పెళ్ళివాళ్ళు మా చెల్లెల్ని చూట్టానికి రాకముందే - కాలేజీ అబ్బాయిలు మా గోడల్ని చూసేసీ - అమాంతం మనుసు పడి - గోడల్నిండా వాళ్ళ వాళ్ళ పేర్లు రాసేసి వెళ్ళిపోయారు!

గౌరి : ఇలా పట్టువదలని విక్రమార్కుడిలా మా ఆయన సున్నం కొట్టిస్తూంటే - మా ఓపికను పరీక్షిస్తూ వాళ్ళు రాతలు రాయడం....

బామ్మ : సున్నం కొట్టించడం....రాతలు రాయడం..... సున్నం కొట్టించడం....రాతలు రాయడం..... సున్నం మీద రాతలూ... రాతలమీద సున్నం.... సున్నం మీద రాతలూ... రాతలమీద సున్నం.... పేరుకుపోయి....

రంగారావు : మా 'అడుగు' గోడ మందం - ఇంకో అరడగు

పెరిగి - మా అడుగు గోడ కాస్తా - 'అడుగున్నర' గోడై ముందుకు జరిగింది !

గౌరి : మేం కట్టింది అడుగు గోడే ! దానికి ఇంకో అరడుగు మందాన సున్నం మీద రాతలూ, రాతలమీద సున్నం పేరుకుపోవడంవల్ల... అడుగు గోడ కాస్తా అడుగున్నర గోడై కూర్చుంది... మమ్మేల్నేం చేయమంటారు చెప్పండి !

సూపర్‌వైజర్ : నన్నో సలహా చెప్పమంటారా ?

రంగారావు : ఏమిటదీ ? చెప్పండి ?

సూపర్‌వైజర్ : ఒక పెద్ద బట్టకొనీ ....

రంగారావు : ఊఁ బట్ట కొని...

సూపర్‌వైజర్ : దోమ తెరలాంటి ఒక తెర కుట్టించండి ! దాన్ని రోజూ రాత్రిపూట మీ ఇంటికి తొడిగి, మర్నాడు లేస్తూనే దాన్ని తీసేసేయండి ! ఏం రాసినా - ఆ తెరమీదే రాస్తారు కాబట్టి మీ గోడలు పాడుకావు !

గౌరి : ఏడ్చినట్టుంది సలహా ! ఇంటితెర కుట్టించే స్థోమత మాకెక్కడిదీ ?

సూపర్‌వైజర్ : పోనీ... ఇంకో సలహా చెప్పమంటారా ?

గౌరి : (నీరసంగా) ఏమిటదీ.... ?

సూపర్‌వైజర్ : గోడల మీద సందులేకుండా - మీరే జీబీవీపీ, ఆర్డీయస్సూ్య, డూడికల్స్- మూడు పదాలనూ

ఒకదాని పక్కనొకటి అరంగుళమైనా ఖాళీలేకుండా - రంగురంగుల అక్షరాల్తో... అదోడిజైన్ అన్పించేలా మీరే రాయించండి ! ఇహ వాళ్ళు మీ గోడలు ముట్టుకుంటే ఒట్టు!

రంగారావు : అదీ ఆలోచించాను ! కాని ఎన్నికలప్పుడు కార్యకర్తలు వూరుకోరు కదా ! ఆ డిజైన్ మీద సున్నం కొట్టించి ఫలానా వారికే మీ ఓటు అని రాసి మరీ వెళ్తారు ! బొత్తిగా సివిక్ సెన్స్‌లేదు - ఏం జేస్తాం ?

హె.ఇ : అదిగో - అటు చూడండీ ! అర్ధరాత్రి వీరులు.... విద్యార్థులు ! ఆ చేతుల్లో ఏమిటవీ... ఓహో కుంచెలు !

రంగారావు : కాదు ! కాదు ! అవి వాళ్ళ తుపాకీ గొట్టాలు!

సూపర్‌వైజర్ : ఆ చేతుల్లో ఏమిటది?... ఓహో.... పెయింట్ డబ్బా !

రంగారావు : ఊహుఁ అది వాళ్ళ విల్లంబుల పొది !

(కాలేజీ స్టూడెంట్స్ ప్రవేశిస్తారు ! వాళ్ళకి కన్పడకుండా రంగారావు, హెల్త్ ఇన్స్‌పెక్టర్ తదితరులు... వాళ్ళు చేయబోయే పనులు గమనిస్తూ వుంటారు! రెండు వేర్వేరు గ్రూపులకి చెందిన కాలేజీ స్టూడెంట్స్ -రంగారావుకి పొరుగున వున్న తెల్ల కాంపౌండ్ వాల్‌మీద రాతలు రాయడానికి - పాట పాడ్తూ పోటీలు పడ్తారు.

(ఇది: 'స్నేహమేరా జీవితం' పాటకి పేరడీ)

స్టూడెంట్స్ : ఆ...

ఇంటోడే దిగివచ్చి....

ఇంటోడే దిగివచ్చి....

ఏమయ్యా ఏమిటదీ అంటే...

కుంచెలొద్దూ.... రంగులొద్దూ...

ఎక్కడానికి నిచ్చెనొద్దంటాము!

ఈ యేడూ పై యేడూ...

ప్రతి యేడూ ఈ రీతి...

సున్నమేయమంటామూ....

ఉత్త సున్నమేయమంటాము....

గోడలే...

గోడలే మా ఆస్తులూ...

గోడలే మా ఆయుధం! ॥ గోడలే ॥

గోడలే మాకున్నదీ...

గోడలే మా పెన్నిధీ...

గోడలే.... ఓహోయ్ (గోడలే)

రెండో గ్రూప్ : పగటి పూటా వెళ్ళితే - ఇంటివాళ్ళతో తిప్పలోయ్!

అర్థరాత్రి వెళ్ళితే పోలీసోల్లతో గొడవలోయ్ !

కుంచెనే చేపట్టు భాయీ ॥ కుంచెనే ॥

ఓహో అదియే మనకు హాయ్! ॥ గోడలే ॥

మొదటి గ్రూప్: ఓహోహో ఈ గోడ - చూసింది మేం భాయీ-

ఆ రంగునే కాస్త - ఇలా అందించవోయ్ !

రెండో గ్రూప్ : ఈ గోడ చూసింది మేమోయి !

మరో గోడనే మీరు వెతుక్కోండి.

మొదటి గ్రూప్ : ఇంటోడు మా కడ్డం వస్తాడా ?
కంప్లయింట్ ఎవడైన ఇస్తాడా ? ॥ ఇంటోడు॥

రెండో గ్రూప్ : కలపమంటావా ................ ?

కలపమంటావా ఆ నల్లరంగు !

వేయమంటావా ఈ నీలిరంగు !

ఎవరడ్డు - వస్తారో చూస్తామూ -

వస్తే - వాడంతు చూస్తామూ ॥ ఎవరడ్డు ॥

మనస్సంతా ఉప్పొంగే...

మనస్సంతా ఉప్పొంగే....

మొదలెట్టరా నాన్నా.

మొదటి గ్రూప్ : ఒక్క గోడే చాలు ! వొద్దులే సిగరెట్లు!
అహఁ... అహఁ... అహఁ...

ఒక్క గోడే చాలు ! వొద్దులే సిగరెట్లు !

ఆ పక్క మొదలెట్టి - ఈ పక్క- రా నాన్నా !

అహఁ అహఁ....

రాసెరా ............................................ !

రాసెరా మా వాడు... రాసెర - గుండ్రంగా !

రాసెరా మా వాడు - స్లోగన్స్ - నిండుగా! ॥
గోడలే ॥

సూరిబాబు : ఒరేయ్ ! సుత్తి సూరిబాబుకే మా ఓటు ! (తన్మయత్వంగా) అబ్బ! ఎంత అందంగా రాశావురా నా పేరు !

రంగారావు : ఏమయ్యా - గోడల మీద రాసేకన్నా - పాంప్లెట్స్ వేసుకుంటే పోదూ? బ్యానర్స్ కట్టుకుంటే పోలా?

సూరిబాబు : అయ్ బాబోయ్ ! బానర్స్ ! అంత డబ్బు నాకెక్కడిదీ ?

నరేష్ : అవునండీ ! పాపం, మొన్న బియ్యే ఫైనల్ వాళ్ళకి బీరు సీసాలిప్పించడానికీ, నిన్న ఇంటర్ ఫైనల్ వాళ్ళకి తలా ఓ సిగరెట్ పెట్టె ఇప్పించ డానికీ - వాడి డబ్బంతా అయిపోయింది ! ఇక మా వాడికి బ్యానర్స్ కట్టడానికి డబ్బెక్క డిదీ ?

రాజబాబు : బ్యానర్స్ కట్టడానికి డబ్బులేక కాదుసార్ ! గోడలమీద పేర్లు రాస్తే- ఓడినా, గెల్చినా - ఆ పేర్లు ఓ సంవత్సరం దాకా మనకి కన్పిస్తూ వుంటే ఎంత థ్రిల్లింగ్ - ఎంత హాయి, ఏం కథా ?

సూరిబాబు : పైగా గోడల మీద పేర్లు రాస్తే - ఎంతమంది చూస్తారు! ఎంత 'ఐ' క్యాచింగ్‌గా వుంటుం

దీ? ఎంత అడ్వర్టయిజ్‌మెంట్ జరుగుతుందీ..

వినయ్ : ఒరేయ్.... ఇలా రారా !

సూరిబాబు : (వినయ్ దగ్గరికి వచ్చి) ఏమిటీ - ఎందుకూ?

వినయ్ : కాస్త వెనక్కి తిరగరా !

(వినయ్ సూరిబాబు షర్టు వెనకాల 'సుత్తి సూరిబాబుకే మన ఓటు' అని రాసేసి:)

వినయ్ : ఒరేయ్ - గోడ మీద రాస్తే - ఆ గోడ దగ్గరికి మనుషులు వస్తేనే కదా అడ్వర్‌టయిజ్ మెంట్ అయ్యేది ! అదే - నీ షర్టుమీద రాస్తే... నువ్వేటు తిరిగితే అటూ- ఎన్నెన్ని రకాల మనుషులూ... ఎన్నెన్ని చోట్లా - నీ అడ్వర్టయిజ్‌మెంట్ చూస్తారు చెప్పూ ?

రాజబాబు : అవునవునూ... ఈ గోడలైతే పాపం ఎటూ కదల్లేవు ! నువ్వయితే ఒక్కచోట కట్టేసినా సరే... కదలకుండా కూర్చోవాయే !

వినయ్ : బస్టాండ్‌లో, కాఫీ క్లబ్‌లో, విమెన్స్ కాలేజీ ముందు, గర్ల్స్‌హైస్కూల్ దగ్గర - ఎక్కడ పడ్తే అక్కడ... నువ్వే... సుత్తి సూరిబాబుకే మీ ఓటంటూ నీ అడ్వర్టయిజ్‌మెంటే ! ఎలా వుంది మన ఐడియా ?

సూరిబాబు : యూ ఫూల్ ! మా మామగార్ని ఆర్నెల్లనించి - పోరీ పోరీ ఈ షర్ట్ కుట్టించుకున్నాను ! కనీసం ఒక్క రోజైనా తొడిగి నా మోజు తీర్చు కోలేదు! అపుడే - అడ్డమైన రాతలు రాస్తావట్రా వెధవా?

(సూరిబాబు వినయ్‌తో తలపడ్తారు. రాజబాబు సూరిబాబుని రెండు అంటించి:)

రాజబాబు : ఏరా... తనదాకా వస్తేగానీ అన్నట్టు....నువ్వు పొద్దుణ్ణుంచీ, వూళ్లోవాళ్ల గోడల్ని పాడుచేయగా లేందీ - వినయ్‌గాడు నీ షర్టు పాడుచేస్తే తప్పొచ్చిందా ?

(సూరిబాబు, రాజబాబు దెబ్బలకు తట్టుకోలేక కుయ్యోమొర్రోమంటాడు... ఆ మర్నాడు రంగారావు గోడమీద మరో రాత:...)

*'గోడల మీద రాతలు రాయని వాళ్లకే మా ఓటు !'*

(తెర)

***'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -***
***తేదీ: 31-01-1991***

# రాగింగ్



ఆనంద్ : ఒరేయ్ అజయ్ ! ఎందుకలా దిగులుగా వున్నావ్? ఈ రోజు మన కాలేజీ రీ ఓపెనింగ్! ఇది మనకి 'స్పెషల్ డే' మరిచి పోయావా?

గోపాల్ : అవునవును!... భలే మంచిరోజు.... పసందైన రోజూ - వసంతాలు పూచే నేటి రోజూ... ఆ... జూనియర్స్ వచ్చే... నేటి రోజూ !

అజయ్ : అదిగో అలా పాడావో లేదో - జూనియర్స్ వచ్చేస్తున్నార్రా! వాళ్ళనో పట్టు పడ్దామా ?

ఆనంద్ : వైనాట్ ? వియార్ రెడీ !

(జూనియర్స్ బిత్తర చూపులు చూస్తూ

ప్రవేశిస్తారు)

గోపాల్ : ఏమోయ్ ! నీ పేరు ?

రతన్ : రతన్.

ఆనంద్ : నీ పేరు ?

కిషోర్ : కిషోర్.

గోపాల్ : వరుసగా మీ అందరి పేర్లూ చెప్పండి !

(అందరూ - రామూ, సోమూ, రమేష్, సుకేష్, అరవింద్, గోవింద్, రవి, రాజా అంటూ వరుసగా తమ పేర్లు చెప్తారు)

ఆనంద్ : మీ పేర్లు తెలిశాయి ! చక్కటి పేర్లు ! ఫర్వా లేదు- అమ్మాయిలకి నచ్చుతాయి !

గోపాల్ : అయినా - ఒరేయ్ జూనియర్సూ...! మీకు బొత్తిగా మ్యానర్స్ లేవేంరా? మాకు మీ పేర్లు తెలిశాయి! మీకు మా పేర్లేమిటో తెలుసుకోవాలని లేదా?

రతన్ : (నీళ్ళు నములుత్తూ) ఉంది.

అజయ్ : ఉందీ!? ఏమిటా ఉందీ? ఎంత పొగర్రా నీకు! మర్యాదగా మాట్లాడాలి ! వేం మీకు సీనియర్స్మి ! మీరు మమ్మల్ని 'సార్' అనాలి! అర్థమైందా ? ఆ ఇప్పుడు చెప్పు ! మా పేర్లు తెలుసుకోవాలని వుందా ?

రతన్ : ఉంది సార్ !

గోపాల్ : గుడ్ ! ఇపుడు అడగండీ ! ఎలా అడగాలో

తెలుసా ! 'ఓ మైటీ మైటీ సీనియర్ ! అయాం డర్టీ డర్టీ జూనియర్ ! మే ఐ నో యువర్ నేం సార్ అనీ ! ఏదీ అడుగూ !

రతన్ : ఓ మైటీ మైటీ సీనియర్ ! అయాం డర్టీ డర్టీ జూనియర్ ! మే ఐ నో యువర్ నేం సార్ !

గోపాల్ : గుడ్ ! బావుంది ! ఏయ్ రామూ.... ఇప్పుడు నీ వంతు ! నువ్వు అంత పొడుగ్గా అడక్కుండా .... 'మే ఐ నో యువర్ నేం సార్?' అని అడగాలి... కాని ప్రతి పదం తర్వాత - 'సార్' అనాలి!

రామూ : చెప్తాను సార్ ! మే సార్ - ఐ సార్ - నో సార్ - యువర్ సార్- నేం సార్?

గోపాల్ : అదిగో మళ్ళీ తప్పుచెప్పావ్ ! ఏరా ఆనంద్ ఆ బెత్తమిలా తే !

రామూ : తప్పాసార్ ? ఎక్కడ సార్ ?

గోపాల్ : సార్ తర్వాత సార్ అన్లేదు ! ఊ మళ్ళీ చెప్పు!

రామూ : ఇప్పుడు కరెక్ట్‌గా చెప్తాను సార్ ! కొట్టకండి సార్! మే సార్ - ఐ సార్ - నో సార్ - యువర్ సార్ - నేం సార్ - సార్ సార్ ? సరిగ్గా చెప్పానా సార్ ?

ఆనంద్ : ఒరేయ్ కిషోర్ ! నీ 'షూ' బావున్నాయిరా ! ఎక్కడ కొన్నావురా?

కిషోర్ : 'బాటా'లో సార్ !

ఆనంద్ : నువ్వు సోమూ కదూ !

సోము : అవును సార్ !

ఆనంద్ : నీ షూ ఎక్కడ కొన్నావ్ ?

సోము : 'ఈజీ' లో సార్ !

ఆనంద్ : ఓహో- ఆ షూ - ఈ షూ - రెండూ బావున్నా యిరా! - ఏదీ కాస్త విప్పి చూపించండి ! (ఇద్దరూ షూ విప్పుతారు! ఇద్దరూ చెరో షూ విప్పాక)

ఆనంద్ : స్టాప్ ! ఇదిగో కిషోర్ - ఆ సోమూ షూ నువ్వూ - నీ షూ ఆ సోమూ వేసుకోవాలి ! ఇద్దరూ ఈ రోజు ఇంటికి ఇలాగే వెళ్ళాలి! అర్థమైందా?

కిషోర్ : నాది 'బ్లాక్' షూ సార్ !

సోము : నాది 'బ్రౌన్' షూ సార్ !

కిషోర్ : ఆ కాలికో కలర్, ఈ కాలికో కలర్ వేసు కుంటే... అందరూ నవ్వుతారు సార్ !

ఆనంద్ : నోర్మూయ్ ! అదంతా మాకు అనవసరం ! జూనియర్స్ అయ్యుండీ - భయభక్తుల్లే కుండా పెద్ద హీరోల్లా - ఇప్పుడే షూ వేసుకొని కాలేజికి వస్తారా ? ఎంతధైర్యం? కమాన్ - ఒకరి షూ మరొకరు తొడుక్కోండి!

కిషోర్ : అలాగేసార్ (ఇద్దరూ చెరో షూ వేసుకుంటారు)

గోపాల్ : రేయ్ సుకేష్ ! ఇదిగో ఈ పూలు రెండు చెవుల్లో పెట్టుకుని - నీ దోసిట్లో నిండా పూలు పట్టుకుని - అదిగో - అక్కడ కాలేజీ కారిడార్లో అమ్మాయిలు తిరుగుతున్నారు చూడూ -

వాళ్ళకి అమ్మి రావాలి! ఆగాగు - ఆ టక్ తీసెయ్ ! నీ ప్యాంట్ కాస్త ఒకటి మడుచుకో! (సుకేష్ వంగి, ప్యాంట్ పైకి మడుచుకుంటాడు) అద్గదీ ! అలా ! ఈ అవతారం బాగుంది! ఆ - ఇప్పుడు వెళ్ళు ! (సుకేష్ వాళ్ళు చెప్పినట్టే వెళ్తాడు)

గోపాల్ : నీ పేరేమిటోయ్ !

రవి : రవి

గోపాల్ : ఓహో రవి శాస్త్రినా ? సరే - చూడు రవిశాస్త్రీ! ఇప్పుడు నీకో కార్యక్రమం చెప్తాను ! నీ ముందూ వెనుకా పదిమంది నీ క్లాస్‌మేట్స్ వున్నారు కదూ! నీ వెనుక వాణ్ణి నువ్వూ - నీ వెనుకవాడు... ఆ వెనుక వాణ్ణీ తిట్టుకుంటూ పోవాలి !

రవి : నో - నాకు తిట్లు చేతకావు సార్ !

గోపాల్ : యూ రాస్కెల్ ! తిడ్తావా లేదా ! అదీ అచ్చ తెలుగు తిట్లు ! ఊఁ కానీ....

రవి : (వెనుకనున్న స్టూడెంట్‌ని చూసి) గానుగెద్దూ...

వెనుకవున్న
స్టూడెంట్ : (తన వెనుకనున్న స్టూడెంట్‌ని చూసి) తాటి మొద్దూ.... (ఆ రకంగా ఆ పది మంది స్టూడెంట్స్- తమ వెనుకనున్న వాళ్ళని... రుబ్బురోలు - నల్లబల్లీ - ఎర్రతేలూ - మండ్ర గప్పా - రాచ్చిప్పా- లొట్టిపిట్టా - పిట్టరెట్టా -

అంటూ తమ నోటికొచ్చిన తిట్లతో పలకరిస్తారు)

గోపాల్ : అరే - బేకూఫ్ ! తిట్లంటే అవా ?

రవి : మరి మాకు తిట్లంటే ఎలా ఉంటాయో ఎవరూ నేర్పలేదుసార్!

గోపాల్ : మీ పని ఇలా వుందా ? (చప్పట్లు చరిచి) ఎవరక్కడ ?

గోవింద్ : సార్ !

గోపాల్ : యూఫూల్ ! సార్ కాదు... 'మహాప్రభూ' అని రావాలి ! ఇదిగో మళ్ళీ - (మళ్ళీ చప్పట్లు చరచి)

ఎవరక్కడ ?

గోవింద్ : మహాప్రభూ !

గోపాల్ : గుడ్... నీ పేరు....

గోవింద్ : గోవింద్ ప్రభూ !

గోపాల్ : చూడు గోవింద్ ! నీకు హోండా నడపడం వచ్చా?

గోవింద్ : (సంతోషంగా) వచ్చు మహాప్రభూ ! నడప మంటారా ?

గోపాల్ : ఊ ! ఇదిగో - ఇక్కడి నుండి ఆ కన్పించే గేట్ దాకా - హోండా నడుపుతున్నట్టు గాల్లో యాక్షన్ చేయాలి!

గోవింద్ : (నిరుత్సాహంగా) సరే ప్రభూ ! -

జూఁమ్ (నోటితో హోండా స్టార్ట్‌చేసిన శబ్దం) జూఁమ్ ! (యాక్సి లేటర్ నొక్కిన శబ్దం) పిపీప్ (హారన్ శబ్దం) జూమ్ (యాక్సిలేటర్ నొక్కిన శబ్దం) పిపీప్ (హారన్ శబ్దం) - టుర్ర్ (గేర్ వేసిన యాక్షన్) కీచ్ (బ్రేక్ వేసిన శబ్దం) - జూయ్ (రివర్స్ నడపడం)

ఆనంద్ : గుడ్ ! నడిపింది చాలు ! వీళ్ళకి తిట్టుకోవడం రాదట ! పనిష్మెంట్‌గా - ఈ వెధవలకి - యాక్సిడెంట్ చెయ్యి !

(గోవింద్ వాళ్ళందరి మీదికి ఉత్తిత్తి హోండా పోనిచ్చి - వాళ్ళకు యాక్సిడెంట్ చేసినట్టు, తన హోండాతో సహా - వాళ్ళమీద పడ్తాడు! వాళ్ళు 'అమ్మా అమ్మా' అంటూ మూల్గుతూ వుంటారు! గోవింద్ వాళ్ళందరి మీద నుండి హోండా తీసినట్టు నటిస్తాడు)

ఆనంద్ : బాగైంది వెధవలకి ! లేకపోతే - తెలుగు తిట్లు సరిగ్గా తిట్టుకోండిరా వెధవల్లారా అంటే - తిట్లే తెలియనట్టు నటిస్తారా ? ఏమోయ్ గోవింద్!

గోవింద్ : మహాప్రభూ !

ఆనంద్ : నువ్వు వీరోచితంగా హోండా నడిపి - ఆ వెధవలందర్కీ తగిన శాస్తి చేసినందుకు బహుమతిగా నీకో మణిహారం కానుగ్గా ఇస్తున్నాం!

గోవింద్ : ధన్యోస్మి ప్రభూ !

ఆనంద్ : (చప్పట్లు చరిచి) ఎవరక్కడ ?

కిషోర్ : (వస్తూ) మహాప్రభూ!

ఆనంద్ : అదిగో - ఆ టేబుల్ మీదున్న మణిహారం - ఈ వీరుడి మెళ్ళో వేసి మమ్మానందింప జెయ్యి!

కిషోర్ : చిత్తం ప్రభూ !
(టేబుల్ మీద రెడీగా ఉన్న చెప్పుల దండని చూసి గతుక్కు మని... విధిలేక - దాన్ని తీసుకొచ్చి గోవింద్ మెడలో వేస్తాడు)

గోపాల్ : ఊ... నిలువుగుడ్లేసుకుని అలా చూస్తారేరా!? చప్పట్లు కొట్టండి (వాళ్ళంతా నీరసంగా చప్పట్లు కొడ్తారు) - చప్పట్లు అంత చప్పగానా? ఊ ( జోరుగా కొట్టండి !
(అందరూ జోరుగా చప్పట్లు కొడ్తారు)

గోపాల్ : ఇదిగో - నీ పేరేమిటో ?

అరవింద్ : అరవింద్ సార్ !

గోపాల్ : చూడు అరవింద్ ! నీకు స్టోన్స్ విసరడం వచ్చా?

అరవింద్ : అదేం కష్టమైన పని సార్ ? విసరగలను!

గోపాల్ : బాగా విసరగలవా ?

అరవింద్ : ఓ ! జావలిన్ త్రోలో - డిస్కస్‌లో, షార్ట్‌పుట్‌లో మా స్కూల్లో నేనే ఫస్ట్ సార్ !

గోపాల్ : ఏదీ - ఈ రాయి విసురు !

(అరవింద్ ఆ రాయి విసుర్తాడు ! అది చాలా దూరం వెళ్ళిపడ్తుంది)

గోపాల్ : గుడ్! నువ్వు భలే విసిరావోయ్ ! నిన్ను నిజంగా అప్రిషియేట్ చేయాలి ! సరే గానీ ఇదిగో - ఈ అగ్గిపుల్లని తీసుకొని - దాంతో ఇక్కడి నుండి అక్కడిదాకా కొలిచి - మొత్తం అది ఎన్ని అగ్గిపుల్లలంత దూరముందో కనుక్కో (అరవింద్ గుడ్లు తెలేస్తాడు) ఊఁ చూస్తావేం? వెళ్ళు !

(అరవింద్ అగ్గిపుల్లను తీసుకుని కొలుచుకుంటూ వెళ్తాడు)

ఆనంద్ : చూడవోయ్ - నీ పేరు ?

రాజా : రాజా సార్ !

ఆనంద్ : చూడోయ్ రాజా ! అక్కడ తోకాడిస్తూ నించుంది ఎవరంటావ్?

రాజా : ఏదో ఊరకుక్కసార్ !

ఆనంద్ : దాన్ని తోకతో లాక్కొచ్చి - నాకివ్వాలి! అదీ అయిదు నిమిషాల్లో!

రాజా : అది దొరకదు సార్ ! పైగా అది గజ్జికుక్క సార్! చూడటానికి పిచ్చి కుక్కలా కూడా వుందిసార్!

ఆనంద్ : నోర్మూయ్ ! చెప్పింది చెప్పినట్టు చెయ్యి!

రాజా : సరే సార్ !

(రాజా కుక్కవెంట పడ్తాడు ! అది దొరకదు ! రొప్పుతూ రోజుతూ వుంటాడు)

అజయ్ : ఒరేయ్ రాముా - నీకు ఫాంటమ్ వేషం ఎలా

వుంటుందో తెలుసా ?

రాము : తెలీదు సార్ !

అజయ్ : రేపు మన కాలేజీలో నీకు డ్రామాలో వేషం ఇస్తే ఏం చేస్తావురా వెర్రి నాగన్నా ?

రామూ : డైరెక్టర్ని అడుగుతా సార్ !

అజయ్ : డైరెక్టర్ని అడిగావంటే - నువ్వు ఛస్తే సెలెక్ట్ కావురా వెర్రిసన్నాసీ- చూడూ - ఆ వేషం ఎలా వెయ్యాలో నే చెప్తా ! నువ్వు వెయ్యి!

రాము : ఇప్పుడాసార్ !?

అజయ్ : ఆఁ ఇప్పుడే !

రాము : అలాగే సార్ !

అజయ్ : ఇదిగో - ఇదేమిటీ ?

అజయ్ : బనీన్ సార్ !

అజయ్ : ఇది నీ షర్ట్‌మీద వేసుకో !

రాము : (భయంగా) అలాగేసార్

(షర్ట్‌మీద బనీను వేసుకుంటాడు)

అజయ్ : ఇదిగో ఇదేమిటి ?

రాము : డ్రాయర్ సార్ !

అజయ్ : ఇది నీ ప్యాంట్‌మీద వేసుకో !

(రామూ సందేహిస్తూ వుంటాడు)

అజయ్ : (హూంకరిస్తూ): ఊఁ వేసుకో !

రాము : అలాగేసార్ !

(రాముా ప్యాంట్‌మీద డ్రాయర్ వేసు కుంటాడు)

సీనియర్స్ : (పాడ్తూ) ఓహోహో ఫాంటమ్ ! ఓ మైడియర్ ఫాంటమ్! ఉయ్ లైక్యూ వెరీమచ్ ! ఉయ్ లవ్యూ వెరీ మచ్ !

అరవింద్ : (ప్రవేశిస్తూ) సర్ - ఇక్కడి నుండీ అక్కడి దాకా - ఏడువేల తొంబది తొమ్మిది అగ్గిపుల్లలంత దూరం వుందిసార్ !

గోపాల్ : షటప్! నీ మెజర్‌మెంట్ తప్పు! నువ్వు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మెజర్ చేయలేదు - అంతకన్నా - ఇంకా దూరముంది ! మళ్ళీ కొలువు!

(అరవింద్... నీరసంగా మళ్ళీ కొలవడానికి బయలుదేరుతాడు)

ఆనంద్ : ఒరేయ్ హిప్పీ జుట్టూ ! ఇది పాత ఫ్యాషన్ కదరా! నీకెందుకురా జులపాలూ ?

సుకేష్ : నాది హిప్పీ జుట్టు కాదు బాబోయ్ ! ఇంజ నీరింగ్‌లో సీట్ దొరికితే- తలనీలాలిస్తానని... మొక్కుకున్నా దేవుడోయ్!

ఆనంద్ : ఈ హిప్పీ జుట్టుతో అచ్చం ఆడపిల్లలా ముద్దొస్తున్నావ్ కదరా ! ఏదీ - ఆ జుట్టుతో కాస్త పోనీటెయిల్ వెయ్యి చూద్దాం !

సుకేష్ : అందరూ నవ్వుతారు సార్!

ఆనంద్ : చెప్పినట్టు చేస్తావా - లేదా ?

సుకేష్ : అలాగే సార్ !

(అందరూ నవ్వుతారు ! ఇంతలో రాజా ప్రవేశించి)

రాజా : సార్ ! నన్ను కుక్కతోక పట్టుకుని.... దాన్ని మీ దగ్గరికి తీసుకురమ్మన్నారు ! కుక్క చిక్క లేదుగానీ... దాని తోక ఊడి... ఇదిగో... నా చేతిలోనే వుండిపోయింది!

ఆనంద్ : ఆఁ (తేరుకొని) సరే.... ఏదీ... ఆ తోక ! తోక బావుందోయ్ ! చూడూ... ఈ పూటకి ఈ తోకతో సరిపుచ్చుకుందాం !

గోపాల్ : కానీ, చూడవోయ్ రాజా ! కుక్క తోక వంకరంటారు కదా ! నువ్వు సాయంత్రం దాకా ఆ తోకని చక్కగా చేసి - మాకు చూపించాలి! అర్థమైందా ?

రాజా : (ఏడ్పు ముఖంతో) అర్థమైంది సార్ !

అజయ్ : రేయ్ రతన్ ! ఇదిగో - ఇక్కడ నేలమీద సైన్ కర్వ్ గీస్తాను ! నేను పైకి గీసినప్పుడు నవ్వాలి! కిందకు గీసినప్పుడు ఏడ్వాలి ! తెలిసిందా - ఏయ్ నీకే?

రతన్ : తెలిసింది సార్ !

అజయ్ : ఊఁ క్యారీ ఆన్ !

(అజయ్ పైకి గీచినపుడు రతన్ అహ్హాహ్హా అని నవ్వుతూ - కిందకు గీచినపుడు ఈ....ఈ....ఈ.... అని ఏడుస్తూవుంటాడు అలా

రెండు మూడు సార్లు అయ్యాక...)

అజయ్ : ఏయ్ ! ఎవరక్కడ ?

సోము : మహాప్రభూ !

అజయ్ : సరిగ్గా నవ్వడం - ఏడ్వడం కూడా రాని ఈ ద్రోహిని వంగో బెట్టండి.

సోమూ : చిత్తం ప్రభూ !

అజయ్ : (రతన్‌ని చూస్తూ) ఊఁ ఒంగో ! వంగోవడం అలాకాదు! చిన్న పిల్లలు తాతయ్య మీదెక్కి గుర్రం ఆట ఆడ్తారే - అలా !

రతన్ : అలాగే సార్ !

గోపాల్ : ఏమోయ్ గోవింద్ ! నువ్వు ఇప్పుడు దుర్యోధన మహారాజువి! వీడు - నీ సింహాసనం ! నువ్వు వీడి వీపుమీద కూర్చోవాలి ! (గోవింద్ రతన్ వీపు మీద కూర్చుంటాడు) అలా ఆడపిల్లలా కులుకుతూ కూర్చుంటావేం ? మీసమ్మీద చెయ్యేసుకుని - ఎన్టీఆర్ లెవల్లో దర్జాగా కూర్చో!
(గోవింద్ దర్జాగా కూర్చుంటాడు)

ఆనంద్ : ఒరే రామూ....

రాము : ఎస్సార్ !

ఆనంద్ : అరే సోమూ...

సోము : ఎస్సార్ !

ఆనంద్ : మీరిద్దరూ - దుర్యోధన మహారాజుగారి

ఆస్థానంలో నాట్య గత్తెలు! సో - మీరిప్పుడు పాట పాడ్తూ డాన్స్ చేయాలి !

రాము : నాకు పాటరాదు కుయ్యో ! 

సోము : నేను ఆడలేను మొర్రో !

ఆనంద్ : నోర్ముయ్యండి ! చెప్పింది - చెప్పినట్టు చేస్తారా లేదా ?

సోము,రామూ : సరే సార్ ! సరిలేరు... నీకెవ్వరూ... నరపాల సుధాకరా...సరిలేరు నీకెవ్వరూ !

సోము : సిరిలోనగానీ....

రాము : మగసిరిలోనగానీ....

ఆనంద్ : (రహస్యం చెప్తోన్న వాడిలా) ఒరేయ్ రతన్ ! నువ్వు నీ మీద పోజుపెట్టి కూర్చున్నాడే - దుర్యోధనుడు ! వాణ్ణి - అదను చూసి గర్వభంగం చేయాలి- తెలిసిందా ?

రతన్ : (గోవింద్ బరువుకి రొప్పుతూ) సరే సార్!

సోము,రాము: సరే సార్ ! సరిలేరు... నీకెవ్వరూ... నరపాల సుధాకరా...సరిలేరు నీకెవ్వరూ ! - సిరిలోన గానీ - మగసిరిలోన గానీ !

(గుఱ్రంలా వంగున్న రతన్ దభేలున పడు కుంటాడు ! మీసాలు సవరించుకుంటూ దర్జాగా కూర్చున్న దుర్యోధన మహారాజు బ్యాలెన్స్ తప్పి కింద పడ్తాడు - దుర్యోధన మహారాజు నడుం పట్టుకొని లేవలేక లేవలేక లేస్తూంటే - సీనియర్స్ పడి పడీ నవ్వుతారు!)

గోపాల్ : అరే! నువ్వు రోజూ ఎక్సర్‌సైజ్ చేస్తావుట్రా !

కిషోర్ : అవున్సార్!

గోపాల్ : అబ్బ ! నీ ఒళ్ళూ - అదీ - ధగధగా మెరిసిపోతూ ఆడపిల్లల్ని ఊరించేలా - ఎంత అందంగా ఉందిరా !

కిషోర్ : (ఉబ్బితబ్బివుతూ) అవున్సార్ !

గోపాల్ : కండలు తిరిగిన శరీరంతో - నువ్వు టార్జాన్లా వున్నావుగానీ - ఏదీ అడవుల్లో టార్జాన్ లౌడ లౌడా అరుస్తాడు చూడూ - అలా అరువ్!

కిషోర్ : నేనెప్పుడూ టార్జాన్ని చూళ్ళేదుసార్ !

గోపాల్ : అరుస్తావాలేదా ? పిచ్చి పిచ్చి అరుపులూ... భయంకరంగా - అదీ - ఆ అరుపులెవరికీ అర్థం కాకుండా - అరవాలి !

(కిషోర్ - గోపాల్ చెప్పినట్టే - గుండెలు బాదుకుంటూ - కాల్చేతులు కొట్టుకుంటూ - పిచ్చిపిచ్చిగా వాళ్ళు చెప్పినట్టే అరుస్తాడు)

అజయ్ : ఒరేయ్ రవీ ! నీకు గుంజీల్తీయడం వచ్చా?

రవి : (దిగులుగా) వచ్చుసార్ ! కానీ - నాకసలే రికెట్స్! సరిగ్గా నించోలేను !

అజయ్ : ఏదీ ఒక పది గుంజిల్తీయ్ చాలు ! నిన్నొదిలి పెడ్తాం !

రవి : (సంతోషంగా) ఓ ! పదిగుంజీలే కదా ! తీస్తాను సార్ !

అజయ్ : రెడీ, నౌ స్టార్ట్! వన్ ! టూ ! త్రీ! ఫోర్! ఫైవ్! సిక్స్! సెవన్ ! ఎయిట్! నైన్ (రవి - టెన్ అనుకొని లేవబోతాడు) నోనో - క్యారీ ఆన్ ! నైన్ వన్! నైన్ టూ ! నైన్ త్రీ ! నైన్ ఫోర్ ! నైన్ ఫైవ్ ! నైన్ సిక్స్! నైన్ సెవన్ ! నైన్ ఎయిట్! నైన్ నైన్! (మళ్ళీ రవి టెన్ అనుకొని కూర్చోబోతాడు) నైన్... నైన్ వన్! నైన్.... నైన్టూ ! నైన్...నైన్ త్రీ! నైన్... నైన్ఫోర్ ! నైన్... నైన్ ఫైవ్ ! నైన్... నైన్ సిక్స్ ! నైన్.. నైన్ సెవన్ ! నైన్.. నైన్ ఎయిట్! నైన్... నైన్ నైన్ !

గోపాల్ : చాలు చాల్లేరా ! పాపం అసలే రికెట్స్ అన్నాడు! ఛస్తాడు !
ఒరేయ్ అజయ్ ! మన ప్రిన్సిపాల్ వస్తున్నారు!

అజయ్ : ఈజిట్ !

గోపాల్ : చూడు, మిస్టర్ రాజా ! ఆ వస్తోంది ఎవరో తెలుసా?

రాజా : ఇందాక మీరే చెప్పారు కదా సార్, మన కాలేజీ ప్రిన్సిపాలనీ!

గోపాల్ : గుడ్ ! మెమరీ పవర్ బాగానేవుంది ! సరే, ఇప్పుడు ప్రిన్సిపాల్ని ఇదిగో ఈ రివాల్వర్తో షూట్ చేయాలి !

రాజా : మై గుడ్నెస్ ! షూట్ చేయడమే !

అజయ్ : అరే - వెర్రివెంగలప్పా ! అదో - బొమ్మ పిస్తోలు!

దాంతో ఏమీకాదు! ఆ ప్రిన్సిపాల్ చావడు ! కాస్త జడుసుకుంటాడు!అంతే!

రాజా : (ఏడ్పు ముఖంతో) ఆ తర్వాత నన్ను సస్పెండ్ చేస్తాడు !

ఆనంద్ : ఏమీ చేయలేడంటున్నాగా ! వెళ్ళి షూట్ చెయ్యి... లేదా నిన్ను కట్ డ్రాయర్తో ఇంటికి పంపిస్తాం!

రాజా : సరే సార్ !

(రాజా బొమ్మ పిస్తోల్తో ప్రిన్సిపాల్ ఎదురెళ్ళి టిష్ం టిష్ం అంటూ షూట్ చేస్తున్నట్టు నటిస్తాడు ! ప్రిన్సిపాల్ నివ్వెరపోయి తర్వాత తేరుకుని సీనియర్స్ వంకా జూనియర్స్ వంక ఎగాదిగా చూసి పరిస్థితి అర్థం చేసుకుని:)

ప్రిన్సిపాల్ : మళ్ళీ మొదలెట్టారా రాగింగ్ ! అయినా నాకు తెలీక అడుగుతాను! ఈ కాలేజీలో మీరూ ఒకప్పుడు జూనియర్సేకదా! మీ సీనియర్స్ మిమ్మల్ని టీజ్ చేసినప్పుడు మీరు ఎలా ఏడ్చిందీ అప్పుడే మరిచిపోయారా ?

గోపాల్ : మరిచిపోలేదు కాబట్టే... మా సీనియర్స్ మమ్మల్ని ఏడ్పించారు కాబట్టే, మేము ఇప్పుడు వీళ్ళని టీజ్ చేస్తున్నాం సార్ !

ప్రిన్సిపాల్ : బావుంది నాయినా ! తన అత్త తనని సతాయించిందని కోడలు అత్తయ్యాక తన కోడల్ని సతాయించిందట ! అలా వుంది మీ

వితండవాదం !

ఆనంద్ : మీరంత సీరియస్‌గా తీసుకోకండి సార్! ఏదో లైట్‌గా - ఏడ్పించి ఎంజాయ్ చేద్దామనీ...

గోపాల్ : ఇట్స్ జస్టెఫన్ !

వైస్ ప్రిన్సిపాల్: (ప్రవేశిస్తూ) మిస్టర్ గోపాల్... నీకో టెలిగ్రాం!

గోపాల్ : (కంగారుగా) ఎక్కడి నుండిసార్ !

వైస్‌ప్రిన్సిపాల్: మీ తమ్ముడు చదువుతోన్న మెడికల్ కాలేజీ నుండి ! (చెప్పడానికి కాసేపు తటపటాయించి- చివరకు నెమ్మదిగా) రాగింగ్‌కి తట్టుకోలేక మీ తమ్ముడు సూసైడ్ చేసుకున్నాట్ట !
(గోపాల్ కుప్పకూలిపోతాడు. సీనియర్స్ అంతా కొయ్యబారిపోతారు)

ప్రిన్సిపాల్ : ఇప్పటికైనా తెలిసిందా ! మీరు లైట్‌గా అనుకున్నవి ఎదుటివాళ్ళకి స్ట్రాంగ్ కావచ్చు! అసలు ఎదుటివాళ్ళని ఏడ్పించాలనే మీలాంటి శాడిస్ట్లు మూలంగా ఎన్ని జీవితాలు బలై పోతున్నాయో ఆలోచించారా? ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని.... ఎక్కడి వాళ్ళక్కడ క్లాస్‌లకి వెళ్ళండి!

సీనియర్స్ : సారీ సార్ !

(తెర)

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక*

***(20-12-1990)***

# ఎడ్యుకేటెడ్ ఇల్లిటరేట్



(అది జూబ్లీ హిల్స్ పరిసరాల్లోని కృష్ణానగర్ సిటీ బస్టాప్! ఆ బస్టాండ్ నానుకుని ఓ కిరాణాషాప్. బస్టాండ్ ముందు...

ప్రయాణికులు బస్‌కోసం ఎదురుచూస్తూ వుంటారు. బస్‌కోసం విసిగి పోయిన వాళ్ళు అడపాదడపా ఆ షాప్‌లో బేరసారాలు సాగిస్తూ వుంటారు. హైదరాబాద్ సిటీ చూడటానికి కేరళనుండి వచ్చిన ప్రేమ్‌నాయర్‌ని-కృష్ణా నగర్‌లో వుంటోన్న వాళ్ళక్కయ్య- చింత

పండు కొనుక్కునిరమ్మని చెప్పడంతో- అతడు ఆ కిరాణాషాప్‌కి వస్తాడు.(ప్రేమ్‌నాయర్‌కి మళయాళం తప్ప మరో భాష రాదు! షాప్ యజమానికి తెలుగు తప్ప ఇంకో భాష తెలీదు.)

ప్రేమ్‌నాయర్: (మళయాళంలో) నోకికే - నింగళుడే కడయిళ్ పుళి వుండో?
(మీ కొట్లో చింతపండు వుందా?)

షాప్ యజమాని: ఏమిటో మీరేం అడుగుతున్నారో నాకేం అర్థం కావడం లేదండీ!

ప్రేమ్‌నాయర్: అదే... పుళి ! రసం వుండాక్కణ పుళయిల్లే అద!
(అదే... చింతపండు! దాంతో రసం అదీ చేసుకుంటాం చూడండీ అది!)

షాప్ యజమాని: (రస్నా చూసిస్తూ)ఓహో - రస్నా !? ఉంది ! (అది తీసి ప్రేమ్ నాయర్‌కివ్వబోతూ) ఇదిగో తీసుకోండి!

ప్రేమ్‌నాయర్: అయ్యో ! ఇదల్ల ! (అబ్బబ్బ! ఇదికాదు !)
(తనలో) : ఎంతో - ఈ మనిషణ మనసిలా గుణ్ణిలే! ఇణియం న్యారనీ ఎంగణె పరయణం?
(ఏమిటో ఈ మనిషికి అర్థం కావడం లేదు! ఎలా చెప్తే అర్థమవుతుందీ?)
(పైకి): అదే - కర్‌తాణ ఇదిక్కున్నద! అద వెళ్లత్తిళ ఇడుంబోళ రసం కట్టిల్లే... అద !

(అదే - నల్లగా వుంటుంది ! అది నీళ్లలో నానబెడ్తే రసం వొస్తుందీ.... అదీ!)

షాప్ యజమాని: ఏమిటో - పొద్దున్నే ఎవరి ముఖం చూశానో? ఇట్లాంటి బేరం తగలింది ! ఆయన చెప్పేది నాకర్థం కాదు! నేను చెప్పేది అతడికి అర్థం కాదు! ఎలా చచ్చేదీయన్తో, పోన్లే ఈ రోజు కష్టమర్స్ రద్దీ ఆట్టే లేదు ! ఒక్కొక్కటీ చూపించి - అడిగితే సరి... (కందిపప్పు చూపించి)ఇదా?

ప్రేమ్‌నాయర్: అల్ల!
(కాదు!)

షాప్ యజమాని: (కారం చూపించి) ఇదా ?

ప్రేమ్‌నాయర్: అల్ల !

షాప్ యజమాని: (విసుక్కుంటూ) నీ బొంద ! నీకేంగావాలీ !

ప్రేమ్‌నాయర్: (తిట్టుకుంటూ) నిణ్ణముఖం ! నిణకు కానిక్యాన్ పోటం అరియతిల్ల !
(నీ ముఖం! నీకు చూపించడం కూడా వచ్చా? చచ్చు ముఖం!)

షాప్ యజమాని: (గొణుక్కుంటూ) వీడు కూడా నాలాగే నన్ను తిడ్తున్నాడల్లే ఉంది! నాకర్మ కొద్దీ దొరికాడు !

ప్రేమ్‌నాయర్: అన్న పోగట్టే నింగళ్ క్ ఇంగ్లీష్ ఆరియమో ? ఇంగ్లీష్ పరియాణో ? టేమరిండ్ ? టేమరిండ్!
(పోనీ ఇంగ్లీషు వచ్చా? ఇంగ్లీష్‌లో చెప్పనా ? టామరిండ్ ! టామరిండ్:)

షాప్ యజమాని: ఓహో తామరమందా ? అది ఇక్కడెందు

కుంటుంది ? మెడికల్ షాపుకి వెళ్ళు!

రాజారావు : (ఇంగ్లీష్ తెలిసిన మరో కస్టమర్ కలుగజేసు కుంటూ) అదికాదు షావుకారూ ! ఆయనక్కావలసింది తామరమందు కాదు ! టామరిండ్ అట ! చింతపండు - చింతపండు కావాలట!

షాప్ యజమాని: ఓహో చింతపండు కావాలా ! మరి అప్ప ట్నుంచీ సరిగ్గా చెప్పవేమయ్యా ! చింత పండుకేం !? బస్తాలకొద్దీ ఇస్తా ! ఇదిగో చింతపండు!

ప్రేమ్‌నాయర్: (సంతోషంతో) థాంక్యూ ! థాంక్యూ వెరీమచ్! ఎత్ర కిలో?
(కిలో ఎంత)

షాప్ యజమాని: కిలోకి ఇరవై రూపాయలు

ప్రేమ్‌నాయర్: నాణ్ ఇరవత్తంజ రూప తరతిల్లీ ! ఇర్పద తరతొళ్లు!
(నేను ఇరవై ఐదు ఇవ్వను ! ఇరవయ్యే ఇస్తాను!)

షాప్ యజమాని: ఇస్తే ఇరవై ఇవ్వు ! లేకపోతేపో ! నేను అమ్మను!

ప్రేమ్‌నాయర్: ఎండ కర్తావే ! ఇత్రయుంకాషో ?న్యాన్ నుపరిచాలుం తరిల్లా...
(అమ్మో ! అంతడబ్బే! నేను ఛస్తే ఇవ్వను!)

రాజారావు : అబ్బ ! ఇద్దరూ చెప్పేదీ ఒక్కటే ధరయ్యా

బాబూ! ఒకరి భాష ఒకరికి అర్థంగాక... అనవసరంగా పోట్లాడుకుంటున్నారు!

షాప్ యజమాని: అలాగా ! - అయితే సరి ! ఏమండీ, ఆ డబ్బు ఇటు ఇవ్వండి! ఇదిగో మీ చింతపండు ! తీసుకోండి !

(ప్రేమ్‌నాయర్ డబ్బులిచ్చి చింతపండు కొనుక్కుంటాడు. ఈ లోగా ఆ బస్టాప్ వద్దకు నటరాజన్ అనే తమిళ యువకుడు వచ్చి బేగంపేటకి వెళ్ళే బస్‌కోసం చూస్తూ వుంటాడు. బస్ ఎంతకీ రాదు. అతడి ముందు శరత్‌బాబు నించుని వీక్లీ తిరగేస్తూ ఉంటాడు. ఆ స్టేజీ వద్దకు మధ్య మధ్య బస్సులొచ్చి వెళ్ళి పోతున్నట్టు, శబ్దాలు - వినిపిస్తూ వుంటాయి! అలాంటి శబ్దం వినిపించి నటరాజన్ తన పక్కనే ఉన్న శరత్ బాబుతో - తమిళంలో:)

నటరాజన్ : ఎన్నంగా ! ఇంద బస్సు ఎంగ పరిక పోగిరదు? (ఏమండీ ! ఈ బస్సు ఎక్కడికి పోతుంది ?)

(శరత్ బాబుకి నటరాజన్ ఏం అడుగుతోంది అర్థంగాక - ఏమీ మాట్లాడకుండా ఒకసారి దిక్కులు చూసి - మళ్ళీ పుస్తకంలో మునిగి పోతాడు.)

నటరాజన్ : ఎన్నంగా ! ఉంగళలూ ! ఇంద బస్సు ఎంగ వరిక పోగిరదుగా?
(ఏమండీ ! మిమ్మల్నే ! ఈ బస్సు ఎక్కడికి పోతుందండీ?)

ప్రకాశ్ : (తెలుగు తెలిసిన యువకుడు) ఓహో ఈ బస్ ఎక్కడికి పోతుందని అడుగుతున్నావా ? చార్మినార్‌లెండి !

(మళ్ళీ మరో బస్ వచ్చిన శబ్దం)

నటరాజన్ : (శరత్‌బాబుతో) ఎన్నంగా, ఇంద బస్సు....

ప్రకాశ్ : నాంపల్లి!

(మళ్ళీ మరో బస్సు)

నటరాజన్ : ఎన్నంగా ! ఇప్పో.... ఇంద బస్సు.... ?

ప్రకాశ్ : ఉస్మానియా యూనివర్సిటీ!

రంగయ్య : (పల్లెటూరి ఆసామీ కాలుస్తోన్న చుట్ట అవతల పారేసి, శరత్ బాబుతో) ఏం బాబూ! నాకు తెల్వక అడుగుతున్నా - ఏమనుకోకు! గంట సేపన్నుంచీ సూత్తున్నా ! అంత పెద్ద పుస్తకం ఇసుగూ ఇరామం లేకుండా సదూతున్నవ్‌గదా! గా బస్ మీది బోర్డు సద్వలేవా ? పాపం గాయనకి సదువురాక నిన్ను అడుగుతోంటే... గట్ల బెల్లంగొట్టిన రాయిలా నిలబడ్తా వేంది ? నేనంటే సదూరానివాణ్ణి ! లేకపోతే నేను జెప్పేవాణ్ణి! నువ్వేమో సూడటానికి పెద్ద సదూకున్నోడి లాగున్నవ్! గా బోర్డ్ సద్వి సెప్పడానికి గంత పరేషాన్ అయిపోతావేంది?

రాజారావు : ఈ చదూకున్నోళ్ళంతే లేవయ్యా ! బోర్డు చదివి చెప్పడానికి వాళ్లకి ఎక్కడలేని బద్ధకం !

(శరత్‌బాబు ఆ పల్లెటూరి మనిషి మాటలూ,

రాజారావు మాటలూ విని - వాళ్ళు చెప్పేది అర్థంగాక - తనను కాదన్నట్టు - మళ్లీ పేపర్లో మునిగిపోతాడు)

భారతమ్మ : చదవడానికి మా వాడికి బద్ధకమా ? భలేవారే! వాడు చిన్నప్పటినుండీ - కష్టపడి బోల్డు గోల్డ్ మెడల్స్ సాధించాడు! వాడికెందుకూ బద్ధకం!?

రాజారావు : మరేదైనా చత్వారమా ?

భారతమ్మ : చత్వారమైతే కళ్ళజోడు పెట్టుకునేవాడు కదండీ!

రాజారావు : మరి.....?

భారతమ్మ : వాడు... ఎజుకేటెడ్ ఇల్లిటరేట్ ?

రాజారావు : అంటే....?

భారతమ్మ : చదువుకున్న నిరక్షరాస్యుడు !

రంగయ్య : (బుర్రగోక్కుంటూ) ఏమిటో తిరకాసుగా సెప్తున్నారు! సమజైత లేదు!

భారతమ్మ : వాడు ఎమ్మే పొలిటికల్ సైన్స్‌లో యూనివర్సిటీ ఫస్ట్! కాని చదివింది మొదట్నుండీ బెంగాలీ మీడియంలో! వాడికి బెంగాలీ తప్ప... మరో భాషరాదు! ప్రాంతీయ భాష తప్ప మరో భాష తెలీని వాళ్ళు - వేరే భాష అక్షరాలు ఎలా చదవగల్గుతారు ? అందుకే ఇలాంటి వాళ్ళంతా చదువుకున్న నిరక్షరాస్యులు! వీళ్ళందరికీ చదువొస్తుంది.... కాని అవసరమైతే ఏమీ చదవలేరు... ఏమీ రాయలేరు!

వెంకటరావు : (మరో ప్రయాణికుడు కలుగజేసుకుంటూ) మీరన్నది ఎగ్జాట్లీ కరెక్ట్ ! ఆ మధ్య నేనోసారి త్రివేండ్రమ్ వెళ్లాను ! బోర్డ్ చూసి అది సెలూన్ అనుకుని లోపలికి వెళ్లాను ! ఏదో బ్యూటీ పార్లర్! పోజులు కొట్టడానికి వచ్చాననుకుని దేహశుద్ధి చేసి పంపారు.

రాజారావు : వాళ్లకి చెప్పుకోలేక పోయారా జరిగిందేమిటో?

వెంకటరావు : ఎలా చెప్పమంటారు ? నాకా వాళ్ళ భాష రాదు! వాళ్ళకి నా భాష తెలీదు ! మా యిద్దరికీ - తెలిసిన భాష ఇంకోటేమీ మాకు రాదు ! ఏం చేయాలీ ? అందుకని కిమ్మనకుండా దెబ్బలన్నీ భరించాను.

బసంత్ : మీరన్నదీ నిజమే ! ఒకసారి నాకూ మద్రాస్‌లో అలాగే జరిగింది! వాహినీ స్టూడియో చూద్దామని బస్సుకోసం చూసీ చూసీ - ఏ బస్సెక్కడికి వెళ్తుందో అర్థంగాక... అడగడానికి తమిళం రాక... చెప్పడానికి ఇంగ్లీష్ తెలిసినాయన ఎవరూ ఆ బస్టాప్‌లో దొరక్క - ఏమైతే అయ్యిందనీ ఏదో ఒక బస్సెక్కితే- అది ఎటో తీసుకెళ్ళి - ఎటెటో తిరిగి - ఎక్కడో వదిలిపెట్టింది!

వెంకట్‌రావు : ఇంకా మీకు తెలీదు ! ఒకసారి పూనాలో సిటీ బస్సెక్కాను! కండక్టర్ టికెట్ కొట్టి నా చేతిలో పెట్టాడు ! ఎంతివ్వాలో అని టికెట్ మీద డబ్బు చూస్తే - అన్నీ మరాఠీ అంకెలు! ఎంత

డబ్బో అర్థంగాక - అతడి చేతిలో అర్థరూపాయి పెట్టాను - కండక్టర్ మళ్ళీ చెయ్యిజాపాడు ! ఈసారి రూపాయిచ్చాను- ఆయన మళ్ళీ చెయ్యిజాపాడు! ఈసారి రూపాయిన్నర- ఆయన విసుగ్గా చూశాడు! మళ్ళీ రెండ్రూపాయలు - అతడు కళ్ళెర్ర జేసి - ఏదేదో అరిచాడు! అందరూ నావంక అదోలా చూస్తూంటే - నేను ఏదోలా ఫీలయి - సిగ్గుతో చితికిపోయి- ఆయన చేతిలో ఐదు రూపాయలు పెట్టి - కిమ్మనకుండా కూర్చున్నాను ! మిగతా చిల్లరకోసం - మళ్ళీ అతణ్ణి అడిగితే ఒట్టు!

రంగారావు : పాపం చాలా కష్టాలు పడ్డట్టున్నారే !

వెంకట్‌రావు : అంతేనా ? ఇంకా వినండి ? తర్వాత నేను దిగాల్సిన చోటు వచ్చిందో లేదో చూద్దామని... బస్ కిటికీలోంచి తల బయటికి పెట్టి చూస్తే.... ఎక్కడ ఏ షాప్ బోర్డు చూసినా అన్నీ మరాఠీ అక్షరాలే ! ఎక్కడ దిగనూ ? ఆగిన ప్రతిచోటా నేను దిగాల్సిన రోడ్డు అదో కాదో తోటి ప్రయాణికుణ్ణి అడగడం - అతడు తన భాషలో తనకి తోచిందేదో చెప్పడం.... నాకు అర్థం గాక మళ్ళీ అడిగితే ఒకటి రెండు సార్లు చెప్పి - మూడోసారి నా పక్కనుండి లేచిపోవడం జరిగింది! చివరకు బస్సు తిరుగు ప్రయాణంలో - ఎక్కినచోటే దిగి - మళ్లీ ఇంగ్లీష్

తెలిసిన ఆటోవాలా ఆటో ఎక్కి - నా గమ్యస్థానం ఎప్పటికో చేరుకున్నాను!

ప్రకాశ్ : ఏం మాతృభాషా దురభిమానమో ఏమోగానీ - మనం పక్క రాష్ట్రంలో కాలు మోసిన మరు క్షణం - ఎందుకూ పనికి రాకుండాపోతాం! నోటికి ప్లాస్టర్ వేసుకుని - నోరున్న మనకీ- నోరులేని జీవాలకీ - భేదంలేని బతుకులీడ్చుకుంటూ...

వెంకటరావు : బొత్తిగా అలా నీరసపడిపోతావేమోయ్ ! మనసుంటే మార్గముంటుంది! మాట్లాడు కోవడం.... ప్చ్.. అదో సమస్యా ! సైగలు... సైగల్తో మాట్లాడుకోవచ్చు - అవసరమైతే ! దానికి భాషే రావాలా... ఏమిటీ?

రాజారావు : అవునవునూ... అలా చేద్దాం ! అప్పుడు నోరుందికదా అని- ఎవరూ ఎవర్తో - పెద్దపెద్దగా అరచుకోరు ! దేశంలో ఎక్కడ చూసినా ఒకటే ప్రశాంతం !

ప్రకాష్ : ఏమిటో హిందీ వొద్దని కొన్ని రాష్ట్రాలూ - ఇంగ్లీష్ రద్దుచేయాలని మరికొన్ని రాష్ట్రాలూ... దేశం ఎక్కడికి పోతోందనిపిస్తోంది! ఎవరి భాషపట్ల వారికి అభిమానం వుండాలి - వద్దనం! కానీ - తమ భాష తప్ప వేరే భాషని పైకి రానీకపోవడం - సంకుచితం కాదా ?

బసంత్ : (వ్యంగ్యంగా) మన భాషా దురభిమానులది భలే దూరదృష్టిలెండి! ఎవరి భాషని వాళ్ళు

ధ్ధరించుకుంటే - ఒకరి భాష మరొకరికి రాక - ఎవరు ఎవర్తో ఏమని ఎలా పోట్లాడు కోవాలో తెలీక- దేశాన్ని నోటి పోట్లాటల్లేకుండా రక్షించిన కీర్తి - దక్కించుకోమంటారు!

వెంకటరావు : అయ్యో పిచ్చి తండ్రీ ! అప్పుడు ఎవరేం మాట్లాడ్తున్నారో తెలీక- వాళ్ళు అడుగుతోంది వీళ్లూ - వీళ్లూ అడుగుతోంది వాళ్లూ - అపార్థం చేసుకుని నోటితో పోట్లాడుకోవడం మానేసి- ఒకరిపై మరొకరు కత్తులు దూసుకుంటారేమో! ఎవరికెరుక?

భారతమ్మ : నిజం నాయనా ! నేను అనుక్షణం అదే విషయంలో బాధ పడ్తున్నా !

ప్రకాశ్ : ఎవరమ్మా నువ్వు !?

భారతమ్మ : (పేలవంగా నవ్వి) నేనా ? నేనెవరో - మీకేమవుతానో - మీకు నేనే చెప్పుకోవాల్సిన దుస్థితి దాపురించింది నాయనా నాకీరోజు! అయినా చెప్తాను ! వినండి!

(శివరంజని రాగంలో పాట:)

నేను భరత మాతనూ...
భరతమాత నేనూ !

రెండొందల వత్సరాల - తెల్లదొరల చెరలో మగ్గి... ॥రెం॥
నే నేర్చుకున్నదింగ్లీషూ... నా మాతృభాష సంస్కృతం! ॥నా॥

లెక్కకి వున్నారయో -
ఇరవై అయిదుగురు కొడుకులూ...
పిలుస్తాను వాళ్లనూ..రాష్ట్రాలని ముద్దుగా...
రెక్కలొచ్చిన కొడుకులంత - మాతృభాషని
విడిచీ....
తల్లినైన నన్ను మరిచి - భార్యా విధేయులైరి
॥భా॥

తెలుగు ఒక కోడలిదీ-
తమిళమొక కోడలిదీ-
మళయాళం ఒకరిదైతే-
కన్నడమింకొకరిదీ !

ఒకరు గుజరాతీ-
వేరొకరు పంజాబీ-
ఒకరిది మరాఠీ-
మరొకరిదేమో ఒరియా !

బెంగాలీ ఒకరిదైతే-
హిందీ మరికొందరిదీ-
రాజస్తానీ ఒకరిదీ-
కాశ్మీరం ఒకరిదీ !

కొందరికీ ఇంగ్లీషూ - చేదయ్యే బాధయ్యే
మరికొందరికి హిందీ - గిట్టదయ్యే పట్టదయ్యో!
మొత్తానికి అందరికీ - సంస్కృతం బరువయ్యే!
ఒకరినొకరితో కలిపే - భాషేదో చెప్పరయ్యో....॥ఒ॥

దేశ భాషలందూ - నా తెలుగే లెస్సంటే....
తమిళమే గొప్పంటే - పంజాబీ శ్రేష్ఠమంటే...
అయ్యో...
ఎవరికి వారే తమ - చుట్టు పరిధి గీసుకుంటే....
॥ఎవరికి॥
నా జాతి నొక్క తాటిపై నడిపించేదెవ్వరూ.... ?
నడిపించే దెవ్వరూ...??

(తెర)

*నోట్:*

*ఈ నాటికలో ప్రేమ్‌నాయర్ సంభాషణ విషయంలో నాకు తెలిసిన మళయాళీ ఫ్రెండ్‌ని ఇంగ్లీషులో సంప్రదించాను! వారికి తెలుగు రాదు! నాకు మళయాళం అంతకన్నా రాదు! "మేము పలికే కొన్ని అక్షరాలు... మీ తెలుగులో వున్నాయో లేవో మాకు తెలీదు ! మరి మా ఉచ్ఛారణ మీరు ఎంతవరకు క్యాచ్ చేసి - దాన్ని తెలుగులో ప్రెజెంట్ చేస్తున్నారో మాకైతే తెలీదు!" అంటూ ఈ నాటికలో నాక్కావలసిన డైలాగ్స్ - వాళ్ళు మళయాళంలో చెప్పడం జరిగింది! అలాగే తమిళ డైలాగ్స్‌లోనూ! తప్పులేమైనా దొర్లితే క్షంతవ్యురాలిని.*

**- అమృతలత.**

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -*
***(13-12-1990)***

# స్టాఫ్‌రూం

పాఠాలు చెప్పే పంతులమ్మల రాజకీయాల కిచులాట !




**ఫిమేల్ స్టాఫ్‌రూం...**

రంగమ్మ : కమలమ్మ టీచర్ ! రెండో తరగతి క్లాస్ టీచర్ ఈ రోజు స్కూలుకు రాలేదట ! హెచ్చెం గారు మిమ్మల్ని రెండో తరగతికి వెళ్ళమన్నారు! ఇదిగో ఈ పుస్తకంలో సంతకం పెట్టండి!

కమలమ్మ : (ఆ సబిస్టిట్యూషన్ బుక్‌లో సంతకం చేస్తూ:) ఈ హెచ్చెంగారికేం పనిలేదు ! పొద్దస్తమానం నాకే వేస్తారు సబిస్టిట్యూషన్ వర్క్! ఆవిడ

కంటికి ఇంకెవరూ కన్పించలేదా ? కాస్సేపు కూర్చుంటే ఓర్వలేదు ! కుళ్లుబోతు ముఖం ఎక్కడో ?

సుగుణ : హెచ్చెంకి వుండేది రోజుకి రెండు పీరియడ్స్ ! ఆ రెండు పీరియడ్లు తీసుకోవడానికే ఆవిడకి బద్ధకం!, మనకైతే ఉండే ఐదు పీరియడ్స్‌కి తోడు ఈ ఎక్స్ట్రా పీరియడ్స్ కొన్ని !

రంగమ్మ : (విమల దగ్గరికి వెళ్ళి) అమ్మా, మీక్కూడా !

విమలమ్మ : (కాళ్ళూపుకుంటూ ఏదో నవల చదువుతోం దల్లా రంగమ్మని చూసి:) ఉందీ.... (రాగాలు తీస్తూ) నాక్కూడా వుందీ ! నేననుకుంటూనే వున్నాను ! ఇంకా రాలేదేమిటా అనీ! ఇప్పటిదాకా ఆ క్లాస్‌లోనే వుండి వచ్చాను ! మళ్ళీ ఆ క్లాస్‌కే వేశారు ! నేనుండాలా చావాలా? అసలే ఆ రేకుల షెడ్ల కింద వూపిరాడక ఛస్తున్నాను ! - దానికి తోడు ఆ రూం లోకి వెళ్ళగానే గబ్బుమని పిల్లల చెమట కంపొకటీ...

రజిత : మీరు రెండు పీరియళ్ళకే అంత ఇదవుతు న్నారు! ఏడు పీరియళ్ళు పాపం - ఆ పిల్లలు ఆ రేకుల కింద గాల్లేక ఎంత అవస్థ పడ్తున్నారో - ఆలోచించారా ?

విమలమ్మ : ఎవరయినా ఎందుకు అవస్థపడాలీ అంట! ప్రభుత్వం క్లాసులన్నింటికీ ఫ్యాన్లు సప్లయి చేయాలి ! ధారాళమైన గాలీ వెలుతురూ

వున్నప్పుడే కదా పిల్లలకి పాఠాలు అర్థమయ్యేది!?

కమలమ్మ : బహుశః క్లాసులో ఫ్యాన్లు పెడ్తే పిల్లలూ, టీచర్లూ నిద్రపోతారని కాబోలు ప్రభుత్వం ఈ విషయం పట్టించుకోవడం లేదు.

తార : ప్లీజ్ హియర్ మీ ! హియర్ మీ ! నేనొక్క పరిష్కార మార్గం చెప్పనా ? అటు పేరెంట్స్ ఎలాగూ ఫ్యాన్ల కోసం డొనేషన్లు ఇవ్వరు ! ఇటు గవర్నమెంట్‌కీ పాపం డబ్బులేదు ! అంచేత మనమే పిల్లలమీద దయతలచి క్లాస్‌కో ఫ్యాన్ కొనిస్తే సరి !

సుగుణ : చంపావ్ ! మనకే పెట్టావు ఎసరూ ?

కమలమ్మ : (మూతీ ముక్కూ విరిచి:) బోడి సలహా !

విమలమ్మ : (రంగమ్మని చూస్తూ) ఇప్పుడంటే తెచ్చావ్ గానీ - ఇంకెప్పుడూ ఈ సబ్‌స్టిట్యూషన్ బుక్ నా ముందుకి తేకు ! గర్ల్స్ స్కూల్లో పనిచేయడమంత బుద్ధితక్కువ మరోటి లేదు!

తార : ఎందుకండీ అలా అంటారు ?

విమలమ్మ : లేకపోతే ఏమిటమ్మా ? ప్రతి రెండు నెల్లకీ ఒకరు మెటర్నిటీ లీవ్ పెడ్తారు ! మళ్ళీ మూణ్ణెళ్ళదాకా స్కూల్ ముఖం చూడరాయే! వాళ్ళ పని చేయలేక మా నడుములు విరిగి పోతున్నాయ్! (కమలమ్మని చూసి) ఇదిగో కాస్త బజారు దాకా వెళ్ళి వస్తాను ! అయిదు...

కేవలం అయిదు నిమిషాల్లో... వచ్చేస్తాను !
నా క్లాస్ మీద ఓ కన్నేసి వుంచు !
(విమలమ్మ వెళ్ళిపోతుంది)

కమలమ్మ : ఎగ్జామినేషన్ సెక్రెటరీ అని ఈ విమలమ్మకి వున్నవే ఓ మూడు పీరియళ్ళు ! ఏ ఒక్కరోజూ తన క్లాసులు తీసుకోదు సరికదా.... వాళ్ళు ఆ క్లాస్‌కి వెళ్ళలేదూ, వీళ్ళు ఈ క్లాస్‌కి వెళ్ళలేదూ అని అందరి మీదా ఏడుస్తూ వుంటుంది !

రజిత : అబ్బ ! కాస్త నెమ్మదిగా మాట్లాడుకోండి... ప్లీజ్! అటెండెన్స్ రిజిష్టర్లో పేర్లన్నీ తప్పులు రాశాను!

(రజిత అక్కడి నుండి వెళ్ళిపోతుంది)

తార : (ఆమెని అలా వెళ్ళనిచ్చి, ఎగతాళిగా) వెళ్తోందమ్మా వెళ్తోంది! ఉత్తమ ఉపాధ్యాయిని వెళ్తోంది !

ఎలిజబెత్ : ఒకసారి డిస్ట్రిక్ అవార్డ్ కొట్టేసింది కదా, ఈసారి స్టేట్ అవార్డ్ కొట్టేయడాన్కి కాబోలు యమ సిన్సియర్ పోజులు కొడ్తోంది !

తార : పాపం పిచ్చిపుల్లమ్మ, స్టేట్ అవార్డ్ వచ్చేలోగా రిటైరై కూర్చుంటుందని తెలీదేమో !

రంగమ్మ : అమ్మో ! మిమ్మల్ని హెచ్చెంగారు పిలుస్తున్నారు.
(తార వెళ్ళిపోతుంది)

ఎలిజిబెత్ : (తారను అలా వెళ్ళనిచ్చి:) ఇప్పుడేం చెంచాగిరీ

చేయడానికి వెళ్తోందో ఏమో -! ఓవంక మనతో తీయగా మాట్లాడ్తూనే వుంటుంది! మరోవంక మన మీదే చాడీలు చెప్తూ వుంటుంది. మొన్నేం జరిగిందో తెలుసా.... వాళ్ళ అమ్మాయికి ఎప్పుడూ సున్నాలే వస్తాయన్న ఈర్ష్యతో నా కూతురుకి కావాలని తక్కువ మార్కులు వేసింది.

కమలమ్మ : అమ్మో! రజిత వస్తోంది ! నేను క్లాస్‌కి వెళ్తాను!

సుగుణమ్మ : అదేమిటండీ ! రజితని చూసి మరీ అదేమిటలా - డీయీవోని చూసినట్టు అదిరిపడ్తున్నారు.

ఎలిజబెత్ : ఏం చెయ్యను చెప్పండి ! మొన్న మా మేనత్త కూతురి పెళ్ళికి వెళ్లాను కదా ! పేపర్లు దిద్దడం కాలేదు ! ఈవిడ తనో బెస్ట్ టీచరని పోజుకదా! నేను కన్పిస్తే సరి! మార్కులివ్వమంటూ జిడ్డులా వెంటపడ్తోంది !

సుగుణమ్మ : ఆఁ సమయానికి గుర్తుచేశావ్ ! నీ మూలంగా నా ప్రోగ్రెస్ కార్డ్సు కూడా ఆగిపోయాయి ! నువ్వు రజితకే కాదూ, నాక్కూడా ఇవ్వాలి మార్కులు!

అరవింద : (చిక్కుడుకాయలు ఒలుస్తూ) నాక్కూడా !

ఎలిజబెత్ : అయ్ బాబోయ్ - నేను పారిపోతున్నా ! (ఎలిజబెత్ వెళ్ళిపోతుంది)

సుగుణమ్మ : ఇదేమిటీ చిక్కుడు కాయలు ఇలా ఒలుస్తు

న్నారు !?

అరవింద : రోజుకి అయిదు పీరియళ్ళు ! ఒక్కో క్లాస్‌లో డెబ్బయి మంది, డెబ్బయి ఇంటూ అయిదు! మూడొందల యాభై ! - రోజూ మూడొందల యాభై పిల్లల నోట్సూ, పరీక్ష పేపర్లని దిద్దడానికి స్కూల్లో టైమ్‌లేక - ఇంట్లో దిద్దుతున్నానా ? ఇంట్లో పనికాస్త - ఇక్కడ చేసుకుంటే తప్పొచ్చిందా - నాకు తెలీక అడుగుతున్నా! ఆఁ

తార : అయ్యో పిచ్చి తల్లీ ! నువ్వెందుకిలా కష్టపడ్తున్నావ్! నువ్వీ పని తప్పించుకోవడానికి నేనో సులువైన మార్గం చెప్పనా ? బెంచీకో లీడర్ని పెట్టు! ఆ లీడర్ల నోట్స్ నువ్వు దిద్దు ! ఆ బెంచీ పిల్లలందరివీ ఆ లీడర్స్‌ని దిద్దమను! ఫినిష్!

రజిత : అవునవునూ... ఆ తర్వాత ప్రతినెలా ఫస్ట్‌నాడు నువ్విత్తే జీతంలోంచి- ఎంతోకొంత ఆ లీడర్స్ కివ్వు! పాపం! నీ కష్టాన్ని పంచుకుంటారుగా ..... నీ కష్టఫలం కూడా వాళ్లని పంచుకోనీ... అప్పుడే న్యాయం!

అరవింద : ఆఁ ఫస్ట్ అంటే గుర్తొచ్చింది. ఈ ఫస్ట్‌కి దిద్దులు చేయించుకోవాలనుకుంటున్నాను. ఈ దిద్దులు ఎక్కడ కొన్నావ్ తారా ?

తార : ఇక్కడే మగన్‌లాల్... సరేగానీ... అదేమిటీ... ఎల్లో చీరకి మస్టర్డ్ బ్లౌజ్ వేశావ్ ! అదేం బాలేదు!

రజిత : (వ్యంగ్యంగా) ప్చ్ ! పోచికోలు కబుర్లకి - ఇంత బాగా టైమ్ దొరుకుతూంటే - ఆ రోజు హెచ్చెం గారు పిల్లల నోట్స్ దిద్దమంటే - దిద్దడానికి టైం ఎక్కడిదని ఎంత బాగా దబాయించాం!?

రంగమ్మ : అమ్మా! 'చీరలమ్మే అంజయ్య' చీరల మూట పట్టుకొచ్చాడు!

సుగుణమ్మ : అవునా.... ఏదీ రమ్మను ! ఈసారయినా నేను చెప్పిన చీర పట్టుకొచ్చాడోలేదో !? హెచ్చెం ఏం చేస్తున్నారు ? ఆవిడ కంటపడకుండా ఆయన్ని పంపించు !

రంగమ్మ : ఆవిడ పేరెంట్స్‌తో మాట్లాడ్తున్నారమ్మా !

సుగుణమ్మ : ఆలస్యం అమృతం విషం ! వేగిరం అంజయ్య ని లోపలికి పంపించు.

(అంజయ్య చీరల మూట విప్పుతాడు... అందరూ ఆ మూట చుట్టూ గుమిగూడ్తారు! క్లాస్‌కి వెళ్ళిన వాళ్ళు కూడా ఈ విషయం విని - క్లాస్ ఎగ్గొట్టి అక్కడికి వస్తారు!)

అరవింద : ఈ చీర బాగాలేదు ! ఆ చీర... అదే... ఆ ఎర్రంచు తెల్లచీర... ఆ... అదీ ! అది బావుంది! అది ఎంతకిస్తావ్ ?

అంజయ్య : రెండొందలు!

అరవింద : అమ్మో - రెండొందలే ! వందకివ్వు !

రజిత : ఏమిటిది? ఇది స్టాఫ్ రూమా ? షాపింగ్ సెంటరా? స్కూల్ అవర్స్‌లో ఈ గొడవేమిటీ?

బాబూ అంజయ్యా - నువ్వు, నీ మూటా ముల్లే సర్దుకొని జారుకో నాయనా ! లేకపోతే కంప్లైంట్ ఇవ్వాల్సి వస్తుంది ! కావాలంటే స్కూల్ అవర్స్ అయ్యాక రా ! తీరిగ్గా చూస్తారు మా వాళ్ళప్పుడు !

సుగుణమ్మ : స్కూల్ అవర్స్ అయ్యాక... ఇంకా ఇక్కడుండటమా ? ఇంకా నయం!.... ఇంట్లో ఎంత పని వుందీ ? నాకు టైం వేస్ట్!

రజిత : క్లాసులు ఎగ్గొట్టి.... చీరలు చూస్తూంటే... పిల్లలకి టైంవేస్ట్ కాదు కాబోలు !

(ఇంతలో హెచ్చెం స్టాఫ్ రూంలోకి వస్తారు! ఆమెని చూడగానే అప్పుడే గుర్తొచ్చిందాన్లా 'నాకు క్లాస్ వుంది' అంటూ మెల్లిగా సుగుణమ్మ జారుకుంటుంది.)

హెడ్‌మిస్ట్రెస్ : విమలమ్మ టీచర్ వున్నారా ?

ఎలిజిబెత్ : ఇప్పుడే ఇలా బజారుకు వెళ్ళారండీ !

హెడ్‌మిస్ట్రెస్ : ఎవర్నడిగి వెళ్ళారు ? వారికి ఫస్ట్‌క్లాస్ కదా ఇప్పుడు ?

ఎలిజిబెత్ : అవునండీ !

హెడ్‌మిస్ట్రెస్ : ఆ గేట్ దగ్గర నించున్న టీచర్సెవరెవరూ ?

ఎలిజిబెత్ : తారా, కమలమ్మ టీచర్స్ మేడం !

హెడ్‌మిస్ట్రెస్ : ఇదీ వరస ! లాంగ్ బెల్‌కి ఇంకా ఐదు నిముషాల టైముంది! పిల్లలకన్నా ముందు

నించున్నారు.... ఇంటికి వెళ్ళడానికి! ఆ విమలమ్మ టీచర్ క్లాస్ ఎగ్గొట్టారా ? ఫస్ట్‌క్లాస్ పిల్లలు ముష్టి యుద్ధాలు చేసుకున్నారు ! ఒకమ్మాయి కంట్లో పెన్‌నిబ్బో, అదేమిటో గుచ్చుకుని రక్తం - వచ్చింది! ఇప్పుడే ఆ పిల్లని సుజాత టీచర్ హాస్పిటల్‌కి తీసికెళ్ళారు! ఇప్పుడా అమ్మాయి పేరెంట్స్ ఎంత గొడవ చేస్తారో ఏమో?

అరవింద : అయ్యో, మాకు తెలీదండీ !

హెడ్‌మిస్ట్రెస్ : స్కూల్లో ఇంత జరిగినా, మీకది తెలిసి రాలేదంటే - ఎంత సిగ్గుచేటు? విమలమ్మ టీచర్ సకాలానికి క్లాస్‌కి వెళ్ళివుంటే ఇంత గొడవ జరిగేదా ? క్లాసులు ఎగ్గొట్టి ఇక్కడ కూర్చున్న టీచర్లు తక్షణం క్లాస్‌లకి వెళ్ళండి !

(తెర)

## మేల్ స్టాఫ్‌రూం

రాజారావు : బ్రదర్ ! క్రికెట్ స్కోరెంత ? క్లాస్‌లో ఉండబట్టలేక ఎప్పుడెప్పుడు తెలుసుకుందామా అని బయటకి వచ్చేశాను !

జగన్ : (ట్రాన్సిస్టర్ వాల్యూమ్ తగ్గించి) టూ ఫార్టీ ఫర ద లాస్ ఆఫ్ సిక్స్ వికెట్స్ - కపిల్ బ్యాటింగ్ ఆన్ నైంటీ టూ అండ్ అజారుద్దీన్ ఆన్ సిక్స్.

రాజారావు : కపిల్ సెంచరీ చేసేలా వున్నాడు ! ఈ దెబ్బతో పాకిస్తాన్ చిత్తు!

రాముా : మే ఐ కమిన్ సర్ (అంటూ లోపలికి వచ్చి, జగన్ వంక చూసి:) గుడ్ మార్నింగ్ సార్, ఇది మీ పీరియడ్ ! మా క్లాసంతా గోలగా వుంది ! పక్క క్లాస్‌లో భూంరెడ్డి మాస్టారికి డిస్టర్బ్ అవుతోందట! మీకీ విషయం చెప్పమని నన్ను పంపించారు!

జగన్ : చెప్పావ్‌గా చిలకపలుకులు ! ఇక వెళ్ళవోయ్! వెధవ పిల్లలు- వెధవగోల ! ఒక్కక్షణం స్టాఫ్ రూంలో కూర్చోనివ్వరు ! ఇంకా ఇక్కడే వున్నావేం! వెళ్ళు, ఐదు నిమిషాల్లో వచ్చేస్తాను!

రాజారావు : (అప్పుడే వచ్చిన సోమయ్య మాస్టార్ని చూసి) ఇప్పుడేగా మీరు క్లాస్‌కి వెళ్లింది - అప్పుడే వచ్చేశారేం ?

సోమయ్య : నేను ప్రతి పది నిముషాలకోసారి సిగరెట్ కాల్చంది వుండలేను బ్రదర్ ! ఇలా మధ్య మధ్య బయటికి వచ్చి సిగరెట్ కాల్చకపోతే - పాఠం చెప్పాలనే మూడ్‌రాదు ! ఏం చేయనూ!?

రాజారావు : (డెయిలీ పేపర్ తిరిగేస్తూ) ఈసారి ఎలెక్షన్స్‌లో ఎవరు గెలుస్తారనుకుంటున్నారు సోమయ్య గారూ ?

సోమయ్య : ఎవరేమిటీ ? స్టేట్‌లో తెలుగుదేశం ! సెంటర్లో కాంగ్రెస్ !

రాజారావు : కాదు ! స్టేట్‌లో, సెంటర్లో - రెండూ కాంగ్రెస్సే!

జగన్ : ఊహు( సెంటర్లో జనతాదళ్, స్టేట్‌లో తెలుగుదేశం !

రాజారావు : పందెమా ?

జగన్ : పందెం !

రాజారావు : ఎంతెంత ?

గోపి : మే ఐ కమిన్‌సార్ ( రాజారావు వంక చూసి) సార్ ! ఇది మీ పీరియడ్ కదా ! క్లాస్‌లో రాజూ, రవీ దెబ్బలాడుకున్నారు! రవి ముక్కులోంచి రక్తం కార్తోంది. వాడు ఏడుస్తున్నాడు ?

రాజారావు : వెధవలు ! ఎప్పుడూ గొడవలే వీళ్ళకి ! వస్తా! నువ్వెళ్లు! (సోమయ్య వంక చూస్తూ:) ఇంతకీ పందెం ఎంతో చెప్పండి మాష్టారూ ?

సోమయ్య : మీరు గెలిస్తే - మీకు మేమిద్దరం ఐదొంద లిస్తాం! నేను గెలిస్తే- మీరిద్దరూ నాకు ఐదొందలూ... జగన్ మాష్టారు గెలిస్తే- ఆయనకి మనిద్దరం ఐదొందలు... ఇవ్వాలి ! సరేనా !?

రాజారావు : సరే !

(అప్పుడే అప్పారావు మాష్టారు లోపలికి వస్తారు)

రాజారావు : (ముక్కు మూసుకుంటూ)ఏంటో గురూ గారు మాంచి ఫుల్ డోస్‌లో కన్పిస్తున్నారు!

అప్పారావు : ఏం చెయ్యను గురూ ! నిన్న పేకాటలో మూడొందలొచ్చాయి! అవి పెట్టి పార్టీ ఇస్తే గానీ వొదలమన్నారు ఫ్రెండ్స్ ! మార్నింగ్ హాఫ్ డే లీవ్ పెట్టాను ! బార్‌కి వెళ్ళి కోడి పలావ్, రమ్ పీకల్దాకా లాగించేసి మధ్యాహ్నం స్కూల్‌కి వచ్చాను !

రాజారావు : కాస్త పాన్ వేసుకో గురూ ! హెచ్చెం పసిగట్టారంటే ప్రమాదం!

వినోద్ : పిల్లి కళ్ళుమూసుకొని పాలు తాగుతూ లోకం చూడట్లేదనుకున్నట్టుంది మీ వాలకం ! ఒక్క హెచ్చెం చూడకపోతే సరా? 'టీచర్స్ వుండేది 'గ్లాస్‌రూం'లో ! క్లాస్ రూంలో కాదు !' అన్న మహానుభావుడెవరో గానీ అది అక్షరాలా నిజం! మనం తిన్నా - తాగినా - తందనాలాడినా నాల్గు వైపుల్నుంచీ పిల్లలు మనల్ని గమనిస్తూ వుంటారన్న సంగతి మనం గ్రహిస్తే అంతేచాలు!

రాజారావు : అన్నట్టు అప్పారావ్ గారూ ! నిన్న మీరు రాకుండానే వచ్చినట్టు సంతకం చేశారేం ?

అప్పారావ్ : స్కూల్‌కేవో రిజిష్టర్లు కావలసివుంటే - ఆన్ డ్యూటీ మీద కొనుక్కొని వస్తానని వెళ్ళి - ఎంచక్కా పగలంతా పేకాడి - రాత్రి కొనేసి - ఈ రోజు సంతకం చేసేశాను !

రాజారావు : గురూ - మీరు లాంగ్ స్టాండింగ్‌లో వున్నార్ట కదా! ఈసారి ట్రాన్స్‌ఫర్లో మొదటి గురి మీకే

అన్న మాట !

జగన్ : ఎంతమాట ! ఎంతమాట ! ఆయనకి ట్రాన్స్‌ఫరేమిటి ? ఆయన అసలే సాక్షాత్తూ జడ్పీ ఛైర్మన్ బామ్మర్ది తమ్ముడైతే.....

రాజారావు : అన్నట్టు, ఈసారి మన స్కేల్స్ రివైజ్ చేస్తార్ట! అప్పుడు మనకి ఎంత లేదన్నా - తలో రెండొందలు పెరుగుతాయి !

వినోద్ : అవునవునూ.... ఇలా పాఠాలు చెప్పకుండా- పోచికోలు కబుర్లతో టైమ్‌వేస్ట్ చేస్తూ - ఇంతింత జీతాలు తీసుకుంటూ పోతే - మనల్ని 'బతక లేక బడిపంతులు' అని పిలవడం మానేసి 'బతక నేర్చిన బడి పంతులు' అంటారేమో - ఎవరి కెరుక?

సోమయ్య : అది సరేగానీ - ఈ సారి థర్టీ ఫోర్ పర్సెంట్ డీఏ పెరిగిందంటే - నాకెంత జీతం వస్తుందో చెప్పండి మాష్టారూ ?

అప్పారావు : మీ బేసిక్ పే ఎంతో చెప్తే నేను లెక్కగట్టి చెప్తాను!

కిషోర్ : ఎక్స్‌క్యూజ్ మీ సార్ ! (అప్పారావ్ వంక చూసి) సార్ - నాకీ లెక్క అర్థం కావడంలేదు ! నిన్న నేను ఈ డౌట్ అడిగితే ఈ రోజు లీజర్లో కలవమన్నారు కదా !

అప్పారావు : నీ డౌట్స్‌కి ఓ వేళా పాళా లేదటోయ్ ? సాయంత్రం కలువు- చెప్తాను. (సోమయ్య

వంక తిరిగి): ఆ- మనం ఏ టాపిక్‌లో వున్నాం ఇప్పుడూ? ఆ - బేసిక్ పే కదూ నేను అడుగుతోంది?

రాజారావు : ఆ బేసిక్ పే సంగతి అలా వుంచండి మాష్టారూ! ఈసారి ఎలాగైనా సరే యల్టీసీ కోసం మన ఉపాధ్యాయ సంఘాల్లోని అన్ని గ్రూప్‌లూ కలిపి పోరాడాల్సిందే !

సోమయ్య : అవును మాష్టారూ ! ఈ దెబ్బతో ప్రభుత్వానికి మన సత్తా ఏమిటో తెలిసి వస్తుంది !

వినోద్ : స్టాపిట్ రాజారావుగారూ ! ఎప్పటికప్పుడు ఎంత పెంచినా... ఇంకా అవి సరిపోవట్లేదని... ఇంకా ఇంకా పెంచాలంటూ మనం ఆందోళన చేస్తాం తప్ప.... మనం తీసుకునే జీతానికి తగ్గ శ్రమ మనం ఎంతవరకు చేస్తున్నాం.... పిల్లల చదువుల పట్ల మన బాధ్యతని ఎంతవరకు నిర్వర్తిస్తున్నామని... ఓసారి ఆత్మ విమర్శ చేసుకుంటే - కొంతన్నా విద్యార్థులు బాగుపడ్తారేమో ఆలోచించండి !

*-'ఆంధ్రభూమి'*

*మంత్లీ - 1989*

# స్కూల్ పెట్టి చూడు !

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ప్రసంగాలిస్తూనే...
ఆ విద్యని వ్యాపారం చేస్తున్న రాజకీయం...



(తెరవెనుకనుండి: 'డొనేషన్లు రద్దుచేయాలి! డొనేషన్లు రద్దు చేయాలి' స్లోగన్స్)

విద్యామంత్రి : అగో సెక్రెట్రీ - గదేదో లొల్లి జరుగుతోంది బయట! మళ్ళీ ఎవరి ధర్నానో ఏందో ? గాపని ఇంకెవుర్దీ ? గది మన అప్పొజిషన్ వోళ్ళదే అయ్యుంటుంది ! నువ్వట్ల బయటికెళ్ళి ఆ లొల్లి ఎవరు జేస్తుండ్రో జూసిరా.

(సెక్రెటరీ బయటికి వెళ్ళి - తొంగి చూసి - మళ్ళీ వచ్చి)

సెక్రటరీ : వాళ్ళంతా కాలేజీ స్టూడెంట్స్ వున్నట్టున్నారు సార్! మీరు విద్యామంత్రి కదా... 'ప్రైవేట్ స్కూళ్ళలో డొనేషన్లు రద్దుచేయాలి - విద్యావ్యాపారం అరికట్టాలి' అంటూ మన సెక్రటేరియట్ ముందు స్లోగన్స్ ఇస్తున్నారు !

విద్యామంత్రి : ఏందేంది ఇద్యా యాపారమా ? అంటే అదేం యాపారం అస్టెంటూ ! పేరు కొత్తగుంది !

అసిస్టెంట్ : స్కూల్ పెట్టి - తద్వారా వచ్చే లాభాలతో సొంతిళ్లు కట్టుకోవడం, పర్సనల్ ప్రాపర్టీస్ పెంచుకోవడం!

విద్యామంత్రి : గదేం యాపారమో.... గదెట్ల జేస్తరో కొంచెం ఇవరంగా సెప్పండ్రి అస్టెంటూ ! గా యాపారం కోసం కాలేజీ పోరగాల్లు గంత లొల్లి పెడ్తున్నారంటే... గదేదో ఈ మంత్రి పదవి కన్నా మంచి లాభసాటిదై వుంటుంది ! అన్నట్టు నువ్వూ నేనూ గల్సి ఓ స్కూల్ పెడ్తే ఎట్లుంటుంది అస్టెంటూ ?

అసిస్టెంటూ : పూర్వాశ్రమంలో నేనో స్కూల్ పెట్టి ఆ బాధలు పడలేక ఆ స్కూల్ ఎత్తేసి ఈ ఉద్యోగానికి వచ్చాను సార్ !

విద్యామంత్రి : ఏదో సదూకున్నోడివి కదా అని నిన్ను అడిగాను! పోన్లే ఇంటర్ ఫేలైన మా బామ్మర్దికేదైనా పని జూపమని మా ఆవిడ ఒకటే సతాయిస్తోంది. వాడికి చెప్పిజూస్త ఇస్కూల్ పెట్టమని!

అద్సరే అస్టెంటూ ఇస్కూల్ పెట్టాలంటే అదెట్ల పెట్లాల్నో తెల్సుకోవాలి గదా ! ఈ ప్రైవేట్ ఇసుక్కాల్లకి జీతాలు ఎవరిస్తరు? మన సర్కారేనా?

అసిస్టెంటు : ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్‌కి మన ప్రభుత్వమే జీతాలిస్తుంది సార్ ! అన్ ఎయిడెడ్ స్కూల్స్‌కి మాత్రం ఇవ్వదు !

విద్యామంత్రి : గట్లయితే... మరి ఆ అన్ ఎయిడెడ్ ఇస్కూల్ల లో పనిచేసే టీచర్లకి జీతాలు ఎవరిస్తరు ?

అసిస్టెంట్ : వాళ్ళ మేనేజ్‌మెంట్ కమిటీ వాళ్ళు ! వాళ్ళు పిల్లల దగ్గర ఫీజులు వసూలు చేస్తారు. ఆ ఫీజుల్నే తిరిగి టీచర్లకు జీతాల రూపంలో ఇస్తారు.

విద్యామంత్రి : మరి వాళ్ళు వసూలు చేసిన ఫీజునే టీచర్లకి జీతాలకి ఇస్తాండ్రు గదా ! మరి ఈ డొనేషన్లు ఎందుకు తీసుకుంటున్రూ ?

అసిస్టెంట్ : మరేనండీ! వాళ్ళు వసూలు చేస్తోన్న ఫీజులు చాలకేమోనండీ! ప్రతి సంవత్సరం స్కూలు అద్దెలు పెరుగుతున్నాయండీ ! ఎప్పటికప్పుడు సవరించే డీయేల్తో టీచర్ల జీతాలు పెరుగు తున్నాయండీ ! కానీ ఎప్పుడో పదేళ్ళ కిందట నిర్ణయించిన ఫీజు మాత్రం మనం పెంచలే దండీ! దాంతో వాళ్ళు దొడ్డి దారిన వెళ్తున్నారండీ! అదండీ సంగతి ! మరేమోనండీ - కొందరు స్కూల్ బిల్డింగ్ కట్టడానికి

డొనేషన్లు తీసుకుంటున్నారని చెప్తారండీ-
అసలు సంగతేమో నాకు తెలీదండీ !

విద్యామంత్రి : అసలు నన్నడిగితే ప్రైవేట్ ఇస్కూల్లన్నింట్ల ఫీజు కట్టకుండా వాళ్ళక్కూడా మనవే జీతాలిత్తామని జీవో పాస్ చేస్తే సరి.

సెక్రటరీ : క్షమించండి సార్ ! ఉచిత ప్రాథమిక విద్య పేర ఇప్పటికే కొన్ని వేల ప్రభుత్వ పాఠశాలలు తెరిచాం ! అందులో పని చేస్తోన్న టీచర్లకి జీతాలు చెల్లించడానికే ఉక్కిరి బిక్కిరవు తున్నాం ! ఆ భయంతోనే ఖాళీ అయిన టీచర్ పోస్టులను కొత్తవారితో భర్తీ చేయట్లేదు ! ఎయిడెడ్ స్కూల్స్ టీచర్ల జీతాల్నే సకాలానికి చెల్లించలేకపోతున్నాం. ఇక అన్ ఎయిడెడ్ స్కూల్ టీచర్స్కూడా జీతాలిస్తూ కూర్చుంటే మన ఖజానా ఖాళీ అవుతుంది !

విద్యామంత్రి : (దిగులుగా) మరేం చేద్దామంటారూ ? ప్రైవేట్ ఇస్కూలోళ్ళకి ఇగ మనం ఎప్పటికీ జీతా లివ్వలేమన్నట్టే గదా ?

సెక్రటరీ : మన జనాభా ఈరీతిగా పెరిగిపోతూ వుంటే - అది ఎప్పటికీ సాధ్యంకాదు సార్ ! పైగా రోజుకి నూటానలభై స్కూల్ల చొప్పున స్థాపిస్తే తప్ప ఏటేటా పుట్టుకొస్తోన్న పిల్లలకి స్కూల్స్‌లో సీటు దొరకదని ఆ మధ్య పేపర్లో కూడా వచ్చింది!

(బయట 'డొనేషన్లు రద్దు చేయాలి. డొనేషన్లు

రద్దు చేయాలి'... స్లోగన్స్)

విద్యామంత్రి : బైట - మళ్ళా లొల్లి సురయింది. వాళ్ళకి ఏంజెప్పి పంపిద్దాం సెక్రెట్రీ?

సెక్రటరీ : మీ కోరిక ప్రకారంగా డొనేషన్లు రద్దు చేస్తున్నాం అని చెప్తాం సార్ !

విద్యామంత్రి : డొనేషన్లు రద్దు చేస్తే ఇంక మన ఎజుకేషన్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన తక్లీఫ్‌లు ఇంకేం రావంటరా ?

సెక్రటరీ : రావు సార్ ! పైగా ఇంతవరకూ మన రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి... వెళ్లాయి ! ఎవరూ ఇంత ఆదర్శవంతమైన చర్య తీసుకోలేదు కాబట్టి మనకి కీర్తికి కీర్తీ లభిస్తుంది!

విద్యామంత్రి : (మీసం మీద చెయ్యేసి - గర్వంగా) గంతే నంటవా ? గట్లయితే ఇంకేం... జల్ది డొనేషన్లు రద్దుచేస్తూ జీవో పాస్ చేయుండ్రి.

సెక్రటరి : అలాగే సార్ !

అటెండర్ : అయ్యా - ఎవరో ప్రైవేట్ ఇస్కూళ్ళ యూని యన్ ప్రెసిడెంటట వచ్చిండ్రు ! మీతో మాట్లాడ్తమంటున్రు !

విద్యామంత్రి : సరే పంపించు !

ప్రెసిడెంట్ : నమస్కారమండీ.

విద్యామంత్రి : నమస్కారం ! కూకోండి - కూకోండి, ఏమిటి

మీ తక్లీఫ్ ?

ప్రెసిడెంట్ : డొనేషన్లు రద్దు చేస్తున్నారని విన్నాం ! చాలా సంతోషం ! కానీ ఎప్పుడో పెట్టిన స్కూలు ఫీజుని అలాగే వుంచారు !

విద్యామంత్రి : దానివల్ల మీకొచ్చిన తక్లీఫ్ ఏమిటంట ?

ప్రెసిడెంట్ : మా స్కూల్లో క్లాస్‌కి ముప్పై మందిని తీసుకుంటున్నాం ! మీరేమో స్కూల్ ఫీజు నెలకి ముప్పై అంటున్నారు. ముప్పై ఇంటూ ముప్పై తొమ్మిదొందల రూపాయలు - అంటే - ఆ క్లాస్ ఆదాయం తొమ్మిదొందల రూపాయలు!

విద్యామంత్రి : గా లెక్కల్తో మాకేంజేసేది ! ముందుగాల మీరొచ్చిన పనేందో సెప్పండ్రి.

ప్రెసిడెంట్ : మీరేమో ప్రైవేట్ స్కూల్స్‌లో పనిచేసే టీచర్లకి గవర్నమెంటు స్కేల్ ఇవ్వాలంటున్నారు ? మరి ప్రస్తుతం యస్జీబీటీ స్కేల్లో పనిచేసే టీచర్స్‌కి రూల్స్ ప్రకారం నెలకి పద్నాల్గొందలివ్వాలి!

విద్యామంత్రి : మీరు వసూలు చేస్తోన్న డబ్బుకి ఇంకా ఐదు వందల రూపాయలు తక్కువబడ్డాయి. గంతే కదా !

ప్రెసిడెంట్ : ఇంకా ఇంతేనా సార్ ! మా స్కూల్ కేమో సొంత భవనం లేదు. ఒక్కో క్లాస్ రూంకి కనీసం మూడొందల రూపాయల రెంట్ వుంటుంది.

విద్యామంత్రి : అయితే ఇంతకు ముందు జెప్పిన లెక్కలో ఐదు వందలు - ఇప్పుడు జెప్పిన ఇసాబ్‌లో - మరో మూడు వందలు - మొత్తం ఎనిమిది వందలు తక్కువ బడ్తాయన్నమాట - ఇస్కూల్ కి స్థలం కావాలని ఒక అప్లికేషన్ పెట్టుండ్రి. నేనిప్పిస్తా !

సెక్రటరీ : ఎన్నో గవర్నమెంట్ ఆఫీసులకే స్థలం లేక ఛస్తూంటే ఇంక ప్రైవేట్ స్కూల్స్‌కి మనం ఎక్కడ ఇప్పిస్తాం సార్ !

విద్యామంత్రి : గట్లనా... గది నాకు తెల్వదు.... (ప్రెసిడెంట్‌ని చూస్తూ) సరే సరే ! మీ ఇసాబ్ చెప్పక పోతిరి?

ప్రెసిడెంట్ : ఒక క్లాస్‌కి ఒక టీచర్ సరిపోదు సార్ ! వాళ్ళకి లీజర్ వుండాలి కదా ! ప్రతి మూడు క్లాసు లకూ కనీసం నల్గురు టీచర్లుండాలి! ఆ లెక్కన ఆ మూడు క్లాసుల మధ్య మరో టీచర్ని అపా యింట్ చేయడానికి ఒక్కో క్లాస్‌కి అదనంగా మరో నాల్గొందలు ఖర్చవుతుంది సార్ !

విద్యామంత్రి : అంటే ముందుగాల జెప్పిన ఇసాబ్‌కి - ఈ నాల్గు వందలు కలిపితే - నెలకి పన్నెండు వందలు తక్కువబడ్తయన్నమాట!

ప్రెసిడెంట్ : అంతేనా సార్ ! ఫర్నిచర్, ఎగ్జామినేషన్, కరెంట్, ఫోన్, స్టేషనరీ, గేమ్సు, సైన్స్, నాన్ టీచింగ్ స్టాఫ్, మిసిలేనియస్ వగైరా... వగైరాలకి కలిపి ఎంత లేదన్నా మరో మూ డొందలు అవసరమవుతాయి.

విద్యామంత్రి : (గుడ్లు తేలేస్తూ) అంటే ముందుగాల చెప్పిన ఇసాబ్ - గీ ఇసాబ్ రెండూ కల్పితే మొత్తం....

ప్రెసిడెంట్ : పదిహేను వందలు తక్కువ బడ్తాయి మంత్రి గారూ ! క్లాస్‌కి ముప్పైమందిని లిమిట్ చేసి ప్రభుత్వ స్కేళ్ళు ఇవ్వాలంటే మేం నెలకి ముప్పై వసూలు చేస్తే సరిపోదు ! నెలకి ఎనభై రూపాయలు వసూలు చేయాలి ! అప్పుడే మా స్కూల్లో పనిచేసే టీచర్స్‌కి సంతృప్తికరంగా జీతాలిస్తాం... మా విద్యార్థులకి అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం సార్ !

విద్యామంత్రి : మీ మనసులో గిసుంటి మంచి ఆలోచనుంటే గట్లనే కానీండ్రి! సెక్రెట్రీ - డొనేషన్లు రద్దుజేసినం కాబట్టి నెల ఫీజు ముప్పై నుండి ఎనభైకి పెంచుండ్రి.

సెక్రటరి : క్షమించండి సార్ మనం ఆ పని చేస్తే విద్యార్థులు తిరగబడ్తారు! కోరి కొరివితో తల గోక్కున్నట్టవుతుంది.

విద్యామంత్రి : ఇగో సెక్రెట్రీ - మనమా - వాళ్ళకు జీతాలు ఇవ్వక పోతిమి ! వాళ్ళనా - తీసుకోవద్దంటిమి! ఇదేమన్నా న్యాయంగా వుందటయ్యా ? నువ్వేం జెప్పకుండ - నేను జెప్పినట్టు నెల ఫీజు 30 నుండి 80కి పెంచు !

సెక్రటరీ : మీ ఇష్టం సార్ !

★★★

విద్యామంత్రి : (చేర్‌లో రిలాక్స్‌డ్‌గా చేరగిలబడి) సెక్రెట్రీ - ఇయ్యాల పేపర్లో ఏ సంగతులు రాసిన్రో సదివి ఇనిపించు.

సెక్రటరీ : (పేపర్ చదువుతూ) గవర్నమెంట్ నిర్ణయించిన ఫీజుకన్నా ఎక్కువ ఫీజు వసూలు చేసే విద్యా సంస్థల విద్యావ్యాపారాన్ని అరికట్టి వాళ్ళపై కఠిన చర్యలు తీసుకోవాలని రాశారు సార్.

అసిస్టెంట్ : సార్, ప్రైవెట్ స్కూల్స్‌లో కూడా సమాజ సేవ చేసే ఆదర్శవంతమైన స్కూల్స్ వున్నాయి ! మనమా - ఫీజు రేట్లు పెంచకపోతిమి! వాళ్ళకా - డబ్బు సరిపోకపోయే ! స్కూళ్లు నడపడానికి ఎక్కువ ఫీజులు వసూలు చేసినంత మాత్రాన సేవ సేవ కాకుండా పోతుందా ?

విద్యామంత్రి : ఏం అసిస్టెంటూ - ప్రైవేట్ ఇస్కూల్లని తెగ సైడ్ జేస్తున్నావ్ ! నువ్వే ఇస్కూల్లనైనా పాట్నర్వా ఏందీ?

అసిస్టెంట్ : సార్ ! విద్య అనేది వ్యాపారం కాదు. అందులో పార్ట్‌నర్స్ వుండరు. పార్ట్‌నర్‌షిప్ డీడ్ ఉండదు! ఆ కమిటీ మెంబర్స్ వాళ్ళు స్థాపించిన స్కూల్స్‌కి అవసరమైనప్పుడు అంతో ఇంతో ఆర్థిక సాయం అందించాలే తప్ప ఆ స్కూల్స్ ఆదాయాన్ని పంచుకోకూడదు ! ఏ మెంబరైనా ఆశిస్తే - వాళ్ళను తొలగించే అధికారం మిగతా వాళ్ళకుంటుంది!

విద్యామంత్రి : గసుంటప్పుడు గీళ్ళు స్కూల్లు ఎందుకు పెడ్తున్నరంటవ్ - మన్ను బుక్కడానికా ?

అసిస్టెంట్ : సార్ - కొంతమంది విద్యాభిమానులు విద్య మీద మమకారంతో స్కూల్ స్థాపిస్తే మరికొంత మంది కీర్తి కోసం... మరికొంత మంది భుక్తి కోసం, డబ్బుకోసం స్థాపిస్తారు ! ఈ మూడో రకం లాంటి వాళ్ళు టీచర్లకీ ఏ రెండొందలో, మూడొందలో జీతాలిస్తూ వాళ్ళ శ్రమ దోపిడితో మేడలూ మిద్దెలూ కట్టుకుంటు న్నారు! ఇలాంటివాళ్ళ మూలంగా ప్రైవేట్ స్కూల్స్ అన్నింటిమీదా పబ్లిక్‌కి ఒక దురభి ప్రాయం ఏర్పడిపోయింది!

ప్రెసిడెంట్ : అయినా మంత్రిగారూ ! నాకు తెలీక అడుగుతున్నాను ! పత్రికా విలేకర్లు 'మధ్య తరగతి ప్రజలపై ఫీజుల పెంపుదల-అధికభారం' అంటూ బోల్డు సానుభూతి కురిపిస్తూ వ్యాసాలు రాశారు! బాగానే వుంది! కానిఈ సమస్యకి మూల కారణాలు విశ్లేషించ కుండా- ఎప్పుడో పదేళ్ళ క్రితం నిర్ణయించిన స్కూలు ఫీజు ఇప్పటికీ పెంచొద్దంటే ఎలా ?

అసిస్టెంట్ : అవున్సార్ ! పది సంవత్సరాల క్రితం ఆ పేపర్ ధర యాభై పైసలు ! ఇప్పుడు రూపాయిన్నర! ఈ పదేళ్ళలో వాళ్లు తమ పేపర్ ధర మూడు రెట్లు పెంచారు ! స్కూల్ ఫీజు మాత్రం పెంచొద్దంటే ఎలా ?

ప్రెసిడెంట్ : యూ ఆర్ కరెక్ట్ సార్ ! పేపర్ ధర రోజుకు రూపాయిన్నర, రూపాయిన్నర ఇంటూ ముప్పై రోజులు! నెలకు 45 రూపాయలు, రోజుకి గంటలో చదివే పేపర్ ధర నలభై రూపాయలు! ఐదు గంటలు చదువు చెప్పే పాఠశాలకి నెల ఫీజు ముప్పై రూపాయలు ! ఇదెక్కడి న్యాయం!?

(బయట 'ఫీజుల పెంపుదల అన్యాయం! పెంచిన ఫీజు వెంటనే తగ్గించాలి' - నినాదాలు)

విద్యామంత్రి : గదేంది సెక్రెట్రీ - మళ్ళీ మన సచివాలయం బయట మల్ల ఏదో లొల్లి షురువైతున్నది...

సెక్రటరీ : నేను అప్పుడే చెప్పలేదా సార్ ! ఫీజులు పెంచితే ప్రజలు తిరగబడ్తారని! - విద్యార్థులు పెంచిన ఫీజులకి వ్యతిరేకంగా స్ట్రైక్ చేస్తున్నారు.

విద్యామంత్రి : పిల్లగాల్ల మంచికోసం గదా - టీచర్లకి సర్కార్ స్కేళ్ళు ఇవ్వడానికి గదా - మనం ఫీజులు పెంచింది ! మళ్ళీ ఇదేం లొల్లి ? ముందు జూత్తే నుయ్యి ! వెనుక జూత్తే గొయ్యి!, మనకీ తక్లీఫ్ ఏమిటి సెక్రెట్రీ?

సెక్రటరీ : ఇప్పటికైనా మించిందేమీ లేదు సార్ ! పెంచిన ఫీజుని తగ్గిద్దాం!

విద్యామంత్రి : పాపం ప్రైవేట్ స్కూళ్ళు ఎలా నడుత్తయ్ సెక్రెట్రీ? డొనేషన్లు కూడా రద్దు చేస్తిమి కదా!

సెక్రటరి : వాళ్ళ తిప్పలేవో వాళ్ళు పడ్తారు ! క్లాస్‌కి ముప్పై మందిని తీసుకున్నప్పుడు కదా వాళ్ళకా సమస్య! క్లాస్‌కి అరవై మందిని- తీసుకో మందాం! డబ్బు సరిపోతుంది!

అసిస్టెంట్ : క్లాస్‌కి అరవైమంది ఉన్నప్పుడు గవర్నమెంట్ స్కూలైనా ప్రైవేట్ స్కూలైనా - ఏదైనా ఒకటే గదా ! అంత డబ్బు పోసి ప్రైవేట్ స్కూల్లో చదివించే కన్నా - మన బిడ్డల్ని పైసా కట్టక్కర్లేని సర్కార్ స్కూళ్ళకే పంపించడం మంచిది!

అటెండర్ : ఈ అటెండర్ సెప్తున్నాడని కోపగించుకోకం డయ్యా! సర్కారు బడిలో సదూ రావట్లేదనే నా కొడుకుని ప్రైవేట్ ఇస్కూలకి పంపిస్తున్నా. గిప్పుడు గవేవో నాల్గచ్చరాలు రాత్తున్నాడు! (పెంచిన ఫీజు తగ్గించాలి - నినాదాలు)

విద్యామంత్రి : అగో - పోరగాల్ల లొల్లి మల్లా షురైంది!

సెక్రటరీ : అవున్సార్ ! ఈ గొడవంతా మనకెందుకూ ? మనం ఫీజులు తగ్గిద్దాం !

ప్రెసిడెంట్ : మీరు మా కష్టాలన్నీ వినీ- అన్నింటికీ పూ కొట్టీ - మళ్ళీ మొదటికే వస్తున్నారు మంత్రిగారూ !

విద్యామంత్రి : మిమ్మల్ని జూత్తే నాకు గోస అన్పిస్తోంది! కాని ఏం జేస్తం? మేం పబ్లిక్ వైపున వుండా ల్నాయె ! వాళ్ళకి కోపం రాకుండా జూసుకోవా ల్నాయె ! వచ్చే ఎలచ్చన్లలో వాళ్ళ ఓట్లు మాకే దక్కాల్నాయె!

ప్రెసిడెంట్ : ప్రతి సంవత్సరం ఆర్టీసీ ఛార్జీలు పెరుగుతున్నాయి. నిత్యావసర వస్తువులు, వార్తా పత్రికల ధరలూ, జీతాలూ అన్నీ పెరుగుతున్నాయి ! కాని మీరు మాత్రం ఫీజులు....

విద్యామంత్రి : సూడూ.... నువ్వెట్ల ప్రెసిడెంట్ అయినవోగనీ - ఉత్త పిచ్చోడి లాగున్నవ్ ! ఇగో - నన్నో సలహా జెప్పమంటవా ?

ప్రెసిడెంట్ : చెప్పండి సార్ !

విద్యామంత్రి : నువ్వొత్త సత్తెకాలపు సత్తయ్యవు కాబట్టి అలా ఆలోసిత్తున్నవ్! రూల్స్‌దారి రూల్స్‌వి! నీ దారి నీది ! పబ్లిక్‌కి కోపం కల్గించొద్దు గాబట్టి మేం ఫీజులు పెంచుతలేం ! ఎనభై రూపాయలు తీసుకోంది నీకు జర్గది కాబట్టి నువ్వు వాదిస్తున్నావ్ ! అసలు తెలివైన వాళ్ళు ఏం జేయాల్నో ఎరుకా ?

ప్రెసిడెంట్ : ఏం జేయాలిసార్ !?

విద్యామంత్రి : ఎనభై రూపాల్దీసుకుని ముప్పై రూపాయలకే రసీదివ్వాలి !

ప్రెసిడెంట్ : ఆ పని చేస్తే ప్రజల దృష్టిలో మేం చులకనైపోమా మంత్రి గారూ !? మిగతా యాభై రూపాయలు మేం తింటున్నా మని అనుకోరా?

విద్యామంత్రి : పేరెంట్స్ మీటింగ్‌లో వాళ్ళకి ఇసాబ్ చెప్పండి! అయినా వాళ్ళు మిమ్మల్నేం అనుకుంటే

మాకేం జేసేది ! మాక్కావల్సింది మా ప్రభుత్వం ప్రజల వైపునే వుందని వాళ్ళను కోవడం! పబ్లిక్కోపం రాకుండా మేము నడ్సుకోవడం?

ప్రెసిడెంట్ : ఇది చాలా అన్యాయం సార్ ! వాళ్ళ దృష్టిలో మీరు గొప్పగా వుండటానికోసం మమ్మల్ని వాళ్ళ దృష్టిలో నీచుల్ని చేస్తారా?

విద్యామంత్రి : గది మాకేం జేసేది !? ఇక మీరెళ్ళుండ్రి! మాకు మాట్లాడుకోవలసిన పాయింట్లు మస్తు న్నాయి! అయ్యో మర్చేపోయిన ! రేపే అసెంబ్లీ సుర్వవుతున్నది ! అసలే మా అపోజిషనోళ్లు ఏందేందో ప్రశ్నలు అడుగుతరట ! ఆటన్నిం టికీ జవాబులు జూసుకోవాలె!

ప్రెసిడెంట్ : (వెళ్తూ వెళ్తూ) కనీసం... క్లాస్‌లో ఎనభై మంది పిల్లలుంటే ముప్పై రూపాయల ఫీజూ - ముప్పైమంది పిల్లలుంటే ఎనభై రూపాయల ఫీజంటూ - అలా క్లాస్‌లోని విద్యార్థుల సంఖ్యను బట్టయినా 'ఫీ స్ట్రక్చర్' నిర్ణయిం చండి సార్ !

విద్యామంత్రి : అది కుదరని పనిగానీ మీరెళ్ళుండ్రి ! నేను మీటింగ్‌కి వెళ్ళేదుంది !

(ప్రెసిడెంట్ అక్కడినుండి వెళ్ళిపోతూ వుం టాడు)

సెక్రటరీ : మంచి పనిచేసారు సార్ ! మనం ఎట్టి పరిస్థితు ల్లోనూ ఆ ఫీ స్ట్రక్చర్‌ని మార్చవద్దు ! వాళ్ళు...

ఆ ఫీజు సరిపోక ఎక్కువ ఫీజు వసూలు చేసుకుంటూనే వుంటారు ! ఈ లోగా అలాంటివాళ్ళని పట్టుకోవడానికే మనం విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ నేర్పాటుచేద్దాం ! 'మీరు కట్టాల్సింది ఇంతే - ఇంతకన్నా ఎక్కువ ఫీజు కట్టొద్దు' అని పేరెంట్స్‌కి రోజుకో పేపర్ ప్రకటనిచ్చేద్దాం ! మనక్కావలసిన చేపలు ఆ విజిలెన్స్ వలలో పడ్తాయి! కేస్ మాఫీ చేయమంటూ మళ్ళీ ఈ స్కూల్ వాళ్ళే మన చుట్టూ తిరుగుతూ ఎంతైనా సమర్పించు కుంటారు! ఈ రకంగానైనా మీరు ఎలక్షన్స్‌లో ఖర్చు చేసిన డబ్బులు రెండింతలు వొచ్చే స్తాయి!

(ప్రెసిడెంట్ బయటికి వెళ్తూ - అటెండర్ రంగయ్యను చూసి)

ప్రెసిడెంట్ : చూశావా రంగయ్యా ! మీ మంత్రిగారి నేర్పరి తనం ! సమస్యను పరిష్కరించకుండా మరింత జటిలతరం జేసి - ప్రజలకూ మాకూ ముడేసి - తను ఎంచక్కా ఎలా తప్పుకు న్నారో!?

*-'ఆంధ్రభూమి'*

*మంత్లీ - 1989*

# బంద్‌లూ.... రాబందులూ



సురేష్ : ఒరేయ్ రాజూ, ఈ రోజు మన కమల్‌హాసన్ పిక్చర్ రిలీజ్... గుర్తుందా ? ఆరు నూరైనా నూరు ఆరైనా ఈ రోజు మనం ఆ పిక్చర్‌కి వెళ్ళి తీరాలి! అర్థమైందా ?

రాజు : అయ్యో పిచ్చివాడా ! ఈ రోజు ఏంటను కున్నావ్? భారత్‌బంద్, సినిమా హాళ్ళుక్కూడా బంద్ !

ఆనంద్ : చచ్చాం ! ఆ సంగతే మరిచిపోయా ! (అటూ ఇటూ కాసేపు పచార్లు చేసి) వెధవది హోటల్‌కి వెళ్ళి ఏదైనా పార్టీ చేసుకుందామను కున్నా - ఏదీ - హోటళ్లు కూడా అన్నీ బందే!

రాజు : (దిగాలుగా) వచ్చే ఆదివారం మా అక్కయ్య పెళ్ళి! ఎప్పట్నుంచో ఈ రోజు కొత్తబట్టలు కొనుక్కోవాలనుకున్నాను! కానీ ఇంతలోనే బంద్‌కి పిలుపునిచ్చారు ! ఈ రోజు షాప్స్ బందే! ఇక షాపింగ్ ఏం చేస్తాం ?

ఆనంద్ : పోనీ పిక్నిక్కైనా వెళ్దామంటే బస్సులన్నీ కాన్సిల్ అయ్యాయి! వీడియో కాసెట్ తెచ్చు కుందామంటే - వీడియో లైబ్రరీలు బంద్ !

రాజు : ఇంకా అన్నింటికన్నా విచిత్రం... సురేష్‌గాడు డబ్బు తెచ్చుకుందామని బ్యాంక్‌కి వెళ్తే - బందురాయిళ్లకి భయపడి బ్యాంకులు కూడా బంద్ పాటిస్తున్నాయి...

సురేష్ : (విసుగ్గా) అటు కాలేజీ లేదు ! ఇటు టైంపాస్ కూడా కావట్లేదు!

ఆనంద్ : ఐడియా ! అందరం కలిసి పేకాడుకుంటే!

రవికిషోర్ : (కోపంగా) వెధవన్నర వెధవ ! సెలవ్ దొరికితే చాలు నీకు వెధవ ఆలోచన్లే ! ఇప్పటికే దేశంలో నీలాంటి వెధవలందరూ పిలుపు ఇచ్చే బందుల్తో సర్వనాశనమై పోతోంది ! ఇంకా పేకాట కూడా ఆడతారట - పేకాట ! సిగ్గులేకపోతే సరి !

ఆనంద్ : మరేం చేయమంటావ్‌రా? తుమ్మితే - దగ్గితే - బంద్ పాటించే దేశంలో పుట్టిన పుణ్యాత్ముల మాయే !

రాజు : సరేగానీ సురేష్, నీకు గుర్తుందా ? చిన్నప్పుడెప్పుడో మనం 'ఆదివారం నాడు అరటి మొలిచిందీ .... సోమవారం నాడు సుడివేసి పెరిగిందీ'.... అంటూ పాడుకునేవాళ్ళం !

ఆనంద్ : అయితే ఏమిటటా ! ఇంత సీరియస్ మూడ్‌లో - నీకింకేం పని లేనట్టు నీ పద్యాల్తో, రైమ్స్‌తో ఇహ సుత్తి కొడ్తావా నాయనా?

రాజు : అది కాదురా ! మన సురేషో కుర్ర కవి కదా! ఇప్పుడు ఆ పాటకి బంద్ మీద వాడో పేరడీ కడ్తే ... ఏదో విని తరిద్దామనీ.....

ఆనంద్ : బాబ్బాబూ సురేష్, ఆ పని చెయ్యి! మేం బాగా బిజీగా వున్నప్పుడు.... నా కవితో - నా కవితో అంటూ నీ కవిత్వం వినమంటూ మా ప్రాణాలు తోడేస్తావ్ కదా ! ఇప్పుడు... మా చెవులూ... కళ్లూ.... నోరూ... అన్నీ నీ కప్పగిస్తాం! ఇక చెప్పు నీ కవిత్వం ! విప్పు నీ కంఠం !

సురేష్ : ఓష్ ! బంద్‌ల మీద కవిత్వమే కదా ! అదెంత పని ? అశువుగా చెప్తాను వినండి !

(కంఠాన్ని సవరించుకుని)

**సోమవారం నాడు బీజేపిబంద్ !**
**మంగళవారం నాడు రిజర్వేషన్ బంద్ !**
**బుధవారం నాడు కాంగ్రెస్ బంద్ !**
**గురువారం నాడు రాడికల్స్ బంద్ !**

**శుక్రవారం నాడు తెలుగుదేశం బంద్ !**
**శనివారం నాడు పీడీయస్యూ బంద్!**
**బంద్ బంద్‌లంటూ బంద్‌లకి పిలుపిస్తే.....**
**సోమరులందరికీ విందాయనయ్యో !**

ఆనంద్ : భేష్ ! ఇన్నాళ్ళకి పనికొచ్చిన కవితొకటి రాశావు! చాలా సంతోషం ! నీకిక సన్మానం చేయడమే తరువాయి !

రాజు : వాణ్ణి ఎందుకలా ఎగతాళి చేస్తావ్‌రా ! వాడు రాసిందాంట్లో అతిశయోక్తి ఏముంది చెప్పు ? ఈ వారమంతా మనకి బంద్‌లే అయ్యాయి ! కనీసం వచ్చేవారమైనా ఈ బంద్‌ల మధ్య మన కాలేజీ ఎన్ని రోజులు పని చేస్తుందో లెక్కెట్టి చూడరా ?

ఆనంద్ : (జేబులోంచి పాకెట్‌డైరీ తీసి, దాన్ని చూస్తూ) వచ్చేవారం ఒక్క శనివారం నాడే ఏ బందూ లేదురా !

రాజు : హేయ్‌హేయ్ ! కనీసం ఆ ఒక్కరోజైనా మనకి కాలేజీ వుంది ! హిపిప్ హుర్రే !

సురేష్ : అరే పిచ్చి సన్నాసీ - ఇప్పుడు మనకు శనివారం కూడా హాలిడే డిక్లేర్ చేశారు !

ఆనంద్ : అవును కదా ! ఆ సంగతే మరిచి పోయా (దిగులుగా ) అలాగైతే వచ్చేవారం కూడా మన కన్నీ సెలవులే అన్నమాట!

రాజు : కాని... సిలబస్ కావడం లేదని... ఓ రోజు

మన ప్రిన్సిపాల్‌కి చెప్పి, శనివారం కూడా కాలేజీ పెట్టించుకున్నాం గుర్తుందా ?

ఆనంద్ : అవునవునూ... కాని ఆ తర్వాత.... మళ్ళీ... ఆ నెక్స్‌ట్ శనివారం మన కాలేజీ నడువలేదేం!

రవికిరణ్ : లెక్చరర్సంతా మాకు శనివారం సెలవుంటే మాతో పని చేయిస్తావా అని ప్రిన్సిపాల్ ముందు చిందులు తొక్కారట! ఆ విషయం డైరెక్టర్ ఆఫ్ హైయర్ ఎజుకేషన్ దాకా వెళ్తే... ఆయన మన ప్రిన్సిపాల్‌ని పిలిపించి - 'ప్రభుత్వం సెలవు ప్రకటిస్తే నువ్వు కాలేజీ నడిపిస్తావా ?' అని మెమో జారీ చేశాట్ట!

ఆనంద్ : ఛఛ ! మన దేశంలో పనిదొంగలకి ఎలాంటి పనిష్మెంట్ లేదుగానీ - 'పనిచేస్తాం - మమ్మల్ని చేయనీయండి' అనే వాళ్లకి ఎలాంటి సత్కారమో చూడరా ?

(అప్పుడే సుబ్బారావు ఆ రోడ్డు ప్రక్కనే... అంటే... ప్రేక్షకులకి ఎదురుగా - తన టీ కొట్టు తెరుస్తాడు)

రాజు : ఒరేయ్ ! అదిగో ఆ టీకొట్టు సుబ్బారావు తన కొట్టు తెరిచాడు రా ! మనం కాసేపు ఆ కొట్లో వెళ్ళి కూర్చుందామా ? టైం పాసవుతుంది!

సురేష్ : ఏం సుబ్బారావు గారూ ! బావున్నారా ?

సుబ్బారావు : ఆ ఏదో మీ దయవల్ల ! రండి రండి, కూర్చోండి!

రాజు : (స్టూల్ లాక్కుని కూర్చుంటూ) సుబ్బారావు

గారూ! మీరు బంద్ రోజు కూడా చాలా ధైర్యంగా మీ టీకొట్టు తెరిచారు ! మాకెంత ఆశ్చర్యంగా వుందో చెప్పలేం !

సుబ్బారావు : ఏం సెయ్యను బాబూ ! రెక్కాడ్తేగానీ డొక్కాడని బతకులు మావి! ఏదో మీలాంటి బాబులొచ్చి గిరాకీ సేత్తేనేగదా మాకు రెండు పూటలా కడుపునిండేదీ !

ఆనంద్ : అవుననుకోండి ! కాని మీరు ఈ బంద్‌కి సహకరించలేదని మీమీద ఎవరైనా కక్షపెట్టు కుని మీ టీకొట్టును... ధ్వంసం చేస్తే....

సుబ్బారావు : నువ్వన్నదీ నిజమే బాబూ ! వాళ్లో పిచ్చి మా రాజులు ! ఎప్పుడు ఎవర్ని కరుస్తారో తెలీదు! కాని... ఏం సెయ్యనయ్యా ! నెలకి అయిదారు బందులంటే మాటలా !? వాడెవడో బంద్‌కి పిలుపిచ్చాడని వీడూ, వీడెవడో పిలుపిచ్చా డనీ వాడూ- బొత్తిగా 'బందుల పోటీ' అయి పోయింది. ఇది భారద్దేశం కాదు బాబూ... 'బందుల దేశం'! ఎవరైనా పూనుకుని ఈ బందుల్ని నిషేధిస్తే తప్ప ఈ దేశం బాగు పడదు!

ఆనంద్ : అవును సుబ్బారావు గారూ ! మీరు బంద్‌లు వొద్దంటున్నారు మంచిదే ! కానీ.. బంద్‌లు మానేస్తే... మన మొర ఆలకించేది ఎవరూ ? ఏ మనిషైనా - ఏ ప్రభుత్వమైనా దిగివచ్చేది ఎలా?

రవికిరణ్ : అది కాదురా ఆనంద్, నువ్వు ఒక విషయం ఆలోచించు ! మనదేశంలో బంద్‌లకి పిలుపునివ్వడం ఓ అంటుజాఢ్యమై పోయింది! ఎందరో - ఎన్నోసార్లు ఈ బంద్‌లకి పిలుపునిచ్చారు కదా ! అందులో ఎవ్వరు దేన్ని ఈ బందుల ద్వారా సాధించారో మచ్చుకు ఒక ఉదాహరణ చెప్పు !

రాజు : అవున్రా ! ఆ బంద్ పాటించేది... ఒక్కరోజు ! మర్నాడు.. షరా: మామూలే ! ఎవరి దారి వాళ్ళదీ... ఎవరి పన్లు వాళ్ళవీ! ఆ ఒక్కరోజు భాగోతానికి జనాన్ని అన్ని ఇబ్బందులకి గురిచేసే... బంద్‌లకి వాళ్లు ఎందుకు పిలుపునిస్తున్నారో అర్థం కావడం లేదు!?

ఆనంద్ : ష్ ! ఒక్కరోజు భాగోతం అంటున్నావ్ ! ఆ మాట గట్టిగా చెప్పావంటే... ఈసారి మన బందురాయుళ్లు... ఏకంగా... ఏకబిగిన పది రోజుల బంద్‌కి పిలుపిస్తారేమో !?

రవికిరణ్ : హు పదిరోజుల బంద్ ! నెవర్ ! అదే జరిగితే... ప్రజలు ప్రతిఘటిస్తారని.... తిరగబడ్తారని... వాళ్ళకూ తెలుసు ! అందుకే ఎవరూ... ఏ పార్టీ వాళ్లూ... అందుకు సహకరించరు !

ఆనంద్ : అది కాదురా కిరణ్ ! బందులొద్దంటే... మరి ఎవరైనా... ఎవరికైనా తమ నిరసన వ్యక్తం చేసేదేలా ?

రవికిరణ్ : నిరసన వ్యక్తం చేయడానికి బంద్‌లే దారి

కాయా బ్రదర్ ! ధర్నాలు చేయవచ్చు, ఘెరావ్‌లు చేయవచ్చు ! సభలూ పెట్టవచ్చు, సమావేశాలు పెట్టవచ్చు ! పత్రికాముఖంగా విమర్శించనూ వచ్చు !

రాజు : అవున్రా... అలా ప్రజలకి అసౌకర్యం కల్గించని పద్ధతులు ఎన్నో వుండగా - అవన్నీ పక్కకి పెట్టి బంద్‌లు పాటిస్తూ కూర్చుంటే ఎన్ని పనిగంటలు వేస్టయిపోతాయో ఎంత శ్రమశక్తి వృథా అవుతుందో - యువత ఎంత నిర్వీర్యమై పోతుందో ఒక్కరూ ఆలోచించరేం ?

సురేష్ : ఆ బందు రాయుళ్లలో అన్ని పార్టీల వాళ్లూ వున్నారు, ఎవరికి వారు తాము అధికారంలో వున్నప్పుడు తప్ప, మిగతా రోజుల్లో ఈ బందుల్ని తమ స్వార్థానికి వాడుకునేవాళ్లే !

ఆనంద్ : అంతేకాదు ! బంద్ పేర ఎవరు అధికారంలో వుంటే - వాళ్లని హైరాన పెట్టడం ఆపోజిషన్ పార్టీల వాళ్ళకి మరో పైశాచిక ఆనందం !

రాజు : అసలు ఈ బంద్‌ల గోల చూస్తూంటే ఈ బందు రాయుళ్ల కసి... ప్రభుత్వమ్మీద కాదు... ప్రజల మీదే అన్పిస్తోంది!

ఆనంద్ : యుఆర్ కరెక్ట్ రాజు ! నువ్వన్నది నిజం కాక పోతే..... ప్రజలకి అత్యంతవసరమైన బస్సుల్నీ, రైళ్ళనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజీల్నీ, బ్యాంకుల్నీ వాళ్లు దగ్ధం చేసేవాళ్లే కారు ! అలాంటి చర్యలవల్ల వాళ్లు సాధించదల్చుకున్నదేమిటో

- నాకేమీ అర్థం కావడం లేదు.

సురేష్ : (వ్యంగ్యంగా) ఏముందీ ? వాళ్ళ వీరోచిత కార్యాల్తో కాలచక్రాన్ని వెనక్కి తిప్పి - ఏ సౌకర్యాలూ లేని బీసీ కాలంలో మన పూర్వీకులు ఎలా వుండేవాళ్ళో... మనకోసారి రుచి చూపించాలని... వాళ్ళ తాపత్రయమై వుంటుంది!

రవికిరణ్ : ఎన్నో ఏళ్ల శ్రమిస్తేగానీ, రెక్కలు ముక్కలు చేసుకుంటేగానీ- దేన్నీ కట్టుకోలేం, కూడగట్టుకోలేం ! కూలగొట్టడానికి ఎంత సేపు, దేన్నైనా నిమిషంలో బుగ్గి చేయవచ్చు! అగ్గిపుల్ల వెలిగించడం... అదో - ఘనకార్యమా - శాడిజం కాకపోతే!

రాజు : అయినా నాకో విషయం అర్థంకాదు ! ఈ ప్రజలెందుకు తిరుగబడరూ ? ఇన్ని ఇబ్బందులు పడ్తూ... వాళ్లు ఇదంతా ఎందుకు భరిస్తున్నారంటావ్ ?

ఆనంద్ : బహుశః పిల్లి మెడలో గంట కట్టేదెవరని అయి వుంటుంది?

రవికిరణ్ : ఎవరో ఎందుకూ ? మనం చాలు ! కాలేజీ విద్యార్థులం ! ఎవరు ఎక్కడ బంద్‌కు పిలుపు నిచ్చినా దాన్ని విఫలం చేయాలి. షాపులు తెరిచి వుంచాలి ! బస్సుల్ని తిరగనీయాలి.

రాజు : కాని... మనలో మనకే... జీడీయస్యూ, డూడికల్స్, తెలుగు భవిత, జీబీవీపీ, ఎమ్మెస్‌యూఐ

అంటూ ఎన్నో గ్రూపులు! మన విద్యార్థులు కూడా ఎప్పుడో ఒకప్పుడు బంద్‌కు పిలుపు నిస్తూ వుంటారు కదా ! మరి వాళ్ళంతా మనకి సహకరించకపోతే......

ఆనంద్ : నో, అలా జరుగుతుందని నేననుకోను ! మనం ఎవర్నీ సమర్థించడం లేదు ! పైగా అందర్నీ బందులొద్దంటున్నాం ! అలాంటప్పుడు పేచీ ఏముందీ ?

రవికిరణ్ : అన్ని గ్రూపుల్లోని మానవతా వాదులంతా కలిసి... సీరియస్‌గా ఈ విషయం ఆలోచించి- ఏ గ్రూప్‌తో సంబంధం లేకుండా కేవలం ప్రజల్ని బంద్‌ల మహమ్మారి నుండి రక్షించే వుద్దేశ్యంతో - ప్రతివూళ్లో యువకులందరితో కలిసి ఓ యువశక్తిని స్థాపించాలి.

ఆనంద్ : ఉన్న గ్రూప్‌లకి తోడు అది మరో స్టూడెంట్స్ గ్రూప్‌గా అవతరించి... ఇంకో తలనెప్పిగా పరిణమిస్తే..?

రవికిరణ్ : నోనో, అలా కాకుండా ఆ యువకులంతా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి ! యువశక్తి ఒకే ఒక లక్ష్యంతో పనిచేయాలి! అది... బంద్‌ల్ని బంద్ చేయడం ! అంతే ! ఆ తర్వాత అది ఏ విషయాల్లోనూ, ఏ రాజకీయాల్లోనూ తల దూర్చకూడదు! ఈ బంద్‌లు నామ రూపాల్లేకుండా అంతరించి పోయాక యువశక్తి దానంతటదే.. అంతర్థానం కావాలి! అవు

తుంది కూడాను !

రాజు : నీ ఐడియా బావుంది ! బ్రేవో ! మనం ఈరోజే ఈ యువశక్తికి అంకురార్పణ చేద్దాం ! దానికి నువ్వేలీడర్వి !

రవికిరణ్ : సారీ రాజూ ! ఆ లీడర్షిప్ పేర ఎన్నికలు మొదలై చివరకు రాజకీయాలు ప్రవేశిస్తాయి! అప్పుడు మన లక్ష్యమే దెబ్బతింటుంది. మన యువశక్తికి ఏ లీడరూ అక్కర్లేదు! మనది సమిష్టి నాయకత్వం !

రాజు : ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల ఆస్తిపాస్తులకీ, ప్రభుత్వ ఆస్తిపాస్తులకీ మనం కవచాల్లా నిలవాలి! ఆ బందురాయుళ్ళని ఎదుర్కోవాలి! మనక్కావలసింది ప్రజలు ప్రశాంతంగా వుండటం ! హాయిగా ఊపిరి పీల్చుకోవడం !

చంటి : (ప్రవేశిస్తూ) అన్నయ్యా ! మీరు ఇక్కడున్నారా? మీకోసం ఎక్కడెక్కడ వెదికానో తెలుసా ? మీ ఫ్రెండ్సందర్నీ తీసుకుని అమ్మ ఇంటికి రమ్మంటోంది ! బ్రేక్ఫాస్ట్ చేసి వెళ్ళమంటోంది.

రవికిరణ్ : పదండిరా ! ఇంటికి వెళ్ళి బ్రేక్ఫాస్ట్ చేసి వద్దాం!

(ఆ మిత్రబృందం బయటికి వెళ్తారో లేదో... ఇంతలో బందురాయిళ్ళ గుంపొకటి అటువైపు వచ్చి సుబ్బారావు టీ కొట్టులో దూరి... అతణ్ణి బయటకీడ్చి అతడితో వాగ్వివాదం పెట్టుకుంటారు.

ఆ వివాదాన్నంతా.... నేపథ్యంలోంచి పాట రూపంలో వస్తూంటే...దానికనుగుణంగా... బందురాయుళ్లూ... స్టేజీమీదున్న మిగతా పాత్రలూ.... పెదవులు కలుపుతూ తమ తమ పాత్రలు పోషిస్తూ వుంటారు)

గళ్లలుంగి రౌడి : ఈనాడు బందుంటదనీ - సెప్పినమ్ నిన్నా
॥ఈనాడు॥

బొచ్చుటోపి రౌడి: బంద్ పెట్టు దుకాణం - ఉన్న పళంగా ! ఒరేయ్ ॥బందు॥

తల్వార్‌రౌడి : లారీలూ, ఆటోలూ, రిక్షాలైనా ॥లారీలూ॥

మఫ్లర్‌రౌడి : రోడ్డుమీద కన్పడ్తే - అగ్గిపెడ్తాం,
అరేయ్ ॥రోడ్డు॥

సుబ్బారావు : నిన్న మొన్న ఆ మొన్నా - తిండి లేదన్నా
॥నిన్న॥
బంద్ వుంటే నాకేడా పనీ - దొరకదు
॥బందు॥

సుబ్బారావు భార్య: ఒక్కటొక్కటొక్కటొక్కటొక్కటొక్కటీ
॥ఒక్కో॥
నెలకి అయిదు బంద్‌ల్ మా ఉసురు తగలనీ
॥నెలకి॥

సుబ్బారావు పాప: అన్న నీ కాల్మొక్తా - బంద్ పెట్టకూ
॥అన్న॥
అయ్య నీ బాంచెన్ మా కడుపు గొట్టకూ
॥అయ్యా॥

గళ్ల లుంగీ రౌడి : ఎహేఁ పొల్ల నీ లొల్లి ఏంది... అడ్డం రాకూ

॥పొల్ల॥

సూత్తవేర, ఆ పోరిని పక్కకు తోసేయ్

॥సూత్త॥

(పాట మధ్యలో మ్యూజిక్ - ఆ మ్యూజిక్‌లో బస్ వచ్చినట్టు హారన్ ! బందురాయుళ్లలో కొందరు సంతోషంతో చెంగున దూకి తెర వెనక్కి, వెళ్ళి బస్ డ్రైవర్ని స్టేజీ మీదకు లాక్కొస్తారు)

బొచ్చుటోపీరౌడి : (డ్రైవర్ కాలర్ పట్టి)

బంద్ వున్నరోజు

నువ్వు గమ్మునుండకా ॥బందు॥

బస్సు నడిపె దమ్మా -

నీ దుమ్ము దులుపుతాం! ॥బస్సు॥

తల్వార్‌రౌడి : (గళ్ళలుంగి రౌడీ నుద్దేశించి)

సూత్తవేర అగ్గిపెట్టె - అందుకోబే - అరేయ్

॥సుత్త॥

గాంచునూనె పోసి - అంటించి రాబే, అరేయ్

॥గాంచు॥

(అదే బస్సులోంచి దిగిన ఓ అవ్వ - డ్రైవర్ వెనకాలే వస్తూ, బందురాయుళ్ళ కాళ్లావేళ్లా పడ్తూ...)

అవ్వ : బిడ్డ నీ బాంచెనయ్య - బస్సు తోలనీ ॥బిడ్డ॥

బస్సులో నా బిడ్డుందీ - సావు బతుకుల్లో

॥బస్సు॥

(ఇంతలో స్టేజీకి ఒక మూలనుండి సైకిల్ మీద పాలడబ్బాతో - పాలబ్బి ప్రవేశిస్తాడు, బందురాయుళ్లు వీరోత్సాహంతో - అతడి సైకిలాపి, సైకిల్ మీదున్న పాలడబ్బా లాక్కుని... స్టేజీ ముందున్న ఖాళీ ప్రదేశంలో ఆ పాలు పారబోస్తూ....)

మఫ్లర్‌రౌడి : పాలడబ్బ తీసికెళ్ళి -
మోరిల పొయ్యి,
అరేయ్...... ॥పాల॥

(మరో మూల నుండి కూరగాయలమ్మే వ్యక్తి నెత్తిమీద కూరగాల బుట్టతో ప్రవేశిస్తాడు ! బందు రాయుళ్లు అతణ్ణి చుట్టుముట్టి - అతడి నెత్తి మీది గంపని కిందపడేసి ఆ కూరగాయల్ని చిందరవందరగా తన్నేస్తారు. కిందపడిన ఆ కూరగాయల్లోంచి కొన్ని టమాటాలు ఏరుకొని విలాసంగా తింటూ వుంటాడు)

గళ్లలుంగి రౌడి : వొంకాయల్... సొరకాయల్...
పెంటల పొయ్యా! ॥వొంక॥
(ఇంతలో అవ్వకూతురు... వొంకర్లు తిరిగి పోతూ... గిల గిల తన్నుకుని కన్ను మూస్తుంది!)

అవ్వ (ఆవేశంగా): మీ యింట్ల పీనుగెల్ల -
ఈ బంద్‌లెందుకూ ॥మీ॥
పచ్చిబాలింత సచ్చె -
బస్సు నడువక ॥పచ్చి॥

డ్రైవర్ : ఏదేదో సాకు చెప్పి - బంద్‌పెడ్తరా ॥ఏదే॥
బంద్‌పెట్టి జనాన్ని ఇబ్బంది పెడ్తరా ॥బంద్॥
బస్సు కాలబెడ్తే - ఆ నష్టమెవరికీ ॥బస్సు॥
చార్జి పెంచుతారు... తిరిగి బస్సు కొనుటకూ
॥చార్జి॥

అవ్వ(ఏడుస్తూ) : ఇంట్లో ఎలుకలుంటే - ఇల్లు కాలబెడ్తరా
॥ఇంట్లో॥

మీ వేలితో - మీ కన్నే పొడుసుకుంటరా
॥మీ వేలి॥

(అప్పుడే బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని - అక్కడికి వచ్చిన రవికిరణ్, సురేష్, రాజు, ఆనంద్‌లు... విషయం గ్రహించి బందురాయుళ్ళ ఆగడా లని ప్రతిఘటిస్తూ...)

రవికిరణ్ & పార్టీ:బందు గిందులంటు మీరు - ముందుకొస్తే,
ఒరేయ్... ॥బందు॥
ముందు ముందు మా చేతిలో -
మీకు మూడురో ॥ముందు॥

(తెర)

*రచనా కాలం: 1988*

# ఈవ్ టీజింగ్



(జగన్ కాలేజీ గార్డెన్లో పచార్లు చేస్తూ వుంటాడు)

జగన్ : (వాచీ చూస్తూ) తొమ్మిదవుతోంది ! కాలేజీకి రోజూ ఠంచన్‌గా తొమ్మిదింటికే వచ్చే లలిత ఈ రోజు ఇంకా రావట్లేదేమిటి చెప్మా !? కాళ్లు నెప్పెడ్తున్నాయ్ ! వెధవది - ఈ కాలేజీ గార్డెన్లో కూర్చోవడానికి కనీసం సిమెంట్ బెంచీ అయినా లేదు! కింద కూర్చుందామంటే ఈ టైట్ ప్యాంటెక్కడ ఫట్‌మంటుందో ?

ఆనంద్ : (ప్రవేశిస్తూ) జగన్ !

ప్రేమ్ (ప్రవేశిస్తూ) జగన్ !

ఆనంద్ : (చెవిలో గట్టిగా) ఒరేయ్ జగన్ !

జగన్ : (ఉలిక్కిపడి) : యూ రాస్కెల్ ! గాడిదలా ఓండ్ర పెట్టడం మినహా నాజూగ్గా పిలవడం చేతనయితేగా ! అదే నా లల్లీ అయితేనా ? ఎంచక్కా జగన్ జగన్ అని ఎంత తీయగా పిలిచేదో ?

ప్రేమ్ : (ఆశ్చర్యంగా) ఒరేయ్ లలితేమిటీ.... నిన్ను పిలవడమేమిటీ? (జగన్‌ని భుజాలు పట్టు కుని ఊపుతూ) కలగంటున్నావా బ్రదర్?

జగన్ : (పారవశ్యంగా) అరేయ్ ప్రేమ్ ! ఒరేయ్ ఆనంద్! (కాలర్ సర్దుకుంటూ) ఈ రోజు నా అందాల రాణి... స్వప్న సుందరి... జీవన జ్యోతి... లలితకి ఎన్నాళ్లనుండో రాయాలను కున్న వుత్తరం రాసేశాన్రా !

ఆనంద్ : కొయ్‌రా కొయ్ !

జగన్ : మీరు నా మాటలు నమ్మరనే... లలితకి రాసిన లెటర్ కాపీ వొకటి వుంచుకున్నాన్రా ! చదవ మంటారా ?

ప్రేమ్ : వైనాట్.... ష్యూర్ !
(జగన్ చదవడం మొదలెట్టాడు)

జగన్ : నా అందాల రాణి లలితకి -
ఆనాడు నా సైకిల్‌పై వెళ్తూ - వెళ్తూ - నీ అందమైన జడలోని గులాబీని వాసన చూశా నని నీక్కోపమొచ్చి 'థూ' అంటూ నాపై

ఊఁశావ్ !

అబ్బ ! ఆ కోపంలో నువ్వెంత అందంగా వున్నావనీ ?

ప్రతిరోజూ మీ వీధిలోంచి వెళ్తూ... మీ ఇంటి కిటికీ గుండా నీ గదిలోకి తొంగి చూస్తున్నానని ఒకరోజు కోపం వచ్చి నాకంట్లో కారం కొట్టావ్ గుర్తుందా ?

అదినాకు - మరువలేని - మరుపురాని సంఘటన !

మరో రోజు నా వెనకాల వస్తోన్న నిన్ను చూసే ప్రయత్నంలో- నా ముందొస్తోన్న గాడిదను తెలీకుండా వాటేసుకున్నానని ఫక్కుమన్నావ్!

అబ్బ.... ఆ నవ్వులో... ఆ పోజులో నువ్వెంత అందంగా వున్నావో !?

నోట్ : నేనిది నీకు రాసే తొంభైతొమ్మిదవ వుత్తరం ! కనీసం ఈ వుత్తరానికైనా రిప్లయి ఇవ్వమనీ - ఇవ్వకపోతే మీ ఇంటి ముందరే హంగర్ స్ట్రయిక్ చేస్తాననీ బెదిరిస్తున్నాను.

ఇట్లు

నిన్ను మనసారా యిష్టపడే

జగన్.

(చదువుతూ - ఆ వుత్తరాన్ని ముద్దెట్టు కుంటాడు)

ప్రేమ్ : వండ్రఫుల్ !

ఆనంద్ : మార్వలస్ !!

ప్రేమ్ : ఎక్సలెంట్ !!!

ఆనంద్ : ట్రెమండస్ !!!!

ఆనంద్ : అన్నట్టు - ఇంత అందమైన లవ్ లెటర్ ఎలా రాయగలిగావురా?

జగన్ : మనలోమాట ! అంత తెలివి నాకుంటే - బాగానే ఉండేదిరా! కానీ.... అది మన కాలేజీలో కథలు రాసే కవిశ్రీ లేడూ... వాడిచేత రాయించాన్రా !

ప్రేమ్ : (నీరసంగా) - ఓ, ఐసీ ! అలా చెప్పు ! నేనింకా ఇది నువ్వు రాశావేమోననీ - నాక్కూడా ఒకటి రాసి పెడ్తావేమోననీ తెగ మురిసిపోతున్నాను ఇందాకట్నుంచీ!

ఆనంద్ : అన్నట్టు - నీ చేతికా కట్టేమిట్రా ?

జగన్ : (నిర్లక్ష్యంగా) ఓ... ఇదా ? - మొన్న పెద్దజడ విజయ లేదూ - విజయ... ఆమెని వెనుక నుండి సైకిల్‌పై వెళ్ళి డాష్ ఇచ్చానని... వాళ్ళన్నయ్య చితక్కొట్టాడ్రా ! అబ్బ ! నెప్పెడ్తోందిరా !

ఆనంద్ : ప్చ్ పాపం ! నాకు నిన్ను చూస్తోంటే జాలేస్తోంది రా చిట్టితండ్రీ! ఇంటర్లో ఇందిరను ప్రేమించి చెప్పుదెబ్బలూ, షష్టియర్లో పద్మను ప్రేమించి

చెంపదెబ్బలూ, సెకండియర్లో శైలజను ప్రేమించి చావుదెబ్బలూ తిన్నావ్ ! ఇప్పుడీ లలిత! పోనీ లేరా జగన్ ! ఇప్పుడైనా... నీ ఈ ప్రయత్నంలో విజయాన్ని సాధించు!

ప్రేమ్ : (ఆనంద్‌తో) వీడేదో కోస్తున్నాడుగానీ... నాకయితే... లలిత వీడి వుత్తరాన్ని అటుంచి - వీడి కాలి గోరునైనా చూస్తుందన్న నమ్మకం లేదురా !

జగన్ : శుభమా అంటూ మంచిరోజు చూసుకుని నేను ప్రేమలేఖ రాస్తే, ఏమిట్రా కూస్తున్నావ్ జెలసీ వెధవా ?

ఆనంద్ : ఒరేయ్.... ముందు - నీ లలిత సంగతేమో గానీ - అదిగో మనవైపు గీత వస్తోందిరా... గీత!

జగన్ : ఈజిట్ సో ? వాటెఛాన్స్ ! - పోనీ - ఆ లలిత కాకపోతే ఈ గీత ! నా రాతలో కనీసం ఈ గీతైనా నాకు దక్కితే - ఏడు కొండల వాడా... వెంకట్రమణా.... నీకు నా తలనీలాలు సమర్పి.....(నాలుక కర్చుకుని) అమ్మో! ఈ అందమైన జుట్టపోతే ... ఏ ఆడపిల్లా నా వంక చూడదే - ఎలా ? (కొద్దిగా ఆలోచిస్తున్నట్టు పోజుపెట్టి) పోనీ - ఓ వంద రూపాయలు నీ హుండీలో వేస్తాను స్వామీ... నన్నునుగ్రహించు! (ఇంతలో గీత ప్రవేశిస్తుంది)

జగన్ : హలో డార్లింగ్ ! హౌడుయుడూ !

(గీత కోపంగా వెళ్ళిపోతూ వుంటుంది)

జగన్ : ఏమండోయ్ ! ఇటుచూడండీ ! ఒక్కసారి ఇటు చూశారంటే మీ సొమ్మేం పోదండీ !

ఆనంద్ : ఒరేయ్ ఆమె సొమ్మేమోగానీ ముందు నీ పరువు పోయేలా వుందిరా బ్రదర్ ! సబిన్స్‌పెక్టర్ ఇటు వైపే వస్తున్నాడు.

ప్రేమ్+జగన్ : చచ్చాంరా బాబోయ్ !

(ముగ్గురూ పరిగెడ్తారు. సబిన్స్‌పెక్టర్ ప్రవేశి స్తాడు)

ఇన్స్‌పెక్టర్ : దొంగ వెధవలు ! నిముషంలో తప్పించు పోయారు ! ఈసారి వాళ్ళని రెడ్ హాండెడ్‌గా పట్టుకుంటే తప్ప లాభంలేదు (వెళ్ళిపోతాడు)

ఆనంద్ : ఒరేయ్ జగన్ ! సబిన్స్‌పెక్టర్ వెళ్ళిపోయాడ్రా! బయటికి రారా చిట్టితండ్రీ !

(భయంతో జగన్ బయటికి రాడు)

ఆనంద్ : అరేయ్... అరేయ్... అదిగో లలిత కూడా వస్తోందిరా !

జగన్ : (సంతోషంతో బయటికి వచ్చి) నిజంగానా !? ఒరేయ్ ప్రేమ్... అరేయ్ ఆనంద్, ఎందుకైనా మంచిది... మీరెక్కడైనా ఈప్రాంతాల్లోనే వుండండిరా బాబూ !

ప్రేమ్ : ఏరా భయమేస్తోందా ?

జగన్ : ఏంకూశావ్ రా ! భయమా ? నాకా ? మన

కాలేజీ వుడ్‌బీ ప్రెసిడెంట్‌ని - నాకా భయం!? ఒక్కనాడైనా ఆడపిల్లకి లవ్ లెటర్ రాయని పిరికిపందా, నీకు భయం... నీ అయ్యకు భయం... నీ అయ్య అయ్యకు భయం....!

ప్రేమ్ : అయ్యా ! జగన్ మహాశయా ! రైట్ ! ఒప్పుకుంటున్నాను. ముందా లలిత సంగతేమిటో చూడూ, మేమలా దాక్కుంటాం!

(ప్రేమ్ ఆనంద్ వెళ్ళిపోతారు-లలిత ప్రవేశిస్తుంది)

జగన్ : హలో లలితా, నా లవ్ లెటర్ అందిందా ?

లలిత : మిస్టర్ ! ఒకరు రాసిపెట్టిన వుత్తరాన్ని కాపీ చేస్తేనే అన్ని తప్పులున్నాయి ! ఇక మీ ఒరిజినల్ లెటర్ యింకెంత అందంగా వుండేదో ?

జగన్ : లల్లీ....

లలిత : లల్లీ అట లల్లీ - పిల్లీలాగా ! వాక్యానికి పదహారు తప్పులున్నాయ్ ! ఏ ధైర్యంతో లవ్ లెటర్ రాసినట్టు !

జగన్ : లలితా....

గీత : (ప్రవేశిస్తూ) పాపం... అతడికి ఆడపిల్ల కనిపిస్తే చాలు... పని మనిషి లచ్చి దగ్గర్నుండీ... పక్కింటి పిన్ని, పొరుగింటి బుజ్జీ... ఎవరు కన్పించినా ఇంతేలేవే !

జగన్ : గీతా... నువ్వు నన్ను మరీ అలా తీసి పారేయకు

- (లలితను చూస్తూ) నువ్వులేని నా జీవితాన్ని వూహించుకోలేను లల్లీ ! వూహించి బతకలేను లల్లీ, బతకలేను !

లలిత : ఛ్ఛ ! బొత్తిగా పాత డైలాగ్స్ ! చప్పగా వున్నాయ్! మిస్టర్ జగన్ ఇది నాటక రంగం కాదు... సినిమా సెట్ అంతకన్నా కాదు....!

(అంటూ చరచరా వెళ్ళిపోతుంది! గీతకూడా ఆమె వెనకాలే వెళ్ళిపోతుంది)

జగన్ : (తేరుకుంటూ) : ఎంత పొగర్రా దీనికి ? ఇదేదో తనేదో మహా అందగత్తెననుకుంటుందేమో ! ఈ జగన్ అంటే అల్లాటప్పాగాడనుకుందల్లే వుంది! చూపిస్తా నా తడాఖా !

ప్రేమ్ : (ప్రవేశిస్తూ) ఒరేయ్ జగన్ ! ఎందాక వచ్చిందిరా - నీ ప్రేమాయణం !?

జగన్ : (కోపంగా) నీ తలకాయ దాకా వచ్చిందిరా డొక్కు రాస్కెల్ !

ప్రేమ్ : (తెల్లబోతూ) మధ్య నేనేం చేశాన్రా ?

జగన్ : ఏమీ చేయలేదనేరా నా బాధ ! లలిత అన్ని తిట్లూ తిట్టిందా? చాటుగా పందికొక్కుల్లా పొంచి వింటున్నారేగానీ... కనీసం ఒక్కడైనా... ఒక్కడైనా... సాయం చేశారా ? ఇప్పుడు హోటల్ కెళ్దాం రారా అంటే ఎవర్రెడీ... భుజాలెగరేస్తూ వొస్తారు నమ్మకద్రోహులు, ఛీ ఛీ !

రవి : (ప్రవేశిస్తూ) ఏరా ? ఈపాటికి ఏ సినిమా హాల్

వద్దో, బస్టాండ్‌వద్దో, విమెన్స్ కాలేజీ గేట్ ముందో పడిగాపులు కాస్తూండే వాళ్లు - ఈ రోజిలా మన కాలేజ్ గేట్ ముందే దిగాలుగా కూర్చున్నారేంరా - సిగరెట్లకి డబ్బుల్లేవేమిటి?

ఆనంద్ : సిగరెట్లకేం గానీ... ముందు జగన్‌గాడికి కూల్ డ్రింక్స్ తెప్పించి పుణ్యం కట్టుకోరా తండ్రీ ! వాడసలే భగ్గుమంటున్నాడు.

రవి : అలాగే తెప్పిస్తాను గానీ... మీరిది విన్నారుట్రా! ఈ రోజు విమెన్స్ కాలేజీవాళ్ళ మ్యాగజైన్ రిలీజైంది ! అందులో ఎర్రగా... సన్నగా... నాజుగ్గా వుంటుందీ... లలిత అనీ... ఆమె ఓ కథ రాసిందిరా !

ఆనంద్ : వెధవ కథ ! ఈ రోజుల్లో కలం పట్టే ప్రతి వెర్రి వెంగళమ్మా- తనూ ఓ కథ రాస్తానంటూ పోజు పెడ్తోంది ! బోడికథ రాసుకోనీరా !

రవి : (కోపంగా) నువ్వన్నట్టు బోడి కథ అయితే బాగానే వుండేదిరా... కాని... కాని.. ఆమె రాసిన ప్రతి వాక్యంలోనూ ఆడపిల్లల్ని ఏడ్పించే మగాళ్లని దుమ్మెత్తి పోసిందిరా !

ప్రేమ్ : (శాంతంగా) ఏనుగెడుతూంటే ఊరకుక్క లలాగే మొరుగుతాయ్.... రాసుకోనీరా... మనదేం పోయింది !

రవి : (ఆవేశంగా) ఒరేయ్... మనం... మీసమున్న మగాళ్లంరా ! ఆ మాత్రం రోషం రాదుట్రా !

ఆఫ్టరాల్ ఓ ఆడది.... దొరికిందే ఛాన్సనీ... మన మీద దుమ్మెత్తి పోస్తుందా ?

ఆనంద్ : పోనీ... మనమూ ఈ ఆడవాళ్లని దుయ్యబడ్తూ మన కవిశ్రీ గాడి చేత ఓ కథ రాయిస్తే....

జగన్ : ఛ..ఛ..ఛ ! ఈ రాతలూ, కోతలూ ఆడవాళ్లు చేసే పనుల్రా ! మనం - మన ప్రతాపాన్ని రాతల్లో కాదు చేతల్లో చూపించాల్రా! చేతల్లో!

రవి : రైటే - ఒప్పుకుంటాను ! మరేం చేద్దాం !?

జగన్ : ఏం చేసేదేమిటీ ? ఎప్పుడో చేశాను ! లలిత పేరూ - నా పేరూ కలిపి - పెళ్ళి పత్రికలు ప్రింట్ చేయించాను ! కొన్ని గంటల్లో అవి నా చేతికి రాబోతున్నాయ్ ! ఊళ్లో వాళ్లందరకీ పంచి పెడ్తాను ! దెబ్బతో ఆమె తిక్కకుదుర్తుంది ! చచ్చినట్టు మన కాళ్ల బేరానికి దిగి వస్తుంది ! ఎలా వుందిరా మన ఐడియా?

ఆనంద్ : నీ ఐడియాకేంరా ! బ్రహ్మాండంగా వుంది ! ఇంత చక్కటి ప్లాన్ తట్టే నీ బుర్రకి నేనే రాష్ట్రపతి నయ్యుంటే 'బుర్రశ్రీ' బిరుదిచ్చే వాణ్ణిరా!

(అదే సమయంలో గీత వస్తూ వుంటుంది)

ప్రేమ్ : ఒరేయ్ జగన్ ! అదిగో - గీతవ స్తోందిరా...ఒరేయ్ జగన్... చిన్న రిక్వెస్టురా... నీ లలిత జోలికి నేను రాను గానీ... నువ్వు

మాత్రం.. ఆ గీతను నాకు వదిలి పెట్టరా బాబూ !

జగన్ : సరేలేరా... ఒప్పుకున్నాను !

రవి : ఒరేయ్.... ఈ లోగా మేం కాలేజీ క్యాంటీన్‌కి వెళ్లొస్తాం... బీకేర్‌ఫుల్.. బెస్టాఫ్‌లక్ !

(ఆనంద్, రవి, జగన్ వెళ్లిపోతారు - గీత ప్రవేశిస్తుంది. గీత తన వెనకాల - ప్రేమ్ వెంట పడటం గమనించి:)

గీత : (తీయగా) ప్రేమ్ !

ప్రేమ్ : (పొంగిపోతూ) ఎస్ మిస్ !

గీత : ఇందాక జగన్... ఏమిటో... అంటున్నాడు.

ప్రేమ్ : ఓ... అదా ! వాడుత్త జులాయి వెధవ కదా ! ఎప్పుడూ ఏదో వాగుతూ వుంటాడు !

(గీత తండ్రి రంగారావు ప్రవేశిస్తూ)

రంగారావు : ఏమిటమ్మా గీతా ? నువ్వింకా ఇక్కడే వున్నావ్! అవతల మీ అమ్మ ట్రైన్‌కి టైమైందంటూ.... నువ్వింకా రాలేదని కంగారు పడ్తోంది! (కళ్ళజోడు తీసి చూస్తూ) ఈ అమ్మాయి - ఎవరమ్మా?

గీత : అమ్మాయి కాదు నాన్న - అబ్బాయి ! ఈయన ప్రేమ్ కుమార్ అనీ మా కాలేజీలో పేరు మోసిన సింగర్ ! మిస్టర్ ప్రేమ్ కుమార్... మీట్ మై ఫాదర్ మిస్టర్ రంగారావు !

ప్రేమ్ : గ్లాట్టు సీ యూ సార్ !

రంగారావు : వెరీవెల్ ! అన్నట్టు - ప్రేమ్‌కుమార్ ! మా గీత ఎప్పుడూ నీ గురించే చెప్తూ వుంటుంది ! నువ్వు చాలా మంచివాడివనీ - కాలేజీలో ఆడపిల్లల్ని ఏడ్పించవని బుద్ధిమంతుడంటూ వుంటే అది ఒక్క నువ్వేననీ.....

ప్రేమ్ : (సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ): ఏదోలెండి! ఏమిటో మా కాలేజీ పిల్లలు ఆడవాళ్ళని ఏడ్పించడం తప్ప ఎందుకూ పనికిరాని వెధవలైపోతున్నారండీ ! అన్నట్టు, నేనిక వెళ్లొస్తానండీ!

రంగారావు : అదేమిటి ప్రేమ్ !? కాస్త కాలేజ్ క్యాంటీన్ దాకా వెళ్లి - కాఫీ అదీ తాగివద్దాం పద !

ప్రేమ్ : నొ నో ! నాకలాంటి పాడు అలవాట్లు లేవండీ!

రంగారావు : ఇందుకేనేమో - గీత నువ్వు చాలా బుద్ధి మంతుడివని చెప్తూ వుంటుంది! చూడబోతే.... నువ్వింత మంచివాడివి కదా... ఆ జగన్‌లాంటి వాళ్ళతో ఎందుకు తిరుగుతున్నావ్ చెప్పు !

ప్రేమ్ : అవునూ... నేనూ అదే అనుకుంటున్నాను !

రంగారావు : పాపం... లలిత అభం, శుభం తెలీని పిల్ల !... అన్నట్టు ప్రేమ్! ఇందాక... జగన్.... ఏదో... ప్రింటింగ్ - అన్నాడు ! ఏ ప్రెస్‌లో అదీ !

ప్రేమ్ : సమతా ప్రింటింగ్ ప్రెస్ (అనిచెప్పి, నాలిక కర్చుకుంటాడు)

| | | |
|---|---|---|
| రంగారావు | : | ఏమిటీ - సమతా ప్రింటింగ్ ప్రెస్సా... అమ్మయ్య అడ్రస్ దొరికింది... గీతా.... రామ్మా! |
| | | (ప్రేమ్ నోరు తెరుచుకుని చూస్తూ వుండ గానే... గీతా, రంగారావూ వెళ్ళిపోయి.... జగన్... తన ఫ్రెండ్స్ రవీ, ఆనంద్‌లతో ప్రవేశిస్తాడు.) |
| జగన్ | : | (ప్రేమ్‌తో) ఇదిగోరా... వెడ్డింగ్ కార్డ్స్...! మీ వీధిలో ఇంటింటికీ వెళ్ళి పంచు! |
| రవి | : | ఏదీ నన్ను చూడనీరా.... |
| ఆనంద్ | : | ఉహుం, నన్ను చూడనీరా.... (అదే సమయంలో లలిత ఇన్స్‌పెక్టర్, గీత, రంగారావులతో ప్రవేశిస్తుంది) |
| ఇన్స్‌పెక్టర్ | : | మిస్టర్ జగన్, ఏమిటదీ ? |
| జగన్ | : | (భయపడ్తూ) ఏ...ఏ...ఏమీ లేదండీ ! (కార్డ్సని భయంతో కింద పడేస్తాడు!) |
| ఇన్స్‌పెక్టర్ | : | (వెక్కిరింతగా) మ్మమ్మమ్మరెందుకలా భయ పడ్తున్నావ్ !? తీసి చదువూ ! |
| జగన్ | : | ఏమండీ... టైట్‌ప్యాంట్ ! వంగలేనండీ ! |
| ఇన్స్‌పెక్టర్ | : | (గద్దిస్తూ) షటప్ ! తీసి చదువూ ! |
| జగన్ | : | (తీసి... వణుకుతూ చదువుతాడు) చి॥ జగన్‌కి, చి॥ లలితనిచ్చి జరుగబోవు వివాహానికి..... |
| ఇన్స్‌పెక్టర్ | : | ఆపు, లలితంటే ఎవరూ.... ఈవిడేనా ? |

జగన్ : క్కాక్కాదండీ ! ఆమె నా మేనమామ కూతు రండీ!

ఇన్స్పెక్టర్ : ఏయ్ మిస్టర్ ! అడిగిన ప్రశ్నకు సమాధానం సూటిగా చెప్పు!

జగన్ : అవునండీ... ఏదో బుద్ధి గడ్డి తింది ! క్షమిం చండి.

ఇన్స్పెక్టర్ : మిస్టర్ ! క్షమించమనగానే సరిపోతుందనుకు న్నావా? ఈ అమ్మాయి నీతో పెళ్లికి ఒప్పుకోలేదనే కదా - నీపేరూ... ఈమె పేరూ కలిపి పెళ్ళి పత్రికలు ప్రింట్‌చేసి - నల్గుర్లో నవ్వుల పాలు చేయాలని చూశావ్ ! ఈ నేరానికి నువ్వు శిక్షేదో అనుభవించక తప్పదు! పద జగన్ ! యు ఆర్ అండర్ అరెస్ట్!

(జగన్ దీనంగా వెళ్తూ వుంటాడు, మిగతా ఫ్రెండ్స్ ఒక్కరొక్కరే జారుకుంటూ వుంటారు- ప్రేమ్ మాత్రం అక్కడే వుంటాడు)

ప్రేమ్ : బాగైంది వెధవకి ! లేకపోతే ఆడవాళ్లను అల్లరి పెడ్తూ కూర్చుంటాడా ? మంచిపని చేశావ్ గీతా!

గీత : ఓహో.... నువ్వొక్కడివి మిగిలావ్ కదూ ! మిస్టర్ ప్రేమ్‌కుమార్, నీతో జగన్ ఏం చెప్పిందీ తెలుసుకోవడానికే నీతో మాట్లాడాను గానీ నువ్వంటే నాకిష్టమనుకున్నావా ? నువ్వు మాత్రం తక్కువేం తిన్నావనీ - అందరూ అందరే!

ప్రేమ్ : (దీనంగా) అన్యాయం గీతా !

గీత : యూ షటప్ ! గెటౌట్ !

**పాత్రలపరిచయం:**

జగన్ : లేడీస్ & జెంటిల్‌మెన్ ! ఇందాకే కదా జైలుకు వెళ్లాడూ... మళ్లీ ఎలా వచ్చాడ్రా అని ఆశ్చర్య పోతున్నారు కదూ ! ఆ... ఏముందండీ.... నూర్రూపాయలు లంచమిస్తే.... ఆ ఇన్స్‌పెక్టర్ కేస్ కొట్టేసి - 'నమస్తే' పెట్టి మరీ పంపించాడు! అయినా ఈ మాత్రం ఎదురుదెబ్బకే నీరుకారిపోతే ఎలా చెప్పండి ! ఆ లలిత కాకపోతే మరో గీత... సునీత... అనిత ! అంతెందుకూ? ఇంత మంది అందమైన అమ్మాయిలున్నా రిక్కడ! వీరిలో ఏ ఒక్కరికైనా నేను నచ్చకపోతానా? నన్ను మెచ్చకపోతారా? నాకు పెళ్లేకాకపోతుందా?

అదృరేగానీ... అమ్మాయిలూ నేనూ, నాలాంటి అబ్బాయిలూ...... కుక్కతోక ఎప్పుడూ వంకరే కాబట్టి మాలాంటి వాళ్ళని నమ్మకండేం! అన్నట్టు నాపేరు జగన్ కాదు! నా అసలు పేరు: ............

ఆనంద్ : మైడియర్ ఫ్రెండ్స్... (నిషాలో తూలుతూ ముద్ద ముద్దగా మాట్లాడుతూ)... ఈరోజు జగన్ గాడు విడుదలైన సందర్భంలో ప్రేమ్‌గాడు పార్టీ ఇచ్చాడు. బీరూ... బ్రాందీ... విస్కీ... చికెన్... ఒకటేమిటీ - ఎంత గ్రాండ్‌గా

జరిగిందనుకు న్నారు ! మా జగన్‌గాడు మళ్లీ జైలు కెళ్లి... మళ్లీ విడుదలై ఇలా మళ్లీ మళ్లీ పార్టీలిప్పిస్తే మాకు ఎంత కుషీ.... ఎంత మజా... ఏం కథా !

అన్నట్టు... అమ్మాయిలూ భయపడకండి ! నేను తాగలేదు ! నేను తాగుబోతును అసలే కాదు నా పేరు ఆనంద్ కాదు. నా అసలు పేరు ............

ప్రేమ్ : (సిగరెట్ వూదుకుంటూ వచ్చి) జగన్‌గాడు విడుదలైనందుకు పార్టీ ఇచ్చానంటే... కారణం వాడు విడుదలయ్యాడన్న సంతోషం కాదు ! మొన్న పరీక్షల్లో కాపీ చేస్తూంటే మా కెమిస్ట్రీ లెక్చరర్ నాతో పాటు నలుగుర్నీ పట్టుకుని డిబార్ చేశారు. ఇప్పుడు జగన్‌గాణ్ణిలా కుషామత్ చేస్తే, రేపు ఆ లెక్చరర్‌ని తన్నో బెదిరించో... పరీక్షలకి మా లైన్ క్లియర్ చేస్తాడని!

అన్నట్టు మై డియర్ ఫ్రెండ్స్, మై నేమ్ ఈజ్ నాట్ ప్రేమ్‌కుమార్.... మై నేమీజ్ ............

రవి : సీ మైడియర్ ఫ్రెండ్స్, నేను కాలేజీలో చేరింది చదవడానిక్కాదు! అటు ఏడు తరాలూ... ఇటు ఏడు తరాలూ కూర్చుని తిన్నా తరగ నంత ఆస్తి నాకుంది ! చదవడం నా ధ్యేయం కాదు! మా కాలేజీలో చదివే ఆడపిల్లల్ని ఏడ్పించడమే నా లక్ష్యం ! అంత మాత్రాన

(మగ పిల్లల వైపు చూస్తూ) ఒరేయ్... మీలో ఎవరైనా మన కాలేజీలో చదువుతోన్న నా చెల్లెల్ని ఏడ్పించడానికి సిద్ధపడ్డారా... వీపు చీరేస్తాను !

ఆ... అన్నట్టు నా పేరు రవికాదు. నా అసలు పేరు ............

రంగారావు : నన్ను చూస్తే మా అమ్మాయి వాళ్ళ కాలేజీ అబ్బాయిలు ఉత్తినే ఝుడుసుకుంటారు.

(మీసాలు సవరిస్తూ) అది ఈ మీసాల మహాత్యమే కాబోలు ! అయినా మనలో మాట! మా అమ్మాయి వాళ్ల అమ్మని నేను చూసిందీ... మెచ్చిందీ ఎక్కడనుకున్నారు ? నేను చదివిన కాలేజీలోనే!

అచ్ఛా... నా పేరు రంగారావు కాదు ! ఎస్వీ రంగారావు అంతకన్నా కాదు ! నా పేరు ............

ఇన్స్పెక్టర్ : అబ్బబ్బ ! రోజూ ఇవే కేసులు ! అమ్మాయిలను అబ్బాయిలు ఏడ్పించడం... వాళ్ళు రిపోర్ట్స్ ఇవ్వడం మాకీకేసుల్తోనే సరిపోతోందీ వూళ్లో! వెధవ వూరు ! అన్నీ ఇలాంటి కేసులే అయితే మాకేమిటి లాభం !? ట్రాన్స్ఫర్ చేయించు కుంటే తప్ప నాకు మోక్షం లేదు! ఏవో ఈ అమ్మాయిల పోరుపడలేక ఈ అబ్బా యిలను అరెస్ట్ చేస్తున్నాం గానీ ఈ సమస్య ఒక పట్టాన తీరేదా పెట్టేదా ? నిజం చెప్పొద్దు మా అబ్బాయి

కూడా అలాంటి బాపతేలెండి!

అన్నట్టు నా పేరు ............

లలిత : ఆడపిల్లలు రోడ్డుమీద అడుగుపెట్టాలంటే భయపడి పోతున్నారు. జగన్ లాంటి వాళ్ళకు బుద్ధి చెప్పడానికి మన సోదరులందరూ పూనుకుంటే తప్ప ఈ పరిస్థితులు బాగు పడవు. నా పేరు ............

గీత : ఇప్పుడు ఎంతో ఇంటరెస్టింగా ఈ నాటిక చూస్తోన్న ప్రేక్షకుల్లో- ఒకవేళ జగన్‌లాంటి వాళ్ళంటూ ఎవరైనా ఉంటే - అలాంటి వాళ్ళు ఈ నాటిక చూసాక - కొంతయినా మారితే - ఎంతో సంతోషిస్తాం !

నా అసలు పేరు ............

(తెర)

***రచనా కాలం: 1970***

# పాఠకుల స్పందన....

రాగింగ్:

★ *నేను ఇన్నాళ్ళూ అది తప్పనితెలిసీ ఎంతో ఘోరంగా మా జూనియర్స్‌ని రాగింగ్ చేసేవాణ్ణి! మీ నాటిక చదివాక... జూనియర్స్ మరీ హర్ట్ కాకుండా, సీనియర్స్‌కి కాస్త 'ఫన్'గా ఉండేలా ఎలా రాగింగ్ చేయవచ్చో తెలిసింది ! ఇకముందు... అలాంటి భయంకర పద్ధతులకి శాశ్వతంగా స్వస్తి చెప్పాలని నేనూ, మా ఫ్రెండ్సూ నిర్ణయించుకున్నాం.*

- ఎ.వి. గోపాల్, మెడికో, మద్రాస్.

★ అది ఏ కాలేజోగానీ... మీ నాటికలో సీనియర్సంతా జూనియర్స్‌ని చాలా సుతిమెత్తగా ఏడ్పించారు ! కాని... నిజానికి.... రాగింగ్... అనేది....

- ఎ. రాజేష్, వరంగల్.

– *చాలా ఘోరంగా ఉంటుంది ! ఒప్పుకుంటాను ! కానీ... ఆ ఘోరాన్నంతా... భయంకరంగా... చిత్రించి.... పాఠకుల్ని హడలగొట్టడం ఇష్టంలేక - ఆయా సంఘటలన్నీ సున్నితంగా రాసి... చెప్పదలుచుకున్న సందేశాన్ని నాటిక ముగింపులో రాయడం జరిగింది.*

-అమృతలత

★ మీ 'రాగింగ్' చదువుతోంటే మా ఇంజనీరింగ్ కాలేజీలో మేము మా జూనియర్స్‌ని ఏడ్పించిన దృశ్యాలే మా కళ్ళముందు మెదిలాయి ! అచ్చు అవే సంఘటనలూ.... అదే రకమైన టీజింగ్ ! అంత కరెక్ట్‌గా... అంత అద్భుతంగా ఎలా రాయగలిగారు?

- కె. అనంత్, కాకినాడ.

– *మీలాంటి ఇంజనీరింగ్ విద్యార్థుల్ని ఇంటర్వ్యూ చేసి - వాళ్ళ అనుభవాల్లో నాక్కావలసిన మ్యాటర్ సేకరించాను. బహుశ: వాళ్ళంతా మీ జూనియర్సేనేమో!?*

-అమృతలత

★ 'రాగింగ్' చాలా బావుంది ! ఐమీన్... మీరు రాసిన తీరు ! ఆ కాలేజీ పిల్లలు మగవాళ్ళయి వుండీ... తమ తోటి మగపిల్లల్నే అంతగా

ఏడ్పించారు ! అలాంటి శాడిస్ట్‌కి ఒకవేళ ఆడవాళ్ళే దొరికితే... ?

- డా॥ ఎస్. రంగాచారి, గోదావరిఖని.

–

*అప్పుడు అది 'రాగింగ్' కాదు ! 'ఈవ్‌టీజింగ్'*

-అమృతలత

★ మీ నాటిక రాగింగ్ ఎంతో బావుంది. దాన్ని నేను మరాఠీలో ట్రాన్స్‌లేట్ చేసి - మా మెడికల్ కాలేజీలో మా కాలేజీడే నాడు ప్రదర్శించబోతున్నాను. అలాంటప్పుడు ఆ నాటిక రచయితగా నన్ను నేను పరిచయం చేసుకోవచ్చా?

- ఎ. వేణుగోపాల్, న్యూ నాందేడ్, మహారాష్ట్ర.

– *ఆ నాటిక మూల రచయిత్రి ఎవరో చెప్పి - తరువాత ట్రాన్స్‌లేటర్‌గా మీ పేరు చెప్పుకోవచ్చు.*

-అమృతలత

<u>ఎజుకేటెడ్ ఇల్లిటరేట్:</u>

★ మీ 'ఎజుకేటెడ్ ఇల్లిటరేట్' బావుంది ! నాదొక చిన్న సందేహం ! మీకు ఎన్ని భాషలు వొచ్చు ?

- వి. నాగేష్ కుమార్ పట్నాయక్, జయపురం.

*- తెలుగూ, లింక్‌లాంగ్వేజ్ 'ఇంగ్లీష్' తప్ప మరోటేదీ నాకు రాదు !*

-అమృతలత

★ మీ 'ఎజుకేటెడ్ ఇల్లిటరేట్' ఇతర భాషలపై మాకెంతో మక్కువని కలిగించింది! ఈ నాటిక ద్వారా... విద్యార్థుల్లో జాతీయభావాలు నాటేందుకు మీరు పడ్డ కృషి ప్రశంసనీయం!

- కె. వెంకటేశ్వర్లు, నార్‌పల

★ మీ 'ఎజుకేటెడ్ ఇల్లిటరేట్' బావుంది ! అయితే నాటికలో వుండే పాత్రలను ఆ నాటిక ప్రారంభంలోనే తెలియజేస్తే - పాత్రలను సెలెక్ట్ చేసుకోవడానికి వీలుంటుంది.

-ఎ. కమలమ్మ, ఆలూరు.

*- మీ ఉద్దేశ్యం అర్థమైంది ! అయితే ఏ నాటికలోనైనా ఏ పాత్రలను*

*ఎక్కడ పరిచయం చేయాలో అక్కడే చేస్తే బావుంటుంది ! ముందుగా పరిచయం చేస్తే మళ్ళీ ఎవరు ఎవరికి ఏమవుతారా అని పేజీలను వెనక్కి తిప్పవలసి వస్తుంది! కావాలనే సాంప్రదాయబద్ధంగా వస్తోన్న ఆ పద్ధతికి స్వస్తి చెప్పాను!*

*-అమృతలత*

★ *దేశభక్తి గీతాలెన్నింటినో చదివాంగానీ... 'లింక్‌లాంగ్వేజ్' కథా వస్తువుగా తీసుకుని అంత అత్యద్భుతమైన విశ్లేషణతో మీరు రాసిన 'భరతమాత' పాటలాంటిది నేనింతవరకూ ఎక్కడా చదవలేదు! ఈ పాట నిజానికి దేశంలోని అన్ని భాషల్లోకి అనువాదం చేసి ఏ సినిమాలోనో, టీవీల్లోనో వచ్చి.... అందరి మెదళ్లలో ఇంజెక్ట్ చేయబడాలని మా ఆకాంక్ష !*

*- ఆర్. శివప్రసాద్ రెడ్డి, చాకరాయపేట,*

*ఎ. లలిత, హైదరాబాద్.*

★ మీ *'ఎజుకేటెడ్ ఇల్లిటరేట్' లో రాష్ట్రాలన్నీ భారతమాత కొడుకులుగా, భాషలన్నీ ఆవిడ కోడళ్ళుగా చిత్రీకరిస్తూ మీరు రాసిన పాట అమోఘం !*

*- వై. ఉమ, ఏలూరు.*

★ మీ 'ఎజుకేటెడ్ ఇల్లిటరేట్'లో మాతృభాష పై ఉండే అభిమానంతో ఇతర భాషలను నిర్లక్ష్యంచేస్తే - ఇతర ప్రదేశాల్లో వాళ్ళు ఎదుర్కొనే ఇబ్బందుల్ని చక్కగా వివరించారు! మీకు మళయాళం రాకున్నా - మీ మళయాళీ ఫ్రెండ్స్‌నీ  ఇంగ్లీష్ ద్వారా అర్థాలు రాబట్టి మీరీ నాటిక రాయడం నిజంగా హర్షించదగ్గ విషయం! అయితే కథలో చిన్న తప్పు దొర్లింది. అది ప్రేమ్‌నాయర్ నోటి వెంబడ 'ఎండకర్తావే! ఇత్రయం కాషో....' అన్న వాక్యం లోది ! ప్రేమ్ నాయర్ హిందూ! ఎండకర్తావే అంటే... 'అయ్యోప్రభువా !'. ఆ మాట తరుచుగా క్రిష్టియన్స్ అంటూ ఉంటారు. కేరళలోని హిందువులందరూ 'ఎండాదైవమే' అంటారు. ఈ విషయం మతాలను ఉద్దేశించి రాసింది కాదు ! మీ ప్రయత్నంలో అలాంటి చిన్న పొరపాటు కూడా రాకూడదని నా అభిలాష !

-సి. రామకృష్ణ, బెహరన్, అరేబియన్‌గల్ఫ్.

*- శ్రమ తీసుకొని... ఇంత వివరంగా చెప్పినందుకు థాంక్స్ ! కథ*

రాసినపుడు... నేను సంప్రదించింది క్రిష్టియన్ ఫ్రెండ్స్‌నే ! కాబట్టి వాళ్ళు తమ వాడుకలో వున్న వాక్యాన్నే చెప్పడం జరిగింది. మీ ఉత్తరం వచ్చాక హిందూ ఫ్రెండ్స్‌ని అడిగా. వాళ్ళలో కొంత మంది... ''ఎండా దైవమే అనేది కూడా రెండు మతాల వాళ్ళూ ఉపయోగిస్తారు. నిజం చెప్పాలంటే... హిందువులు వాడేది - ఎండాఈశ్వరే'' అన్నారు ! ఏదేమైనా... నాటికని... ఆమూలాగ్రం వివరంగా చదివినందుకు మీకు మరోసారి థ్యాంక్స్ !

-అమృతలత

★ మా కాలేజీడేకి ఏ నాటిక ప్రదర్శించాలా అని బుర్ర బద్దలు కొట్టుకుంటోన్న తరుణంలో... ఆంధ్రభూమిలో మీ నాటిక చదవడం తటస్థించింది. అలాంటి నాటికలు మీరు ఇంకా ఇంకా అందించాలని కోరుతున్నాం.

- సి. నాగాభరత్ రెడ్డి, వాయల్పాడు.

★ మీ మొదటి 'ముఖాముఖి'లో మొదటి జవాబుకి మొదటి ప్రశ్న నాదే ఉండాలని ఎంతగా ఆశపడ్డానో ! నాది వెరీ వెరీ బ్యాడ్‌లక్! ఇంతమంచి నాటికలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

- ఎస్. వేణుగోపాల్ శంకర్‌ఆమ్టె, ఆసిఫాబాద్.

★ మీ నాటికలు సింప్లీ సూపర్బ్ ! వియార్ ప్రౌడాఫ్‌యూ !

- కాట్రగడ్డ వెంకట్రావు, పామర్రు, ఎస్.ఎస్. రావు, పాలేరు, బాబూరావు, సాలాగ్రంపురం.

★ మీ నాటికలన్నీ చాలాబావుంటున్నాయి ! నేటి యువతరానికి చేయూత నిచ్చి- వారిలో వున్న నాటక కళను మేల్కొల్పడంలో ఎంతో ఉత్సాహాన్ని చూపుతున్నందుకు సంతోషం ! మాకు మీ నాటికలు ఇంకా.... ఇంకా... కావాలి! మీకివే మా అభినందనలు.

- బి.యస్.జి. రాజేంద్రప్రసాద్, ధర్మవరం; టి. గణేష్ సింగ్, ఉట్నూర్; టి. రంగారావు, గోసవీడు; కృష్ణమూర్తి, బీబీపేట; యస్. నాగరాజు, రాయచూర్; యన్. శ్రీనివాస రావు, మంత్రాలయం; పి.వి. బైరవన్, రాజంపేట్; సి.హె.చ్. సురేష్, కామారెడ్డి; కే.

కృష్ణమాచార్యులు, భువనగిరి; రాజా విజయ్, గుంతకల్లు, శ్రీనివాసులు, పొర్లపాడు; డి. ప్రసాద్, ఇబ్రహీం పట్నం.

★ మీ నాటికలన్నీ చాలాబావుంటున్నాయి ! నేటి యువతరానికి చేయూత నిచ్చి- వారిలో వున్న నాటక కళను మేల్కొల్పడంలో ఎంతో ఉత్సాహాన్ని చూపుతున్నందుకు సంతోషం ! మాకు మీ నాటికలు ఇంకా.... ఇంకా... కావాలి! మీకివే మా అభినందనలు.

*- బి.యస్.జి. రాజేంద్రప్రసాద్, ధర్మవరం; టి. గణేష్ సింగ్, ఉట్నూర్; టి. రంగారావు, గోసవీడు; కృష్ణమూర్తి, బీబీపేట; యస్. నాగరాజు, రాయచూర్; యన్. శ్రీనివాస రావు, మంత్రాలయం; పి.వి. బైరవన్, రాజంపేట్; సి.హెచ్. సురేష్, కామారెడ్డి; కే. కృష్ణమాచార్యులు, భువనగిరి; రాజా విజయ్, గుంతకల్లు, శ్రీనివాసులు, పొర్లపాడు; డి. ప్రసాద్, ఇబ్రహీం పట్నం.*